జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

WANTED

గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, నియోజకవర్గ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు 9440231967, 7989694528

రంగారెడ్డి | బుధవారం 26 మార్చి 2025 | సంపుటి : 15 | సంచిక : 201 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com


# కలెక్టర్ల పనితీరు నిరంతరం సమీక్షిస్తాం

- ప్రజల పట్ల బాధ్యతగా వ్యవహరించాలి
- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలి
- 16,347 టీచర్ పోస్టుల భర్తీకి ఏప్రిల్‌లో నోటిఫికేషన్
- జిల్లాల కలెక్టర్ల తొలిరోజు సమావేశంలో సీఎం చంద్రబాబు



ప్రజాజ్యోతి అమరావతి

ప్రజల పట్ల బాధ్యతగా వ్యవహరించి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సిన బాధ్యత కలెక్టర్లదేనని సీఎం చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అందించేలా చిత్తశుద్ధితో పనిచేయాలని ముఖ్యమంత్రి జిల్లాల కలెక్టర్లకు సూచించారు. సచివాలయంలో మంగళవారం జరిగిన మొదటిరోజు కలెక్టర్ల సమావేశంలో చంద్రబాబు మాట్లాడుతూ. ప్రజలపై మీ ప్రభావం ఎక్కువగా ఉంటుంది, మీ పనితీరుతో వచ్చే ఫలితాలు వారిపై శాశ్వతంగా చూపిస్తాయని కలెక్టర్లను ఉద్దేశించి అన్నారు. 26 జిల్లాల కలెక్టర్ల పనితీరును నిరంతరం సమీక్షిస్తున్నామని చెప్పారు. పౌరులకు అందించే 22 సేవల నుంచి అభిప్రాయాలు తీసుకుంటున్నాం. ఈ ప్రభుత్వం మా కోసమే పని చేస్తోందన్న నమ్మకం ప్రజల్లో కలిగించాలి. ఏప్రిల్ మొదటి వారంలోనే డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేస్తాం. పగడ్బంధీగా మెగా డీఎస్సీ నిర్వహించాలి. 16,347 టీచర్ పోస్టులు భర్తీ చేయాలనే దస్త్రంపైనే మొదటి సంతకం చేశాం. పాఠశాలలు ప్రారంభించే సమయానికి నియామకాలు పూర్తవ్వాలి. అధికారంలోకి వచ్చిన - మిగతా3లో



## ఆస్తి పన్ను బకాయి ఉన్న వారికి ప్రభుత్వం గుడ్ న్యూస్

- వడ్డీ బకాయిల్లో 50 శాతం రాయితీ ప్రకటించిన మున్సిపల్ శాఖ
- ప్రజల నుంచి వినతులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటన
- కోట్లాది రూపాయల బకాయిలు వసూలు అవుతాయని భావిస్తున్న ప్రభుత్వం

ప్రజాజ్యోతి అమరావతి

ఆస్తి పన్ను బకాయి ఉన్న వారికి ఏపీలోని కూటమి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. పన్ను బకాయిదారులకు రాయితీ ప్రకటిస్తూ మున్సిపల్ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెలాఖరులోగా పన్ను చెల్లించేవారికి వడ్డీ బకాయిల్లో 50 శాతం రాయితీ ప్రకటిస్తూ జీవో విడుదల చేసింది. ప్రజల నుంచి పెద్ద సంఖ్యలో వినతులు రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపింది. ఈ నిర్ణయంతో కోట్లాది రూపాయల బకాయిలు వసూలు అవుతాయని ప్రభుత్వం భావిస్తోం ది. ప్రభుత్వ నిర్ణయంతో పన్ను బకాయి పడ్డవారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## వివేకా హత్య కేసును అవినాశ్ రెడ్డి తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు



- అవినాష్ కుట్రను బయటపెట్టిన ఏపీ సర్కార్
- సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం అఫిడవిట్
- రాంసింగ్, సునీత, ఆమె భర్తను ఇరికించే ప్రయత్నం చేశారన్న ఏపీ ప్రభుత్వం
- తనను అవినాశ్ బెదరించారని ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ రాజు అంగీకరించారని వెల్లడి
- రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ కె.రాజేశ్వరరెడ్డి, ఏఎస్ఐజీ రామకృష్ణారెడ్డి కేసు మొత్తాన్ని నడిపించారన్న ప్రభుత్వం

ప్రజాజ్యోతి న్యూఢిల్లీ

మాజీ మంత్రి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసును వైసీపీ ఎంపీ అవినాష్ రెడ్డి తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నం చేశారని ఏపీ ప్రభుత్వం తెలిపింది. దీనిపై సుప్రీం కోర్టులో అదనపు అఫిడవిట్‌ను దాఖలు చేసింది. ఎంపీ అవినాష్ రెడ్డి మార్గదర్శకత్వంలోనే సీబీఐ అధికారి రాంసింగ్, సునీత, నర్రెడ్డిలపై కేసు నమోదు చేశారని అందులో పేర్కొంది. వైఎస్ వివేకా హత్య కేసును ఉద్దేశపూర్వకంగా తారుమారు చేసేందుకు కుట్ర జరిగిందని ఏపీ సర్కార్ వివరించింది. సుప్రీంలో దాఖలు చేసిన అదనపు అఫిడవిట్‌లో ఏపీ ప్రభుత్వం ఆశ్చర్యకరమైన విషయాలను వెల్లడించింది. రాంసింగ్, సునీత, నర్రెడ్డిలపై వివేకా పీఏ కృష్ణారెడ్డి దాఖలు చేసిన కేసులో అదనపు డాక్యుమెంట్లను - మిగతా3లో



## కూటమి పాలనలో రైతుల గోడు అరణ్యరోదన

- గిట్టుబాటు రేటు దక్కక అల్లాడుతున్న రైతాంగం
- తెలుగుదేశం ఎప్పుడు అధికారంలో ఉన్నా ఇదే పరిస్థితి
- మీడియా సమావేశంలో బొత్స సత్యనారాయణ

ప్రజాజ్యోతి విశాఖపట్నం

రైతుల పట్ల కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మండిపడ్డారు. విశాఖపట్నం క్యాంప్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో గిట్టుబాటు ధర లేక రైతులు అల్లాడుతుంటే కూటమి సర్కార్ నిమ్మకు నీరెత్తినట్లు - మిగతా3లో




## జస్టిస్ వర్మ అంశంపై రాజ్యసభ చైర్మన్ అఖిలపక్ష సమావేశం

- జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో నోట్ల కట్టల వ్యవహారంపై కార్యాచరణను నిర్ణయించేందుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటు
- సభా నాయకుడు జేపీ నడ్డా, ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే సైతం హాజరు
- ఇది కచ్చితంగా చాలా తీవ్రమైన అంశం
- జస్టిస్ వర్మ వ్యవహారంపై ముగ్గురు న్యాయమూర్తులతో విచారణ కమిటీ సీజేఐ ఇప్పటికే ఏర్పాటు



## ఒకే దేశం-ఒకే ఎన్నిక.. జేపీసీ గడువు పొడిగింపు!

- పార్లమెంటరీ కమిటీ పదవీకాలాన్ని పొడిగించేందుకు లోక్‌సభ మంగళవారం ఆమోదం
- కమిటీ పదవీకాలం పార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరి వారం తొలి రోజు వరకు ఉండనున్నది.
- రాజ్యసభ నుంచి కొత్త సభ్యుడికి కూడా పార్లమెంటరీ కమిటీలో స్థానం
- ఈ కమిటీలో లోక్‌సభ 27 మంది, రాజ్యసభ నుంచి 12 మంది ఎంపీలు సభ్యులుగా ఉన్నారు.



## ప్రజాప్రతినిధులు లేని పాలన ఇంకెన్నాళ్లు?

- మూడేళ్ల క్రితమే ముగిసిన బీఎంసీ కార్పొరేటర్ల పదవీకాలం
- పలుమార్లు ఎన్నికల వాయిదా... కమిషనర్ల ఆధ్వర్యంలోనే కార్యకలాపాలు
- ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ప్రతిపక్షాల మండిపాటు
- ఇంకెన్ని రోజులు ఎన్నికలు వాయిదా వేస్తారంటూ ఆగ్రహం

# వచ్చే నెలలోనే మెగా డీఎస్సీ



- మెగా డీఎస్సీపై ముఖ్యమంత్రి కీలక ప్రకటన
- ఎస్సీ వర్గీకరణతోనే డీఎస్సీ పోస్టుల భర్తీ
- పాఠశాలల ప్రారంభం నాటికి పోస్టింగ్‌లు
- వైసీపీ ప్రభుత్వ పాలనను ప్రజలు ఆమోదించలేదు
- అందుకే ప్రజలు కూటమికి తిరుగులేని తీర్పు

ప్రజాజ్యోతి అమరావతి

ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న అభ్యర్థులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గుడ్‌న్యూస్ చెప్పారు. మెగా డీఎస్సీపై ముఖ్యమంత్రి కీలక ప్రకటన చేశారు. మంగళవారం కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో సీఎం మాట్లాడుతూ.. డీఎస్సీపై స్పష్టత ఇచ్చారు. వచ్చే నెల (ఏప్రిల్) మొదటి వారంలోనే మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను ప్రకటిస్తామని చెప్పారు. ఎస్సీ వర్గీకరణతోనే డీఎస్సీ పోస్టుల భర్తీ ఉంటుందన్నారు. పాఠశాలల ప్రారంభం నాటికి పోస్టింగ్‌లు ఇవ్వాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి వెల్లడించారు. చంద్రబాబు ఇంకా - మిగతా3లో

# ప్రజాప్రతినిధులు లేని పాలన ఇంకెన్నాళ్లు?

**ముంబై:** దేశంలోనే అత్యధిక ఆదాయాన్ని కలిగిన ముంబై మున్సిపల్ కార్పొరేషన్(బీఎంసీ)కు గత మూడేళ్లుగా ఎన్నికలు జరగలేదు. దీంతో మూడేళ్లుగా ప్రజాప్రతినిధులు లేకుండానే మున్సిపల్ కమిషనర్ల ఆధ్వర్యంలో కార్పొరేషన్ పరిపాలన కార్యకలాపాలు జరుగుతున్నాయి.

**రాజకీయ పరిణామాల రీత్యా...వాయిదా**

2022, మార్చి 7న మున్సిపల్ కార్పొరేటర్ల పదవీకాలం ముగిసింది. వెంటనే ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నా ఎప్పటికప్పుడు మారుతున్న రాజకీయ సమీకరణాల కారణంగా వాయిదాపడుతూ వచ్చాయి. గత మూడేళ్లలో, ముంబై మున్సిపల్ కార్పొరేషన్ పరిపాలన బాధ్యతలను మొదట ఇక్బాల్ సింగ్ చాహల్ ఆ తరువాత భూషణ్ గగ్రానీ స్వీకరించారు. ఈ మూడేళ్లలో వీరిద్దరూ మున్సిపల్ కమిషనర్లు స్వయంగా మూడు బడ్జెట్లను సమర్పించారు. ఆర్థిక సంవత్సరానికి అనుగుణంగా నగరానికి అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టారు. మున్సిపల్ ఎన్నికలు జరగకపోయినా మూడేళ్ల వ్యవధిలో రూ.6,000 కోట్ల విలువైన వివిధ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నలిచ్చారు. ముఖ్యంగా రోడ్లు, మురుగునీటి శుద్ధి, డీశాలినేషన్ ప్రాజెక్టులు, దహిసర్%-%భయందర్ లింక్ రోడ్డులకు అనుమతులు మంజూరుచేశారు.

**ప్రభుత్వ అప్పుల పెరుగుదల....**

2024%-%25 ఆర్థిక సంవత్సరానికి మున్సిపల్ కార్పొరేషన్ అప్పులు రూ.1.90 లక్షల కోట్లుగా తేలింది. తాజా లెక్కల ప్రకారం, ఈ సంఖ్య రూ.2,32 లక్షల కోట్లకు చేరుకుంది. ప్రజా ప్రతినిధులు లేకపోవడంతో, బడ్జెట్ వ్యయంపై బహిరంగ చర్చ జరగలేదు.

**కమిషనర్లు పరిపాలించడమేమిటి?**




కమిషనర్ల ఆధ్వర్యంలో బీఎంసీ పరిపాలన జరగడమేమిటంటూ విపక్ష పార్టీలు విమర్శిస్తున్నాయి. ప్రజా ప్రతినిధులు లేని పాలన ప్రజాస్వామిక విధానాలకు విరుద్ధమని, ప్రజల అభిప్రాయాలను పట్టించుకోకుండా కీలక నిర్ణయాలు అమలవుతున్నాయని ఆరోపిస్తున్నాయి. మున్సిపల్ పాలనలో పారదర్శకత లేదని, పెద్ద మొత్తంలో నిధులు ఖర్చువుతున్నాయని మండిపడుతున్నాయి.

**మరో 6-7 నెలల తర్వాతే!**

ప్రస్తుత పరిస్థితి దృష్ట్యా ఎన్నికలు మరో 6-7 నెలలు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. 1984లో అప్పటి కమిషనర్ డి.ఎం.సుక్తాంకర్ కార్యనిర్వాహక పాలన తర్వాత మళ్లీ 38 ఏళ్లకు ముంబై మున్సిపల్ కార్పొరేషన్‌లో ప్రజాప్రతినిధులు లేకుండా పాలన జరుగుతోంది. అయితే ఈసారి ఇది మరింత ఎక్కువ కాలం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో నగర అభివృద్ధి, ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని త్వరలో ఎన్నికలు నిర్వహించాలని పలువురు నాయకులు, రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఒకే దేశం-ఒకే ఎన్నిక.. జేపీసీ గడువు పొడిగింపు..!

ఒకే దేశం-ఒకే ఎన్నిక కోసం ఏర్పాటు చేసిన పార్లమెంటరీ కమిటీ పదవీకాలాన్ని పొడిగించేందుకు లోక్‌సభ మంగళవారం ఆమోదం తెలిపింది. కమిటీ పదవీకాలం పార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరి వారం తొలి రోజు వరకు ఉండనున్నది. ఉమ్మడి పార్లమెంటరీ కమిటీ చైర్మన్ పీపీ చౌదరి లోక్‌సభలో కమిటీ పదవీకాలాన్ని పొడిగించే తీర్మానాన్ని సభలో ప్రవేశపెట్టగా.. వాయిస్ ఓటు ద్వారా ఆమోదించారు. రాజ్యసభ నుంచి కొత్త సభ్యుడికి కూడా పార్లమెంటరీ కమిటీలో స్థానం కల్పించినట్లు లోక్‌సభ సెక్రటరీ జనరల్ సభకు తెలిపారు. వైఎస్సార్‌సీపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు విజయ సాయిరెడ్డి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దాంతో 39 మంది సభ్యుల కమిటీలో ఓ పోస్టు ఖాళీ కావడంతో కొత్తగా సభ్యుడికి చోటు కల్పించారు. దేశవ్యాప్తంగా ఒకేసారి లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలను నిర్వహించేందుకు తీసుకువచ్చిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్రం లోక్‌సభలో ప్రవేశపెట్టిన విషయం విధితమే. ఈ బిల్లు భారత రాజ్యాంగ మూల స్వరూపానికి భంగం కలిగించేలా ఉందని.. జేపీసీకి బిల్లును పంపాల్సిందేనని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. దీంతో 39 మంది ఎంపీలతో జేపీసీ కమిటీ ఈ బిల్లును అధ్యయనం చేసేందుకు ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో లోక్‌సభ 27 మంది, రాజ్యసభ నుంచి 12 మంది ఎంపీలు సభ్యులుగా ఉన్నారు. కమిటీకి బీజేపీ ఎంపీ పీపీ చౌదరి నేతృత్వం వహిస్తున్నారు. మాజీ కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్, పురుషోత్తం రూపాలా, మనీశ్ తివారీ, ప్రియాంక గాంధీ, బన్సూరి స్వరాజ్, సంబిత్ పాత్రాతో పాటు పలువురు కమిటీలో సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ



కాల పరిమితి ఏప్రిల్ 4తో ముగియనున్నది. బిల్లుపై ఇంకా చర్చించాల్సిన అవసరం ఉందని సంబంధిత అధికార వర్గాలు తెలిపాయి. ఈ విషయంలో ఇప్పటికే న్యాయ నిపుణులతో కమిటీ చర్చలు జరిపింది. సుప్రీంకోర్టు మాజీ సీజేఐలు జస్టిస్ యూయూ లలిత్, జస్టిస్ రంజన్ గొగోయ్, ప్రముఖ న్యాయవాది హరీశ్ సాల్వే, డిల్లీ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏపీ షా కమిటీ ఎదుట హాజరైన అభిప్రాయాలను తెలిపారు.

## జడ్జి ఇంట్లో నోట్ల కట్టల కేసు జస్టిస్ వర్మ ఇంటికి 'సుప్రీం' కమిటీ



**ఢిల్లీ:** హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో అగ్ని ప్రమాదం జరిగిన సందర్భంలో నోట్ల కట్టలు బయటపడ్డాయి. ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టేందుకు సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా నియమించిన ముగ్గురు ప్రధాన న్యాయమూర్తుల కమిటీ ఇవాళ జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంటికి వెళ్లింది. అగ్ని ప్రమాదం జరిగిన సమయంలో బయపడ్డ నోట్ల కట్టల గురించి దర్యాప్తు చేపట్టనుంది. మార్చి 14న ఢిల్లీలోని జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో అగ్నిప్రమాదం జరిగింది. రాత్రి జరిగిన అగ్ని ప్రమాదం తర్వాత భారీ మొత్తంలో కాలిన నోట్ల కట్టలు వెలుగులోకి వచ్చాయి. దీంతో జస్టిస్ యశ్వంత్ వర్మపై ఆరోపణలు వెల్లువెత్తాయి. ఇదే అంశంపై విచారణ చేపట్టాలని సుప్రీం కోర్టు..పలు రాష్ట్రాలకు చెందిన ముగ్గురు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులతో కమిటీని నియమించింది. ఆ కమిటీలో పంజాబ్ హర్యానా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి షీల్ నాగు, హిమాచల్ ప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జీఎస్ సందవాలియా, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి అను శివరామన్‌లను సభ్యులుగా చేర్చింది. కాలిన నోట్ల కట్టల విలువ రూ.1.5 కోట్లు ఉంటుందని అంచనా అంటూ పలు రిపోర్టులు వెలుగులోకి వచ్చింది. దీంతో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సంజీవ్ ఖన్నా, మరో నలుగురు సీనియర్ న్యాయమూర్తుల కొలీజియం జస్టిస్ యశ్వంత్ వర్మను ఢిల్లీ హైకోర్టు నుంచి అల్హాదాబాద్ హైకోర్టుకు ట్రాన్స్‌ఫర్ చేసింది. నోట్ల కట్టల విషయంలో స్పష్టత వచ్చే వరకు న్యాయపరమైన పనులు కేటాయించవద్దని సుప్రీం కోర్టు.. ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి దేవేంద్ర ఉపాధ్యాయకు ఆదేశాలు జారీ చేసింది.

## మీరు ప్రజాధనంతో శీష్ మహల్ కట్టుకున్నారు.. మేము మాత్రం : సీఎం రేఖా గుప్తా



ఢిల్లీలో కొత్తగా కొలువుదీరిన బీజేపీ ప్రభుత్వం ఇవాళ తన తొలి బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టింది. సీఎం రేఖా గుప్తా రూ.లక్ష కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా గత ఆప్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వం ప్రజల సొమ్మును దోచుకుందని, ఆ డబ్బును విలాసాల కోసం ఖర్చు చేసిందని ఆరోపించారు. సీఎం అధికారిక నివాసమైన 'శీష్ మహల్' మరమ్మతుల పేరిట కేజ్రీవాల్ రూ.45 కోట్ల ప్రజా ధనాన్ని ఖర్చు చేశారని సీఎం ఆరోపించారు. ఢిల్లీని లండన్‌గా మారుస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. అందుకు బదులుగా ట్రాఫిక్ జామ్‌లకు నిలయంగా మార్చారని మండిపడ్డారు. అంతేకాకుండా ఎన్నో ప్రాజెక్టులను అసంపూర్తిగా వదిలేశారని ధ్వజమెత్తారు. 'మీకు (ఆప్‌ను ఉద్దేశిస్తూ), మాకు (బీజేపీ) చాలా తేడా ఉంది. మీరు హామీలు ఇస్తారు. మేము వాటిని నెరవేరుస్తాము. మీరు పొరుగు రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి అవినీతికి పాల్పడ్డారు. మేము కలిసికట్టుగా దేశాభివృద్ధి కోసం పని చేస్తున్నాము. మీరు శీష్ మహల్, లక్షల విలువైన బంగారు టాయిలెట్లను నిర్మించుకున్నారు. మేము పేదలకు ఇళ్లు, మరుగుదొడ్లను నిర్మిస్తాము' అని సీఎం రేఖా గుప్తా వ్యాఖ్యానించారు. ఢిల్లీని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు బీజేపీ ప్రభుత్వం యోచిస్తున్నట్లు సీఎం ఈ సందర్భంగా ప్రకటించారు. ఇందుకోసం రూ.177 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. ఇందులో శీష్ మహల్ సందర్శన కూడా ఉంటుందన్నారు.

## సుపారీ తీసుకున్నారేమో? కునాల్ వ్యాఖ్యలపై షిండే



**ముంబై:** స్టాండప్ కమెడియన్ కునాల్ కామ్రా తనపై చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే తొలిసారి స్పందించారు. ఆయన (కునాల్) సెటైర్‌ను తాను అర్థం చేసుకోగలనని, కానీ దేనికైనా ఒక పరిమితి ఉంటుందని అన్నారు. కునాల్ వ్యాఖ్యలు చూస్తుంటే ఒకరి తరఫున సుపారి (కాంట్రాక్ట్) తీసుకుని వేరే వారి గురించి తప్పుగా మాట్లాడినట్టు కనిపిస్తోందని షిండే అన్నారు. తన మాట ఎలా ఉన్నా ఇదే వ్యక్తి ప్రధానమంత్రి పైన, సుప్రీంకోర్టు పైన, పాత్రికేయుడు అర్నాబ్ గోస్వామిపైన, మరి కొందరు పారిశ్రామికవేత్తలపై కూడా గతంలో కామెంట్లు చేశారని గుర్తుచేశారు. దీనిని భావ ప్రకటనా స్వేచ్ఛ అనరని, ఎవరి తరఫునో మాట్లాడి ఉంటారని అన్నారు. హాబిటంట్ వేదికను పార్టీ కార్యకర్తలు ధ్వంసం చేయడంతో షిండే మాట్లాడుతూ, అవతల వ్యక్తులు కూడా ఒక పద్ధతిగా వ్యవహరించాల్సి ఉంటుందని, అలాకాకుంటే ప్రతి యాక్షన్‌కు ఒక రియాక్షన్ ఉంటుందని వ్యాఖ్యానించారు. కాగా, ప్రముఖ వ్యక్తులపై జోక్స్ వేసే హక్కు తనకు ఉందని, తన కామెంట్లకు క్షమాపణ చెప్పేది లేదని కునాల్ ఇంతకుముందు వివరణ ఇచ్చారు. చట్టపరంగా సహకరించేందుకు సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ఈ నేపథ్యంలో ఆయనపై నమోదైన కేసులో తమ ముందు హాజరుకావాలని ముంబై పోలీసులు కునాల్‌కు మంగళవారంనాడు నోటీసులు పంపారు. అయితే తనకు వారం రోజులు గడువు కావాలని కునాల్ పోలీసులకు రాసిన ఒక లేఖలో విజ్ఞప్తి చేశారు.

## 'ఇది పార్లమెంట్ సాక్షిగా జరిగిన అన్యాయం'



**ఢిల్లీ :** పార్లమెంట్ లో సోమవారం అరకు కాఫీ స్టాల్ ప్రారంభోత్సవం జరిగితే , దానికి తనను పిలవకపోవడం అవమానమే కాకుండా, ఇది తనను గెలిపించిన ప్రజలకు జరిగిన అన్యాయమన్నారు వైఎస్సార్‌సీపీ ఎంపీ తనూజా రాణి. 'పార్లమెంట్ లో అరకు కాఫీ స్టాల్ ను ప్రారంభిస్తే దానికి నన్ను పిలవలేదు. అరకు ఎంపీగా ఉన్న నన్ను అరకు కాఫీ స్టాల్ ప్రారంభోత్సవానికి పిలవకపోవడం చాలా అవమానం.. మా నియోజకవర్గం ప్రజలకి జరిగిన అన్యాయం కూడా. పార్లమెంట్ లో స్టాల్ పెట్టడం గర్వించదగ్గ విషయం. అరకు గురించి పార్లమెంట్ లో గళం వినిపిస్తున్నా. అరకు స్టాల్ పెడితే అరకు ఎంపీని పిలవరా?, అరకులోని కాఫీ అందరూ రుచి చూస్తున్నారు. ఎంతో కష్ట పడి పండిస్తున్నారు. అరకు కాఫీ ఒక్కటే కాదు.. చాలా రకాలు ఉన్నాయి. వాటి అన్నింటిని ఎంపీలకు తెలిపే అవకాశం ఉండేది. అరకు దింసా నృత్యం చాలా ఫేమస్ అరకు ఎంపీనే పట్టించుకోని నేతలు ఉన్నారు. వాళ్లు ప్రజలను ఎలా చూస్తారో అర్థం అవుతుంది పార్లమెంట్ సాక్షిగా ఇలాంటి అన్యాయం జరిగింది. పార్టీలను పక్కన పెట్టి ఎంపీగా ఆహ్వానం ఇవ్వాలి. ప్రోటోకాల్ ఉల్లంఘన జరిగింది. స్పీకర్ కు ఫిర్యాదు చేస్తాం' అని ఎంపీ తనూ.జా రాణి స్పష్టం చేశారు.

**మిమ్మల్ని ప్రజలు క్షమించరు..**

అరకు కాఫీ స్టాల్ ప్రారంభోత్సవానికి వైఎస్సార్‌సీపీ ఎంపీలను ఆహ్వానించకుండా టీడీపీ వారు శునకానందం పొందారని రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబురావు మండిపడ్డారు. ప్రోటోకాల్ ఎందుకు పాటించలేదు. ఎంపీకి బ్రిచ్ ఆఫ్ ప్రివిలేజ్ ఉంటుంది. ప్రోటాకాల్ ఉల్లంఘన జరగడంపై ప్రధాని, స్పీకర్ ను ఆశ్రయించవచ్చు. మేము అణగారిన వర్గాల వారం కాబట్టి మమ్మల్ని చిన్న చూపు చూస్తున్నారు. మీరు పార్లమెంట్ లో చేసే తప్పులను ప్రజలు క్షమించరు' అని గొల్ల బాబురావు ధ్వజమెత్తారు.

## జస్టిస్ వర్మ అంశంపై రాజ్యసభ చైర్మన్ అఖిలపక్ష సమావేశం



**న్యూఢిల్లీ:** ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో నోట్ల కట్టల వ్యవహారంపై కార్యాచరణను నిర్ణయించేందుకు రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సోమవారం సాయంత్రం 4.30 గంటలకు ఈ సమావేశం జరుగనుంది. రాజ్యసభలోని వివిధ పార్టీల ఫ్లోర్ లీడర్లు సమావేశంలో పాల్గొంటారు. సభా నాయకుడు జేపీ నడ్డా, ప్రతిపక్ష నేత మల్లికార్జున్ ఖర్గే సైతం హాజరవుతున్నారు. జస్టిస్ యశ్వంత్ వర్మ నివాసంలో నోట్ల కట్టల వ్యవహారంపై ధన్‌ఖడ్ మాట్లాడుతూ, ఇది కచ్చితంగా చాలా తీవ్రమైన అంశమని అన్నారు. దీనిపై కార్యచరణకు సంబంధించి ఫ్లోర్ లీడర్లతో సమావేశం ఏర్పాటు చేయమని ఖర్గే సూచించగా, జేపీ నడ్డా అంగీకరించినట్టు తెలిపారు. జస్టిస్ వర్మ వ్యవహారంలో జరుగుతున్న పరిణామాలు, తొలిసారి ఇందుకు సంబంధించిన సమాచారం సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో ఉంచడం అసాధరణ విషయంగా తాము ముగ్గురం భావించినట్టు చెప్పారు. జస్టిస్ వర్మ వ్యవహారంపై ముగ్గురు న్యాయమూర్తులతో విచారణ కమిటీ సీజేఐ ఇప్పటికే ఏర్పాటు చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న జస్టిస్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయించింది. అయితే, ఇదంతా కుట్ర అని, ఆ నోట్ల కట్టలతో తనకు ఎలాంటి సంబంధం లేదని జస్టిస్ వర్మ చెబుతున్నారు.

# కూటమి పాలనలో రైతుల గోడు అరణ్యరోదన

-మొదటిపేజీ తరువాయి

వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కళ్ళు తెరిచి రైతాంగాన్ని తక్షణం ఆదుకోవాలని, లేనిపక్షంగా వైయస్ఆర్‌సీపీ నుంచి రైతు పోరును ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇంకా ఆయన ఏమన్నారంటే.. తెలుగుదేశం ప్రభుత్వం ఎప్పుడు ఏర్పడినా రైతులకు కడగండ్లు తప్పడం లేదు. కరువు, లేదంటే అతివష్టి, గిట్టుబాటు ధరలు లేకపోవడం వంటి పరిణామాలను రైతులు చవిచూస్తున్నారు. దీనికి తగట్టుగా మొదటి నుంచి చంద్రబాబుకు వ్యవసాయం అంటే చిన్నచూపు, వ్యవసాయం దండుగ అన్న భావనే ఉంది. దానికి అద్దం పట్టేలా తాజాగా రాష్ట్రంలో రైతులు ఆందోళనలు చేస్తున్నారు. మిర్చి రైతులు గిట్టుబాటు ధర లేక ధర్నాలు చేస్తున్నారు. కొనేవారు లేక మిర్చి యార్డుల్లో లక్షల బస్తాల మిర్చీ నిల్వలు పెరుకుపోతున్నాయి. ఇటీవల వైయస్ జగన్ గుంటూరు మిర్చి మార్కెట్‌ను సందర్శించి, వారికి అండగా మాట్లాడారు. వెంటనే సీఎం చంద్రబాబు ఢిల్లీకి వెళ్లి కేంద్రం ద్వారా కొనుగోళ్ళు చేయిస్తానని ప్రకటించారు. ఇప్పటి వరకు ప్రభుత్వం తరుపున ఒక్క బస్తా అయినా కొనుగోలు చేశారా? కూటమి ప్రభుత్వ నిర్వాకంకు విసిగిపోయిన మిర్చి రైతులు రోడ్ల మీదికి వచ్చి ధర్నాలు చేస్తున్నా ఈ ప్రభుత్వానికి కనిపించడం లేదు. రాయలసీమలో ఈదురుగాలులతో అరటిపంట దెబ్బతిన్నది. పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకుందుకు ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోలేదు. కరోనా సమయంలోనూ అరటి పంటకు రేటు లేకపోతే సీఎంగా వైయస్ జగన్ గారు ప్రభుత్వం తరుపున అరటిని పశ్చిమ బెంగాల్, మహారాష్ట్రలకు పంపి మార్కెట్ కల్పించారు. కానీ చంద్రబాబుకు మాత్రం అరటి రైతుల గోడు కనిపించడం లేదు. వారిని ఆదుకోవాలనే కనీస ఆలోచనే లేదు.



ఉత్తరాంధ్రలో చెరకు రైతులు రేటు లేక చివరికి తమ పంటను తామే తగలబెట్టుకుంటుంటే, కూటమి ప్రభుత్వం నిద్రపోతోంది. రైతు కన్నీరు, కష్టాలను పట్టించుకునే తీరిక లేదు. ఉత్తరాంధ్రలోని చోడవరం షుగర్ ఫ్యాక్టరీ ఇప్పటికే 89,000 టన్నులు చెరకు క్రష్ చేసినా ఒక్క రూపాయి కూడా రైతులకు చెల్లింపులు చేయలేదు. పాత బకాయిలు కూడా అలాగే ఉన్నాయి. రైతులకు కోట్లాది రూపాయల బకాయిలు పడింది. చెరకు రైతుల పట్ల తక్షణం స్పందించాల్సిన ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తోంది. అలాగే టమాట, పొగాకు రైతులు కూడా రేటు లేక నష్టపోతున్నారు. వైయస్ఆర్‌సీపీ హయాంలో రూ.మూడు వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేశాం. మార్కెట్ ఇంట్రవెన్షన్‌తో మద్దతు ధరకు కొనుగోళ్ళు చేశాం. ప్రకతి వైపరీత్యాల సమయంలో రైతులకు అండగా నిలబడ్డాం. ఇటువంటి ఏ ఒక్క చర్య కూడా కూటమి ప్రభుత్వం నుంచి కనిపిచడం లేదు. ఈ సమావేశంలో మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయకుమార్ పాల్గొన్నారు

# వివేకా హత్య కేసును అవినాశ్ రెడ్డి తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు

-మొదటిపేజీ తరువాయి

సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వం దాఖలు చేసింది. ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటీషన్‌లో ఆశ్చర్యకరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. సునీతా, నర్రెడ్డి రాజశేఖరరెడ్డిలను కూడా కుట్రకోణంలో భాగంగా ఈ కేసులో ఇరికించాలని చూశారని పేర్కొంది. రాంసింగ్‌పై కేసు పెట్టినప్పుడు ఉన్న ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ జి.రాజు ఫ్రోపెషనల్‌గా కేసును విచారించలేదని తెలిపింది. తనను అవినాష్ రెడ్డి బెదిరించినట్లు ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ జి. రాజు అంగీకరించినట్లు పిటీషన్‌లో ఏపీ ప్రభుత్వం చెప్పింది. రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ కె. రాజేశ్వరరెడ్డి, ఏఎస్ఐజి. రామకృష్ణారెడ్డిలే ప్రధాన పాత్రదారులని.. వారిద్దరే ఈ కేసు మొత్తాన్ని నడిపించారని సర్కార్ తెలిపింది. ఎఫ్ఐఆర్ నమోదు చేయడం, సాక్ష్యులను విచారించినట్లు దొంగ వాంగ్మూలాలు పుట్టించడం, చార్జిషీటు దాఖలు చేయడం ... ఇలా ప్రతి ఒక్కటీ రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ కె. రాజేశ్వరరెడ్డి, ఏ ఎస్ ఐ జి. రామకృష్ణారెడ్డిలే చేశారని పిటిషన్‌లో తెలిపింది. ఎంవీ కృష్ణారెడ్డి చెప్పిన వాటిల్లో ఏ ఒక్కదానికీ సరైన ఆధారాలను చూపలేకపోయారని.. అసలు ఎంవీ కృష్ణారెడ్డిని రాంసింగ్ ఎప్పుడూ విచారించలేదని చెప్పింది. తనను రాంసింగ్ హింసించి, థర్డ్ డిగ్రీ ఉపయోగించి వైఎస్ అవినాష్, ఆయన కుటుంబసభ్యులకు వ్యతిరేకంగా స్టేట్‌మెంట్ తీసుకున్నారని ఎంవీ కృష్ణారెడ్డి చెప్పిన వాటిల్లో ఏ ఒక్కటీ నిజం లేదని వెల్లడించింది. సాక్ష్యులను విచారించకుండానే విచారించినట్లు



చార్జిషీటును తయారు చేశారని తెలిపింది. ఏఎస్ఐజి రామకృష్ణారెడ్డి నివాసంలోనే తతంగం అంతా పూర్తి చేశారని.. కేవలం 12 రోజుల్లోనే కట్టు కథలన్నీ అల్లి రాంసింగ్, సునీత, నర్రెడ్డి పైన కేసు నమోదు చేశారని పిటిషన్‌లో తెలిపింది.
తన ఫిర్యాదుకు మద్దతునిచ్చే ఏ ఒక్క ఆధారాన్నీ ఎంవీ కృష్ణారెడ్డి సమర్పించలేకపోయారని పేర్కొంది. ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ జి. రాజు అసలు ఎక్కడికీ వెళ్లకుండానే రిపోర్టు తయారు చేశారని.. అదంతా ఈ ఇద్దరు పోలీసు అధికారులు రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ కె. రాజేశ్వరరెడ్డి, జి.రామకృష్ణారెడ్డిలే చూసుకున్నారని చెప్పింది. సాక్ష్యులు చాలా మంది తాము అసలు స్టేట్‌మెంట్ ఇవ్వలేదని విచారణలో తెలిపారని వెల్లడించింది. కేసు డైరీలోని పత్రాలపై సంతకం చేయడానికి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ జి.రాజు నిరాకరించినప్పుడు ఆయనను ఏఎస్ ఐ రామకృష్ణారెడ్డి, రిటైర్డ్ అదనపు ఎస్పీ రాజేశ్వరరెడ్డిలు అప్పటి ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి ఇంటికి తీసుకెళ్లారని.. అక్కడ అవినాష్ రెడ్డి తమ సూచనలు పాటించకపోతే తీవ్ర పరిణామలు ఉంటాయని ఐవో జి. రాజును బెదిరించినట్లు పేర్కొంది. రిటైర్డ్ పోలీసు అధికారులతో కుమ్మక్కై అవినాష్ రెడ్డి ఆయనను ఆయన సహచరులను వివేకా హత్య కేసు నుంచి విముక్తి పొందేందుకు పన్నిన కుట్ర అని స్పష్టంగా అర్థం అవుతుందని అదనపు అఫిడవిట్‌లో ఏపీ ప్రభుత్వం పేర్కొంది.
ఎఫ్ఐఆర్ ఇండెక్స్‌లో ఈ కేసు డిటైల్స్‌ను నమోదు చేయకూడదని కూడా రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ కె. రాజేశ్వరరెడ్డి, ఏఎస్ఐజి. రామకృష్ణారెడ్డిలు బెదిరించినట్లు జి. రాజు అంగీకరించారు. 15.12.2023, 17.12.2023న వెంకట కృష్ణారెడ్డిని ఇనస్పెక్టర్ జి.రాజు విచారించనే లేదని... అసలు వెంకట కృష్ణా రెడ్డి పోలీసు స్టేషన్‌కే రాలేదని... సీసీ టీవిలో చాలా స్పష్టంగా తెలుస్తోందని ప్రభుత్వం వెల్లడించింది. వివేకా పీఏ వెంకట కృష్ణారెడ్డిని రాంసింగ్ విచారించలేదనడానికి సీసీటీవీ పుటేజ్‌లతో పాటు పలు సాక్ష్యాలను ఏపీ ప్రభుత్వం బయటపెట్టింది. వెంకట కృష్ణారెడ్డి చెప్పినవన్నీ కట్టుకథలేనని కొత్త ఐవో బి.మురళి స్పష్టం చేశారు.

# ఆ ఊరికి ఏమైంది...

# గ్రామంలో ప్రతి ఇంటిలో క్యాన్సర్ పేషంట్

**కాకినాడ :** ఒకరికి కాదు.. ఇద్దరికి కాదు.. ఏకంగా గ్రామంలో సుమారు 200 మందికి పైబడే కేన్సర్ వ్యాధి లక్షణాలు నిర్ధారణ అవ్వడం కలవరానికి గురిచేస్తోంది.. వైద్యపరీక్షల ద్వారా 23 మందికి కేన్సర్‌ను గుర్తించిన అధికారులు గ్రామంలో ఉన్న పరిస్థితిని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ ప్రశాంతితోపాటు ఉన్నతాధికారులకు వివరించారు.. ఇంకా గ్రామంలో ఎంతమందికి క్యాన్సర్ ఉందో తెలుసుకునే ప్రయత్నంలో నిమగ్నమైన అధికారులు ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు.. ప్రాథమికంగా గ్రామంలో చాలా మంది చిన్నారుల్లో కూడా కాలేయ సంబందిత వ్యాధులు ఉన్నట్లు గుర్తించినట్లు తెలుస్తోంది.. ఇదిలా ఉంటే బలభద్రపురంలో క్యాన్సర్ కోరల్లో ప్రజలు చిక్కుకుంటున్న పరిస్థితిపై అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అసెంబ్లీలో కూడా ప్రస్తావించడంతో దీనిపై ప్రభుత్వ, అధికార యంత్రాంగం కూడా ప్రత్యేక దృష్టిసారించిన పరిస్థితి కనిపించింది.. బలభద్రపురం గ్రామంలో క్యాన్సర్ కోరలు చాస్తోందన్న వార్త గ్రామంలో తీవ్ర భయాందోళనలు నెలకొంటున్న పరిస్థితి కనిపిస్తోంది.. తమ ఒంట్లో ఏ క్యాన్సర్ రాకాసి ఉందోనన్న అనుమానాలు ఆ గ్రామస్తుల మాటల్లో కనిపిస్తున్నాయి.. ఎందుకంటే ఈగ్రామంలోనే ఇప్పటికే 23 మంది క్యాన్సర్ బారిన పడడం గమనార్హం. ఇంకా సుమారు 200 మందికి క్యాన్సర్ లక్షణాలు ఉన్నట్లు సమాచారం. అయితే అధికారులు ఇంకా అధికారికంగా దృవీకరించకపోయినప్పటికీ తూర్పు గోదావరి జిల్లా వైద్యశాఖ, కాకినాడ నుంచి వచ్చిన ప్రత్యేక వైద్య బృందాలు సారథ్యంలో గ్రామంలో 32 బృందాలుగా సర్వే చేస్తున్నారు.. అయితే ఇప్పటికే గ్రామంలో 23 మంది క్యాన్సర్ చికిత్సలో ఉండగా మరికొంత మందికి ఈ వ్యాధి ఉందన్న సమాచారంతో గ్రామంలో తీవ్ర భయాందోళన పరిస్థితి నెలకొంది.. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి నియోజకవర్గ పరిధిలోకి వచ్చే భలభద్రపురం గ్రామంలోనే గ్రాసిమ్ కెమికల్ ఇండస్ట్రీతో పాటు ఇతర పరిశ్రమలున్నాయి.. వీటినుంచి వెలువడే కాలుష్య వల్లనే గ్రామంలో ఈ భయంకర పరిస్థితులు నెలకొన్నాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. పరిశ్రమల నుంచి




వెలువడే వ్యర్థాలు భూగర్భంలో డంపింగ్ చేయడం వల్ల భూగర్భజలాలు కాలుష్యకాసారాలుగా మారుతున్నాయన్న ఆరోపణలు ఉన్నాయి. బలభద్రపురం గ్రామంలో సుమారు 10 వేల మంది జనాభా ఉండగా ఎవ్వరిని కదిపినా క్యాన్సర్ కలవరం స్పష్టంగా కనిపిస్తోంది.. ఏప్రిల్ 2022లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బలభద్రపురం శివారు ప్రాంతంలో గ్రాసిమ్ ఇండస్ట్రీను ప్రారంభించారు.. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బలభద్రపురంలో క్యాన్సర్ కోరలు చాస్తోందని తన ప్రసంగంలో ప్రస్తావించారు. దీనిపై వైద్యఆరోగ్యశాఖ తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. లేకపోతే ఇప్పటికే గ్రామంలో చాలా మంది క్యాన్సర్ బారిన పడ్డారని, మరింత మందికి ఈ వ్యాధి ఉండే అవకాశం లేకపోలేదని, గ్రామంలో తక్షణ చర్యలు చేపట్టి క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలతోపాటు క్యాన్సర్ కారకాలను గుర్తించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతోపాటు వైద్యఆరోగ్యశాఖ మంత్రికి విన్నవించారు..

### చర్యలకు ఉపక్రమించిన ఆరోగ్యశాఖ

తూర్పుగోదావరి జిల్లా బలభద్రపురంలో క్యాన్సర్ కేసుల కలకలంపై రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పందించారు. బలభద్రపురంలో అత్యధిక క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని అనపర్తి ఎమ్మెల్యే అసెంబ్లీలో పేర్కొన్నారని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. దీంతో వెంటనే 31 మెడికల్ టీమ్ లను అక్కడికి పంపామన్నారు.నాన్ కమ్యూనకబుల్ 3.0 సర్వేలో భాగంగా నాన్ కమ్యూనకబుల్ డిసిజ్ క్యాన్సర్ స్క్రీనింగ్ మొదలు పెట్టామని వెల్లడించారు. ఇప్పటివరకు కోటి 93 లక్షల మందికి స్క్రీనింగ్ నిర్వహించగా వీరిలో లక్ష 45వేల 649 మంది వేర్వేరు క్యాన్సర్లతో భాదపడుతున్న అనుమానిత కేసులు వచ్చాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ వివరించారు."బలభద్రపురానికి సంబంధించి 10800 మంది జనాభాలో 3500 ఇళ్లు ఉన్నాయి. వీరిలో 2803 ఇళ్ల వద్దకు వెళ్లి 8830 మందికి పరీక్షలు చేయగా 38 కేసులు బయటపడ్డాయి. దీనిలో గతంలో క్యాన్సర్ ఉన్న కేసులు ఉన్నాయి. భారత్ లో 14 లక్షల 13 వేల కొత్త కేసులు వచ్చాయి. లక్ష జనాభాకు 367 మంది అంటే 10 వేలు జనాభా ఉన్న బలభద్రపురంలో 32 కేసులు ఉన్నాయి.అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణా రెడ్డిని ప్రత్యేకంగా అభినందిస్తున్నాం. ఆయన అసెంబ్లీలో మాట్లాడటంతో మీడియాలో హైలెట్ అయ్యి అందరికీ తెలిసింది. అనపర్తి నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకుంటే లక్షా 19వేల మందికి స్క్రీనింగ్ చేయగా 736 సస్పెక్టెడ్ కేసులు వచ్చాయి. క్యాన్సర్ ట్రీట్ మెంట్ ను 2022-25 మధ్య ఎన్టీఆర్ వైద్య సేవ కింద లక్ష 13 వేల 363 మందికి చికిత్స చేశారు. బలభద్రపురంలో క్యాన్సర్ అనుమానిత కేసులు అసాధారణంగా పెరగలేదు. స్క్రీనింగ్ ట్రైన్డ్ సీహెచ్ సెంటర్లలో ఉండే వారు చేస్తారు. ఆశా వర్కర్లు కాదు" అని మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

**కృష్ణబాబు- ప్రిన్సిపల్ సెక్రటరీ, వైద్యారోగ్య శాఖ**

క్యాన్సర్ ను కన్ ఫామ్ చేయడానికి చేసే పరీక్ష బయాప్సీ మాత్రమే. మిగిలిన పరీక్షలన్నీ రూలౌట్ చేయడానికే. కేజీహెచ్, గుంటూరు, కర్నూలులో క్యాన్సర్ ట్రీట్ మెంట్ సౌకర్యాలు ఉన్నాయి. తొలి స్టేజ్ లో డయాగ్నోజ్ చేస్తే లైఫ్ స్పాన్ ను పెంచుకోవచ్చు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు వాళ్లు కూడా ఓ టీంను బలభద్రపురం పంపారు. పర్యావరణ అంశాలు క్యాన్సర్ కు కారణం అంటే లంగ్స్, స్కిన్ ఎఫెక్ట్ కావాలి. ఆ తరహా క్యాన్సర్లు అక్కడ డయాగ్నోజ్ కాలేదు. ఇదే అంశంపై సీఎం కూడా రివ్యూ చేశారు.

## కలెక్టర్ల పనితీరు నిరంతరం సమీక్షిస్తాం




-మొదటిపేజీ తరువాయి

9 నెలల్లోనే అనేక హామీలు నెరవేర్చాం. దేశంలో ఎక్కడా లేని విధంగా ఫించన్‌లు రూ.4 వేలు ఇస్తున్నాం. రూ.200 ఉన్న పింఛన్‌ను 2014లో రూ.2 వేలు చేశాం. ఇప్పుడు రూ.3 వేల నుంచి రూ.4 వేలకు ఒకేసారి పెంచాం. రూ.500 ఉన్న దివ్యాంగుల పింఛన్‌ను రూ.3 వేలు చేశాం. దాన్ని మళ్లీ ఇప్పుడు రూ. 6 వేలకు పెంచాం. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రూ.10 వేలు ఇస్తున్నాం. మంచానికే పరిమితమైనవారికి మానవతా దక్పదంతో రూ.15 వేలు ఇస్తున్నాం. ఇంతమంచి కార్యక్రమాలు చేస్తున్నప్పుడు ప్రజలకు తెలియజేయాలి. అందుకే ప్రతినెలా 1వ తేదీన పేదల సేవలో కార్యక్రమం నిర్వహిస్తున్నాం. రాష్ట్రంలో పేదల ఆకలి తీర్చడానికి 204 అన్నా క్యాంటీన్‌లు నెలకొల్పాం. కలెక్టర్‌లు కూడా అన్నా క్యాంటీన్‌లను సందర్శించాలి. 2027 నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తాం. అమరావతి రాజధాని పనులు కూడా చేపట్టాం. గత ప్రభుత్వం రోడ్ల మరమ్మతులను పట్టించుకోలేదు. ఎక్కడ చూసినా గోతులే ఉన్నాయి. అందుకే రూ.861 కోట్లతో 20 వేల కి.మీ మేర గుంతలు పూడ్చివేస్తున్నాం. దాదాపు 95 శాతం మేర పనులు పూర్తయ్యాయి. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటు చేసుకునేవారికి కేంద్ర%-%రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సీడీ ఇస్తున్నాయి. జిల్లాల మధ్య తలసరి ఆదాయంలో వచ్చిన మార్పులపై కొన్ని ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. 2022%-%23 సంవత్సరానికి గాను సత్యసాయి జిల్లాలో తలసరి ఆదాయం 2,19,234 రూపాయలు, అనంతపురం జిల్లాలో 2,33,521 రూపాయలు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 1,93,763 రూపాయలుగా నమోదైంది. సాధారణంగా అనంతపురం జిల్లా కరువు పీడిత ప్రాంతంగా, వెనుకబడిన జిల్లాగా పరిగణించబడుతుంది. అయితే, కోనసీమలో తలసరి ఆదాయం ఎక్కువుగా ఉంటుందని భావిస్తారు. ఉద్యానవన రంగంలో సాధించిన అభివద్ధి కారణంగా అనంతపురం జిల్లాలు తలసరి ఆదాయంలో వద్ధిని సాధించింది. తలసరి ఆదాయంలో ముందున్న జిల్లాలలోని ఉత్తమ విధానాలను వెనుకబడిన జిల్లాలలో కూడా అమలు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. వేసవిలో ఇబ్బందులు లేకుండా గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ఇప్పటికే 9,044 నీటి తొట్టెలు ఏర్పాటు చేయడం జరిగింది. మరో 15 రోజుల్లో మరో 12,138 తొట్టెల ఏర్పాటు పూర్తిచేయాలి. ఇందుకు కలెక్టర్లు చొరవ చూపాలని సీఎం చంద్రబాబు సూచించారు.

## వచ్చే నెల మొదటి వారంలోనే మెగా డీఎస్సీ

-మొదటిపేజీ తరువాయి

మాట్లాడుతూ... వైసీపీ ప్రభుత్వ పాలనను ప్రజలు ఆమోదించలేదని.. అందుకే ప్రజలు కూటమికి తిరుగులేని తీర్పు ఇచ్చారన్నారు. ఐదేళ్లకు ఒకసారి ప్రజలు తీర్పు ఇస్తారన్నారు. సమస్యల పరిష్కారంలో కలెక్టర్లది కీలక పాత్ర అని చెప్పుకొచ్చారు. ప్రజల సమస్యల పరిష్కారమే అందరి లక్ష్యమని వెల్లడించారు. విధ్వంసమైన రాష్ట్రాన్ని అందరం కలిసి గాడిలో పెట్టాలన్నారు. రాష్ట్రాన్ని పునఃనిర్మాణం చేస్తామని హామీ ఇచ్చామని.. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన తమ విధానమని తెలిపారు. కలెక్టర్లు దర్పం ప్రదర్శించడం కాదని.. క్షేత్రస్థాయిలో పర్యటించాలని సూచించారు. సంక్షేమ పథకాలు లేకపోతే పేదరిక నిర్మూలన జరగదన్నారు. సంక్షేమం అమలు చేయాలంటే అభివృద్ధి జరగాలని అన్నారు. అప్పులు తెస్తే ఎంతకాలం కొనసాగిస్తామని ప్రశ్నించారు. 9 నెలల్లో అనేక హామీలు అమలు చేస్తూ వస్తున్నామన్నారు. దేశంలో ఎక్కడా రూ.4 వేలు పింఛన్ లేదు.. మనం ఇస్తున్నామన్నారు. దివ్యాంగులకు పింఛన్ రూ.6 వేలకు పెంచామని చెప్పుకొచ్చారు. అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్ అని అన్నారు. ప్రపంచంలోనే బెస్ట్ మోడల్‌తో అమరావతి అభివృద్ధి జరుగుతుందన్నారు. అన్న క్యాంటీన్లతో రూ.5కే భోజనం అందిస్తున్నామని.. దీపం-2 కింద ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామన్నారు. చెత్త పన్నును తొలగించామని తెలిపారు. 2027కు పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తామని వెల్లడించారు. మే నెల నుంచి తల్లికి వందనం పథకం అమలు చేస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే వర్సెస్ ఎంపీ

**గుంటూరు :** చిలకలూరిపేటలో మాజీ మంత్రి విడదల రజని, నరసరావుపేట టిడిపి ఎంపీ లావు కృష్ణదేవరాయలు మధ్య పరస్పర ఆరోపణలు జోరుగా సాగుతున్నాయి. వైసీపీలో హయాంలో ఆరోగ్యశాఖ మంత్రిగా మొన్న విడదల రజని తన నియోజకవర్గంలో స్టోన్ క్రషర్స్ యజమానుల నుంచి డబ్బులు వసూలు చేశారంటూ ఆరోపణలు ఉన్నాయి. దీనిపై ౦అః కేసులు నమోదు చేసింది. రేపో మాపో విడదల రజని అరెస్టు తప్పదు అంటూ ప్రచారం జరుగుతోంది. దీనిపై భగ్గుమన్న రజని టిడిపి నేతలపై ఆరోపణలు చేస్తున్నారు. ముఖ్యంగా ప్రస్తుత నరసరావుపేట ఎంపీ లావు కృష్ణదేవరాయలు తనపై కక్ష కట్టారంటూ విమర్శలు గుప్పిస్తున్నారు. స్థానికంగా ఉన్న స్టోన్ క్రషర్ యజమాని నుండి రెండు కోట్లకు పైగా డబ్బులు వసూలు చేశారనేది ఆమెపై ఉన్న ఆరోపణ.మాజీ మంత్రి విడదల రజని చేసిన ప్రధాన ఆరోపణ తన కుటుంబాన్ని ప్రస్తుత ఎంపీ లావు కృష్ణదేవరాయులు టార్గెట్ చేశారని తన ఫోన్ కాల్ డేటాను సేకరించే ప్రయత్నం కూడా గతంలోనే చేశారని జర్మనీలో ఉంటున్న తన మరిది ని కూడా కేసుల్లో ఇరికించే కుట్ర జరుగుతుందని. నిజానికి ఒకప్పుడు కృష్ణదేవరాయలు కూడా వైసిపి ఎంపిగానే ఉండేవారు. అప్పటినుంచే వారిద్దరి మధ్య విభేదాలు ఉన్నాయి. 2020లో గురజాల పోలీస్ స్టేషన్లో తనకు అవమానం జరిగిందని దాని వెనక అప్పటి వైసీపీ ఎంపీ కృష్ణదేవరాయల అధికార దుర్వినియోగం ఉందని రజని ఆరోపించారు. తర్వాత జరిగిన రాజకీయ పరిణామాలు నేపథ్యంలో కృష్ణదేవరాయలు టిడిపిలోకి రావడం నరసరావుపేట ఎంపీగా గెలుపొందడం జరిగిపోయింది. మరోవైపు వైసీపీ ఓటమి పాలయ్యింది. అప్పటినుంచి తనను కేసుల్లో ఇరికించే కుట్రలు ఎక్కువ అవుతున్నాయని విడదల రజని ఆరోపిస్తున్నారు. తనపై విడదల రజని చేసిన ఆరోపణలకు ఢిల్లీలో ఎంపీ లావు కృష్ణ దేవరాయలు కౌంటర్ ఇచ్చారు. తనకు బూతులు రావని, మాజీ మంత్రి రజినీలా అబద్దాలు ఆడడం రాదని ఆయన అన్నారు. రజిని కాల్ డేటా సేకరించి ప్రయత్నం తాను చేయలేదని తన ఇంట్లో కూడా మహిళలు ఉన్నారని వాళ్ళకో న్యాయం రజనీ కో న్యాయం అంటూ ఉండదని చెప్పుకొచ్చారు. రజినీ మాటలు వెనక ఎవరున్నారో తనకు తెలుసని చెప్పిన కృష్ణదేవరాయలు ఎవరో స్టోన్ క్రషర్ యజమాని ఇచ్చిన కంప్లైంట్ కు తనకు సంబంధం ఏంటని అన్నారు. తమ చాలా ఏళ్లుగా విద్యాసంస్థలు నడుపుతున్న ప్రభుత్వం నుంచి భూమిని తీసుకున్న సందర్భమే లేదని అన్నారు. పది రోజుల క్రితం విడదల రజని ఒక మధ్యవర్తి ద్వారా కేసులు నుంచి తనని తప్పించమని రాయబారం నడిపిన మాట వాస్తవమా కాదా అని ప్రశ్నించారు. స్టోన్ క్రషర్ యజమాని నుండి తీసుకున్న డబ్బులు తిరిగి ఇచ్చేస్తానని చెప్పిన మాట నిజమో కాదో రజిని చెప్పాలని ఆయన అన్నారు.చేసిందంతా చేసి ఇప్పుడు ఇలా తనపై విమర్శలు చేయడం కరెక్ట్ కాదని చట్టం తన పని తాను చేసుకు పోతుందని కృష్ణదేవరాయలు మాజీ మంత్రికి కౌంటర్ ఇచ్చారు. తను వైసీపీ నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా ఎవ్వరి పైనా ఎలాంటి విమర్శలు చేయలేదని తనను అనవసరంగా రెచ్చగొట్టొద్దని ఆయన స్పష్టం చేశారు. మరి రానున్న రోజుల్లో ఈ వివాదం ఇంకెన్ని టర్న్లు తీసుకుంటుందో చూడాలి.

# సంపాదకీయం

## అమెరికా ఆధిపత్యానికి బీటలు

ప్రపంచం మీద పెత్తనం చెలాయిస్తున్న శక్తులు తమ ప్రచార దిశను మార్చుకున్నట్టుంది. నిన్నటిదాకా అంతర్జాతీయ వాణిజ్యం మీద ఏ దేశమూ ఎటువంటి ఆంక్షలూ విధించకూడదని, ఆంక్షలు లేని వాణిజ్యం భాగస్వాము లందరికీ ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు. ఇప్పుడు తమ తమ దేశాల ప్రయోజనాలను రక్షించుకోవడమే ప్రధానంగా మారినట్టు కనిపిస్తోంది. దానితోబాటు పాత కాలపు వలసాధిపత్య భావాలను కూడా మళ్ళీ ప్రకటిస్తున్నారు. ఈ ప్రపంచాన్ని శాసించే హక్కు తమకే ఉందన్నట్టు ప్రవర్తిస్తున్నారు. అమెరికా వివిధ దేశాలతో జరిపే వాణిజ్యంలో ఆ దేశాల నుండి దిగుమతి చేసుకునే సరుకులే ఎక్కువ. అమెరికా నుండి ఆ దేశాలకు జరిగే ఎగుమతులు తక్కువ. ఇప్పుడు ట్రంప్ అటువంటి దేశాల నుండి వచ్చే దిగుమతులపై అధిక సుంకాలను విధిస్తున్నాడు. ఈ చర్యల్లో ఆర్థిక హేతుబద్ధత కన్నా ప్రజలను ఆకట్టుకోవడమే ప్రధానంగా కనిపిస్తోంది. గతంలో అమెరికా చాలా ఉదారంగా ఇతర దేశాల ఎడల వ్యవహరించినట్టు, దానివలన ఆ దేశాలన్నీ ప్రయోజనాలు పొందినట్టు, ఇప్పుడు అమెరికా తన స్వంత దేశపు పరిశ్రమల రక్షణకు, తన స్వంత కార్మికుల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యతను ఇవ్వడానికి సుంకాల పెంపు తప్పదన్నట్టు ఈ నాటకం నడుస్తోంది. పెట్టుబడి ఎప్పుడూ రంగులు మారుస్తూనే వుంటుంది. నయా ఉదారవాద శకం ప్రపంచం మీద తన విధానాలను రుద్దడానికి ఐఎంఎఫ్, ప్రపంచబ్యాంక్ వంటి సంస్థలను సాధనాలుగా వాడుకోవడంతో ఆవిష్కరించబడింది. ప్రపంచంలో ఎక్కడెక్కడ చౌకగా కార్మికుల శ్రమను కొల్లగొట్టవచ్చో, అక్కడికల్లా ప్రపంచ పెట్టుబడి తరలిపోయింది. ఎక్కడ సహజ వనరులు చౌకగా దొరుకుతాయో అక్కడ వాటిని చేజిక్కించుకుంది. ఒకదాని వెంట మరొకటిగా దేశాలు ఈ నయా ఉదారవాద పెత్తనానికి లొంగిపోయాయి. పోటీ ప్రపంచం అనే పేరుతో తమ తమ దేశాల ఆర్థిక వ్యవస్థల మీద తమకున్న నియంత్రణను విడిచిపెట్టి, తమ పాలనా విధానాలను తామే రూపొందించుకునే హక్కును సైతం గాలికొదిలేశాయి. దిగుమతుల మీద ఆంక్షలు ఎప్పుడైతే సడలించడం జరిగిందో అప్పుడు ఆ యా దేశాల్లోకి పెద్దపెట్టున సరుకులు వచ్చిపడడం మొదలైంది. దాని వలన దేశీయ పరిశ్రమలు దెబ్బ తిన్నాయి. ఈ విధానాలకు లోబడి వ్యవహరించడానికి నిరాకరించిన చైనా వ్యూహాత్మకంగా తన స్వంత శక్తి సామర్థ్యాలను పెంచుకోవడం మీద కేంద్రీకరించింది. ప్రపంచ మార్కెట్‌లో పోటీ పడగల సామర్థ్యాన్ని పెంచుకుంది. చాలామంది ఆర్థిక వ్యాఖ్యాతలు చైనా బలమైన ఆర్థిక శక్తిగా ఎదిగిందన్న వాస్తవాన్ని గుర్తిస్తున్నారు కాని అలా ఎదగడానికి కారణం చైనా నయా ఉదారవాద విధానాల చట్రంలో ఇమిడేందుకు తిరస్కరించి తన స్వంత విధానాలను అమలు చేయడమేనన్న వాస్తవాన్ని మాత్రం గుర్తించరు. ప్రస్తుతం జి–7 దేశాలు నమోదు చేస్తున్న ఆర్థిక వృద్ధిరేటు కన్నా ఎక్కువ వృద్ధిరేటుతో ఉన్న దేశాలు బ్రిక్స్ కూటమిలో భాగస్వాములుగా ఉన్నాయి. అమెరికా అగ్ర స్థానం క్రమంగా చేజారుతోంది. అందుకే దిక్కు తోచని స్థితిలో పడి గతంలో తాను ప్రవేశపెట్టిన స్వేచ్ఛా వాణిజ్య సూత్రాలను ఇప్పుడు తానే ఉల్లంఘిస్తోంది. అంతర్జాతీయ పెట్టుబడి ప్రయోజనాల గురించి మాట్లాడుతూ వచ్చిన అమెరికా ఇప్పుడు 'జాతీయ ప్రయోజనాల' గురించి మాట్లాడుతోంది. ఎంత గొప్పగా జాతీయ ప్రయోజనాల గురించి మాట్లాడినా, అదనంగా విధించిన సుంకాల వలన అమెరికాకు దిగుమతి అయ్యే సరుకుల ధరలు పెరుగుతాయి. దానివలన అమెరికన్ పౌరులు ఎక్కువ సొమ్ము వెచ్చించాల్సి వస్తుంది. ఇంకో పక్క ఈ కొత్త సుంకాలపై అంతర్జాతీయ పెట్టుబడి ఏ విధంగా ప్రతిస్పందిస్తుందో, ఆ యా దేశాలు అమెరికాతో తమ వాణిజ్య సంబంధాలను ఏ విధంగా మార్చుకుంటారో చూడాలి. దీని పర్యవసానాలను అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఏ విధంగా స్వీకరిస్తుందో అదీ చూడాలి. వాణిజ్య సంబంధాలలో పెరుగుతున్న అనిశ్చిత పరిస్థితులు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన ఉత్పత్తి, సరఫరా చెయిన్లను ఏ విధంగా దెబ్బ తీస్తాయో అది కూడా పరిశీలించాలి. ప్రస్తుతం అమెరికా, భారత్‌ల మధ్య జరుగుతున్న వాణిజ్య చర్చలు రానున్న కాలంలో ఇరు దేశాల వాణిజ్య సంబంధాలపై ఏ విధమైన ప్రభావాన్ని చూపుతాయో చూడాలి. భారతదేశానికి, అమెరికాకు నడుమ 125 బిలియన్ల డాలర్ల (12,500 కోట్ల డాలర్లు లేదా రూ.10, 79,500 కోట్లు) వాణిజ్యం సాగుతోంది. అమెరికాకు భారతదేశం ఎగుమతి చేసే సరుకులపై విధించే సగటు సుంకం ఇప్పుడు 2.8 శాతం ఉంది. అదే అమెరికా భారతదేశానికి ఎగుమతి చేసే సరుకుల మీద సగటు సుంకం 7.7 శాతం ఉంది. ఇప్పుడు అమెరికా కూడా భారతదేశం నుండి ఎగుమతి అయ్యే సరుకుల మీద 7.7 శాతానికి సుంకాన్ని పెంచనుంది. దీని వలన వివిధ రంగాలలో వివిధ రకాలుగా ప్రభావం పడుతుంది. ట్రంప్ కోరుతున్నట్టు అమెరికా నుండి మనకు దిగుమతి చేసుకునే సరుకులపై మనం సుంకాన్ని గనుక తగ్గిస్తే అప్పుడు అక్కడి నుండి ఎక్కువగా దిగుమతి అయ్యే వ్యవసాయ ఉత్పత్తులు భారతీయ మార్కెట్ లో చౌకగా లభిస్తాయి. మన స్వదేశీ వ్యవసాయ ఉత్పత్తులకు రేట్లు ఇంకా తగ్గిపోతాయి. అదే మనదేశం నుండి ఎగుమతి అయే సరుకులపై అమెరికా ఎక్కువ సుంకాన్ని విధిస్తే ఇక్కడి నుండి మనం పంపే ఆటో విడి భాగాలు, మాంసం తదితర ప్రాసెస్డ్ ఆహార ఉత్పత్తులు, వజ్రాలు, బంగారు ఆభరణాలు, రసాయనాలు, ఔషధాలు వంటివి మరింత ఖరీదౌతాయి. అప్పుడు వాటికి అమెరికాలో డిమాండ్ తగ్గుతుంది. ఒక తాజా అధ్యయనం ప్రకారం మన దేశం నుండి ఎగుమతి చేసే ప్రాసెస్డ్ ఫుడ్ మీద సుంకం 32.37 శాతం పెరుగుతుంది. అదే విధంగా ఆటో విడి భాగాల మీద 23.10 శాతం, వజ్రాలు, ఆభరణాల మీద 13.32 శాతం, రసాయనాలు, ఔషధాల మీద 8.63 శాతం పెరుగుతుంది. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ వస్తువుల మీద, లెదర్, పేపర్, గ్లాస్, ప్లాస్టిక్ వస్తువుల మీద, జౌళి, దుస్తుల మీద, యంత్రాల మీద, కంప్యూటర్ తయారీలో ఉపయోగించే ఖనిజాల మీద, వివిధ రకాల లోహాల మీద సుంకాలు పెరుగుతాయి. సుంకాలు పెరిగితే మనం ఎగుమతి చేసే సరుకుల ధరలు పెరుగుతాయి. దాని ఫలితంగా మన ఎగుమతులు తగ్గవచ్చు. మరోపక్క అమెరికా తాను భారతదేశానికి ఎగుమతి చేసే వ్యవసాయోత్పత్తుల మీద విధిస్తున్న సుంకాన్ని తగ్గించాలని పట్టుబడుతోంది. ప్రస్తుతం ఇండియా నుండి అమెరికాకు ఎగుమతి అయ్యే వ్యవసాయోత్పత్తుల మీద అక్కడ 5.3 శాతం సుంకం పడుతోంది. అదే అమెరికా నుండి ఇండియాకు వచ్చే వ్యవసాయోత్పత్తుల మీద 37.7 శాతం సుంకం విధిస్తున్నాం. ఇప్పుడు గనుక అమెరికా కోరిన విధంగా అక్కడి నుండి వచ్చే దిగుమతులమీద సుంకాన్ని 5.3 శాతానికి తగ్గిస్తే అది మన భారతీయ రైతుల పాలిట వినాశనకరంగా మారుతుంది. అమెరికా తన వ్యవసాయ రంగానికి భారీగా సబ్సిడీలు ఇస్తోంది. అక్కడి అగ్రో–ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలోని గుత్తాధిపతులు ఆ సబ్సిడీలను ఉపయోగించుకుని భారతీయ మార్కెట్లను తేలికగా ఆక్రమిస్తారు. దాని ఫలితంగా ఇక్కడ ఉన్న చిన్న చిన్న రైతులు, చిన్న ఉత్పత్తిదారులు చితికిపోతారు. ఇప్పటికే వినిమయ సరుకుల ఉత్పత్తి రంగంలో దిగుమతుల దాడి ఫలితంగా దేశీయ పరిశ్రమలు దారుణంగా దెబ్బ తినిపోయాయి. ఇకపైన రైతుల పరిస్థితీ అలాగే అవుతుంది. ఏ దేశానికి ఆ దేశం తన జాతీయ అవసరాల రీత్యా, ప్రత్యేకతల రీత్యా సుంకాలను విధిస్తుంది. దానికి భిన్నంగా అగ్రరాజ్యం ప్రయోజనాల కోసం సుంకాల విధానాన్ని మార్చితే దాని ప్రతికూల ప్రభావం దేశంలోని ప్రజల మీద తీవ్రంగా పడుతుంది. ప్రతీకార చర్యలుగా సుంకాలను విధించడం, అనుమతులు లేని కార్మికులను వెనక్కి పంపివేయడం, కెనడా, గ్రీన్‌లాండ్, పనామా, గాజా భూభాగాలను స్వాధీనం చేసుకుంటామని ప్రకటించడం, పరిశోధనల మీద ఖర్చులకు కోత పెట్టడం వంటి ట్రంప్ చర్యలకు మీడియా బాగా ప్రచారం ఇస్తోంది. ఇవన్నీ తాత్కాలిక స్వభావం కలిగిన చర్యలే. వీటి వెనుక అమెరికా ఎదుర్కొంటున్న సంక్షోభపు తీవ్రతను కప్పిపుచ్చుతున్నారు. అమెరికా ఆర్థిక వ్యవస్థ నిజానికి తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయి వుంది. రాబోయే రెండేళ్లలో దాని ఆర్థిక మందగమనం మరింత ఎక్కువ కానుంది. ఇప్పుడు మూడవ ప్రపంచ దేశాలతో జరుగుతున్న చర్చల పర్యవసానంగా అమెరికా వాణిజ్యం ఎంత మేరకు పుంజుకోగలదో వేచి చూడాలి. కాని ఇప్పుడు అమెరికన్ మార్కెట్‌లో నెలకొన్న మాంద్యం, దేశీయ వనరుల, పెట్టుబడుల వృద్ధి బాగా దెబ్బ తినడం చూస్తే అమెరికన్ పెత్తనానికి చివరి రోజులు దగ్గరపడ్డాయని అనిపిస్తుంది. అమెరికాలో కార్మికవర్గం నిజ వేతనాలు బాగా దెబ్బ తినిపోవడం, మరోవైపు కార్పొరేట్లు సూపర్ లాభాలకు పడగలెత్తడం వల్లే డెమాక్రాట్లు ఎన్నికల్లో ఓడిపోయారు. నిజానికి వాళ్ళ దగ్గర రిపబ్లికన్లు ప్రతిపాదించిన మితవాద ఎజెండాకు ప్రత్యామ్నాయమైన ఎజెండా అంటూ ఏదీ లేదు. ఈ రెండు పార్టీల నడుమ ఉన్న విధానపరమైన తేడా దాదాపు శూన్యం.

# సంస్కృతి ప్రతిరూపాలు అన్నమాచార్యుడు



దక్షిణా పథాన భజన సాంప్రదాయానికి, పద కవితా శైలికి ఆద్యుడు, ఆరాధ్యుడు. అన్నమయ్య లేదా తాళ్ళపాక అన్నమాచార్యులు (మే 9, 1408 – ఫిబ్రవరి 23, 1503) తెలుగు సాహితీ చరిత్రలో లభించిన ఆధారాల ప్రకారం మొదటి వాగ్గేయకారుడు. త్యాగయ్య, క్షేత్రయ్య, రామదాసు వంటి సంకీర్తనా చార్యులకు మార్గ దర్శకుడైన, భక్తి, సాహిత్యం, సంగీతం, శృంగారం భావ లాలిత్యంతో నిండిఉన్న అన్నమయ్య పాటలు, పదాలు, పద్యాలు తెలుగు సంస్కృతికి ప్రతిరూపాలుగా నిలుస్తున్నాయి. తెలుగు సంస్కృతితో విడదీయరాని బంధాన్ని ఏర్పరచు కున్నాయి. ఆధ్యాత్మిక పదాలు, శృంగార గీతాలు, తుమ్మెదల, గొబ్బిళ్ళ పాటలు, శతకాలు, అన్నమయ్య విరచిత, 32 వేల ఆశుకవితా రూపాలలో చాలా వరకు లభ్యాలై, ప్రజల నోళ్లలో నానుతునే ఉన్నాయి. కన్నడ వాగ్గేయ కారుడు "పురందరదాసు" అన్నమయ్యను, ఏడుకొండల స్వామి అవతారంగా ప్రశంసిస్తే, మహావిష్ణువు ఖడ్గమైన నందకం అంశతో అన్నమయ్య జన్మించాడని, శ్రీ వైష్ణవ సాంప్రదాయ ఆచరణుల నమ్మకం. అన్నమయ్య మనుమడు తాళ్ళపాక చిన్నన్న రాసిన "అన్నమయ్య చరితం" ద్విపద కావ్యం ద్వారా ఆయన సమాచారం లభిస్తున్నది. క్రీస్తుశకం పదవ శతాబ్దిలో, నేటి కర్నూలు జిల్లాలోని ప్రాంతాలను నందుడనే రాజు పాలించగా, ఆ రాజు కాశీయాత్ర సమయాన, కాశీలో కొందరు వైదిక బ్రాహ్మణులు పరిచయం కాగా, కొన్ని బ్రాహ్మణ కుటుంబాలు ఆంధ్ర దేశానికి తరలి వచ్చి స్థిరపడగా, తీసుకొని రాబడిన వారు వైదీకులు అయినందున, నంద వైదీకులుగా ప్రచారం పొందినట్లు, అన్నమయ్య అదే కోవకు చెందిన వారై, "తాళ్ళపాక గ్రామం" ఇంటి పేరుగా కలిగి ఉన్నారని ప్రచారం ఉంది. వైశాఖ మాసం విశాఖ నక్షత్రంలో శుభ లగ్నాన, మూడు గ్రహాలు ఉచ్ఛ స్థితిలో ఉండగా, నారాయణ సూరి – లక్కమాంబలకు "నందకం" అంశమున సర్వధారి సంవత్సర వైశాఖ శుక్ల పౌర్ణమి నాడు 1408 మే 9న అన్నమయ్య ఉదయించారు. నారాయణ మూర్తి పరబ్రహ్మ వాచకంగా "అన్నమయ్య" అని నామకరణం గావించారు. "అన్నమయ్య", "అన్నమాచార్యులు", "అన్నయ గురు", "అన్నయ్య", "కోనేటి అన్నమయ్యం గారు" అనే నామాంతరం తాళ్లపాక సాహిత్యం శాసనాలలో చోటు చేసుకున్నాయి. శిశు ప్రాయం నుండి అన్నమయ్య వెంకట నాథుని మీద ధ్యాస ఉంచేవారు. ఉగ్గు పాలు తాగడం లో, నిద్రకు ఉపక్రమించడంలో, లక్కమాంబ గీతాలు, జోల పాటలు, నారాయణ మూర్తి కావ్య పఠనాలు, అన్నమయ్యపై శైశవ దశలోనే ప్రభావం చూపాయి. ఏకసంతాగ్రాహియై, ఉపనయన సంస్కారం అనంతరం చిరు ప్రాయం నుండే, కలియుగ దైవంపై వింత వింత సంకీర్తనలు నోటి నుండి జాలు వారగా, పదహారేళ్ల ప్రాయం నుండి రోజు కొక్క సంకీర్తనం తప్పక రాయడం మానలేదు. చెరువుగట్టు మీద, చెట్టుపై పిట్టలు, చిరుగాలి సవ్వడులలో, అలల కదలికలలో, మమేకమై సాగిన ఆయన జానపద నేపథ్యంలో, అన్నమయ్య పాటన్నా, మాటన్నా, గ్రామీణులకు సంబరాన్ని కలిగించేవి. ఉమ్మడి కుటుంబంలో, పనులు చేయడం నచ్చక, లౌకిక బంధాలతో, తమకు ఇక పనిలేదని తెలుసుకొని, వేదనలో విరక్తి కలిగి, భక్తి రగిలి, భక్తి రసావేశ భరితులై, తంబుర చేతబూని, తిరుమల దారి పట్టా డు. సనక సనం దాదులే భక్తులై తోడురాగా తిరుపతి చేరారు. సకలాభరణ శోభితుడు, భూషితుడు అయిన శ్రీ మూర్తిని దర్శించుకు న్నారు. తిరుమల లో "ఘన విష్ణువు" అనే మునితో శంఖ చక్రాదికములతో, పంచ సంస్కారాలను నిర్వహింప చేసుకు న్నారు. వైష్ణవ తత్వాలను, ఆళ్వారుల దివ్య ప్రబంధాలను, అధ్యయనం చేస్తూ, వెంకన్నను కీర్తిస్తూ, తిరుమలలోనే జీవితం గడిపారు. గురువు ఆనతిపై, తాళ్ళపాక వెళ్లి తిమ్మక్క, అక్కమ్మలను వివాహం చేసుకున్నా, వారితో తిరిగి తిరుమల దర్శనం చేసుకున్నారు. 95 ఏళ్ళ పూర్ణ వయస్కుడై, అన్నమ య్య దుందుభి నామ సంవత్సర ఫాల్గుణ బహుళ ద్వాదశి 1503 ఫిబ్రవరి 23న పరమపదించారు. అన్నమయ్య సంకీ ర్తనా సేవ, సంగీత సాహిత్య భక్తి పరిపుష్టం. తెలుగు లోనే రాసినా పాడినా ఆయన సాహిత్యం సంస్కృత పద భూయిష్టం. అన్నమయ్య యోగ వైరాగ్య శృంగారం సరణి మొత్తం 32 వేల సంకీర్తనలు రచించారని అనుకొంటున్నా, ఆయన వారసులు రాగి రేకులపై వ్రాయించి, తిరుమలలో సంకీర్తనా భాండా గారం నందు పొందు పరిచినవి, ప్రస్తుతం 12 వేలు మాత్ర మే. మంజరి ద్విపదలో "శృంగార మంజరి" అనే కావ్యాన్ని రచించారు. ఆయన రచనలని చెప్పబడే 12 శతకాలలో "వెంకటేశ్వర శతకము" మాత్రమే లభిస్తున్నది. "అదివో అల్లదివో, క్షీరాబ్ధి కన్యకకు, జో అచ్యుతానంద, ఉదయాద్రి తెలిపాయే, కొండలలో నెలకొన్న, మూసిన ము త్యాల, నిగమ నిగమాంత, లాంటి అన్నమయ్య కీర్తనలు, తెలు గు సంగీతాభిమానులకు, నిత్యం వీనులకు విందు చేస్తూనే ఉన్నాయి. "సంకీర్తనాచార్యుడు", "పదకవితా పితామహు డు", "పంచమాగమ సార్వభౌముడు", "ద్రావిడ ఆగమ సార్వభౌము డు"అని బిరుదాంకితుడు అయిన, అన్నమయ్య వాసిలో, రాశిలో, రచనలు ఆంధ్ర వ్మాయంలో సరిరానివి అనడంలో అతిశయోక్తి లేదు.

# అక్కినేని, దుక్కిపాటిల అనుబంధం





దుక్కిపాటి మధుసూదనరావు ( జూలై 17, 1917 మార్చి 26, 2006) కు తెలుగు సినిమాతో 1940 నుంచే అనుబంధం ఉంది. అక్కినేని నాగేశ్వరరావు సినీ జీవితాన్ని ప్రభావితం చేసిన అతి ముఖ్యుల్లో దుక్కిపాటి ఒక్కరు. అక్కినేనికి చిత్రసీ మలో మార్గదర్శిగా నిలచి ఆయన నటునిగా సినీ చరిత్రలో నిలచి పోయేలా చేయడంలో ప్రధాన భూమిక పోషించారు దుక్కిపాటి. అన్నపూర్ణ పిక్చర్స్ పతాకంపై సినిమాలు సిర్మిం చిన ప్రముఖ తెలుగు నిర్మాత. దుక్కిపాటి 1951సెప్టెం బరు10వ తేదీన అక్కినేని నాగేశ్వరరావు, కాట్రగడ్డ శ్రీనివాసరావు, కొరటాల ప్రకాశరావు టి.వి.ఎ.సూర్యారావు లతో కలసి అన్నపూర్ణ పిక్చర్స్ ప్రయివేట్ లిమిటెడ్ సంస్థను స్థాపించి, మొదటి ప్రయత్నంగా "దొంగరాముడు" సినిమాను తీశారు. దుక్కిపాటి తనని అమ్మకన్నా మిన్నగా పెంచి పోషించిన సవతితల్లి అన్నపూర్ణ పేరుతో నిర్మాణ సంస్థను ప్రారంభించారు. దానికి అక్కినేని నాగేశ్వరరావుని ఛైర్మన్ ను చేశారు. కృష్ణా జిల్లా గుడివాడ తాలూకా పెయ్యేరు గ్రామంలో దుక్కిపాటి మధుసూదనరావు జూలై 27, 1917 న సంపన్న వ్యవసాయ కుటుంబంలో గంగాజలం, సీతారామస్వామి దంపతులకు జన్మించారు. బందరు నోబుల్ కళాశాలలో బి.ఏ చదివారు. ఆంధ్రా యూనివర్సిటీ స్థాయిలో ఇంగ్లీష్ సబ్జెక్ట్ లో యూనివర్సిటీ గోల్డ్ మెడల్ సాధించారు. చదువు పూర్తి చేసుకున్న దుక్కిపాటి, తాను కార్యదర్శిగా ఎక్సెల్సియల్ క్లబ్బు అనే నాటక సంస్థను ప్రారంభించారు. కోడూరి అచ్చయ్య, ఎం.ఆర్.అప్పారావు వంటి మిత్రులతో కలసి ఆ క్లబ్బు పక్షాన నాటకాలు విరివిగా ప్రదర్శించారు.ఎక్సెల్సియల్ క్లబ్లులో దుక్కిపాటితో పాటు పెండ్యాల, బుద్ధిరాజు శ్రీరామమూర్తి వంటివారు ఉండేవారు. వారి సహకారంతో ఆయన ఆశాజ్యోతి, సత్యాన్వేషణ, తెలుగుతల్లి వంటి సాంఘిక నాటకాలను రాయించి చేపట్టారు. అవి ఘన విజయాలను నమోదు చేసుకున్నాయి. ఆ సమయంలో దుక్కిపాటికి అక్కినేనితో పరిచయం విచిత్రంగా కలిగింది. అప్పటికే అక్కినేని ధర్మపత్ని చిత్రంలో నటించి వెనక్కి వచ్చేశారు. బుద్ధిరాజు శ్రీరామమూర్తి సలహాతో 'విప్రనారాయణ' నాటకంలో దేవదేవి పాత్ర పోషిస్తున్నారు. ఆ నాటక ప్రదర్శన చూసిన దుక్కిపాటి, తమకు కథానాయిక/స్త్రీ పాత్ర లేని లోటు తీరిందని అక్కినేనిని హీరోయిన్ని చేశారు. అలా వారంతా నాటకాల్లో బిజీగా ఉన్నప్పుడే ఘంటసాల బలరామయ్య ఓ రైల్వేస్టేషన్లో అక్కినేనిని చూసి తన సినిమాకు ఆయనే తగిన వ్యక్తి అని నిర్ధారించుకొని చిరునామా తీసుకొన్నారు. తర్వాత గుడివాడకు వచ్చి అక్కినేనికి కబురు చేశారు. దుక్కిపాటి, రామబ్రహ్మం (అక్కినేని సోదరుడు) ఇద్దరూ అక్కినేనిని ఘంటసాల బలరామయ్య వద్దకు తీసుకెళ్లారు. ఆయన వారిని మద్రాసు కొచ్చి 'ప్రతిభ' ఆఫీసులో సంప్రదించ మన్నారు. దుక్కిపాటి, మరో మిత్రుడు సూర్యప్రకాశరావుతో కలసి అక్కినేనిని తీసుకొని మద్రాసులో 'ప్రతిభ' ఆఫీసుకు వెళ్లగా, పేకేటి అక్కినేని స్వాగతించారు. అలా 'సీతారామ జననంలో అక్కినేని హీరో అయ్యారు. ఆ తర్వాత దుక్కిపాటి, బలరామయ్య, చల్లపల్లి రాజాలతో కలసి గూడవల్లి రామబ్రహ్మం దగ్గరకెళ్లి అక్కినేనిని 'మాయాలోకం'లో చిత్రానికి తీసుకొమ్మని సూచించారు. దుక్కిపాటి మధుసూదనరావు తనని అమ్మకన్నా మిన్నగా పెంచి పోషించిన సవతితల్లి "అన్నపూర్ణ" పేరుతో నిర్మాణ సంస్థను ప్రారంభించారు. దానికి అక్కినేని నాగేశ్వరరావుని ఛైర్మన్‌ని చేశారు. ఆ సంస్థ ద్వారా తొలిసారి "దొంగరాముడు" చిత్రం నిర్మించారు. కె.వి.రెడ్డి దర్శకత్వంలో అక్కినేని, సావిత్రల జంట కన్నుల పండువుగా నటించడంతో అది ఘనవిజయం సాధించింది. దుక్కిపాటి ఆనందానికి అవధుల్లేకుండా పోయింది. తోడికో డళ్ళు, మాంగల్యబలం, వెలుగునీడలు, చదువుకున్న అమ్మా యిలు, ఇద్దరు మిత్రులు, డాక్టర్ చక్రవర్తి, ఆత్మ గౌరవం, పూలరంగడు, విచిత్రబంధం, ప్రేమలేఖలు, రాధాకృష్ణ, పెళ్లీడు పిల్లలు, అమెరికా అబ్బాయి... వంటి అద్భుతమైన చిత్రాలెన్నో దుక్కిపాటి నిర్మించారు. డాక్టర్ చక్రవర్తి చిత్రం రాష్ట్ర ప్రభుత్వం నెలకొల్పిన తొలి నంది అవార్డును అందుకోవడం విశేషం. అధిక చిత్రాలు ఘనవిజయం సాధించాయనడంలో సందేహం లేదు. తెలుగులో ద్విపాత్రాభినయం చేసిన మొదటి సినిమా "ఇద్దరు మిత్రులు". అన్నపూర్ణ సంస్థ నిర్మించే సినిమాలకు ఎక్కువగా ఆదుర్తి సుబ్బారావు దర్శకత్వం వహించే వారు. దుక్కిపాటి తన సినిమాలలో కొ్రపాటి గంగాధరరావు, యుద్ధనపూడి సులోచనరాణి, గొల్లపూడి మారుతీరావు, ముప్పాళ్ల రంగనాయకమ్మ (సంభాషణల రచయిత్రి), కె.విశ్వనాథ్ (దర్శకుడు), ఆశాలత కులకర్ణి, జి. రామకృష్ణ, జీడిగుంట రామచంద్ర మూర్తి, శారద వంటి కళాకారులను పరిచయం చేశారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమ హైదరాబాద్‌కు తరలి రావడానికి అక్కినేనితోపాటు దుక్కిపాటి మధుసూదనరావు ఎంతో కృషి చేశారు. అందుకే ప్రతిష్ఠాత్మకమైన రఘుపతి వెంకయ్య అవార్డుతో రాష్ట్ర ప్రభుత్వం ఆయన్ని సత్కరించింది. అలా దుక్కిపాటి, అక్కినేని ఇద్దరూ తమ సంబంధం, బంధం, అనుబంధం అద్వితీయం అని నిరూపించారు. దుక్కిపాటి 90 యేళ్ళ వయసులో 26 మార్చి, 2006 రోజున మరణించారు.

# నీట్ 4.0 తో ప్రెప్ఇన్‌స్టా భాగస్వామ్యం.

**గుంటూరు మర్చి 25 (ప్రజాజ్యోతి బ్యూరో ):** ప్రముఖ ప్లేస్‌మెంట్ సన్నాహక వేదిక ప్రెప్ఇన్‌స్టా ఇప్పుడు ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) 4.0 నేషనల్ ఎడ్యుకేషనల్ అలయన్స్ ఫర్ టెక్నాలజీ కార్యక్రమంలో భాగమైందని సంస్థ ప్రతినిధులు ప్రకటనలో తెలిపారు. ఈ భాగస్వామ్యం ద్వారా భారతీయ విద్యార్థులను పరిశ్రమకు కావాల్సిన నైపుణ్యాలు, పోటీతో కూడిన అంతర్జాతీయ ఉద్యోగ మార్కెట్‌కు సిద్ధం చేస్తుందన్నారు. దేశంలో సాంకేతిక విద్యను మార్చే ప్రెప్ఇన్‌స్టా కోర్సులు ఇప్పుడు నీట్ 4.0 పోర్టల్ ద్వారా పొందవచ్చన్నారు. 2019లో స్థాపించిన ప్రెప్ఇన్‌స్టా జనరేటివ్ ఏఐ, మెషిన్ లెర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సైన్స్ వంటి అధిక డిమాండ్ ఉన్న రంగాలలో విద్యార్థుల నైపుణ్యాలు పెంపొందించడంపై దృష్టి పెడుతుందన్నారు. బిగ్ 4, ఫాంగ్ సహా అగ్రశ్రేణి ప్రపంచ కంపెనీలలో ప్లేస్‌మెంట్లు పొందడంలో విద్యార్థులకు ఈ కార్యక్రమాలు సాయపడతాయన్నారు. అంతే



కాదు ప్రతి విద్యార్థి ప్లేస్‌మెంట్ ప్రక్రియ పూర్తిగా ట్రాక్ చేసేందుకు, వారి పనితీరు పర్యవేక్షించడానికి, అనుకూలమైన అసెస్‌మెంట్స్ నిర్వహించడానికి %ఖుఖు% టూల్‌తో కాలేజీ మేనేజ్‌మెంట్‌కు ప్రెప్ఇన్‌స్టా సాయపడుతుందన్నారు. ప్రెప్ఇన్‌స్టా సహ-వ్యవస్థాపకుడు మనీష్ అగర్వాల్ మాట్లాడుతూ, ఏఐసీటీఈ, నీట్ కార్యక్రమంతో భాగస్వామ్యం భారతదేశంలో సాంకేతిక విద్య భవిష్యత్‌ను మార్చే దిశగా ఒక అడుగు వేసిందన్నారు. కెరీర్‌కు కావాల్సిన నైపుణ్యాలకు తగ్గట్టుగా విద్యార్థులను సిద్ధం చేసి వేగంగా ఎదుగుతున్న ఉద్యోగ మార్కెట్‌లో వారికి ఉద్యోగాలు వచ్చేలా చూడటం మా వచ్చే ఆర్థిక సంవత్సంరలో తన నెట్‌వర్క్‌ను 250o కాలేజీలకు విస్తరించాలన్నది ధ్యేయంగా పెట్టుకుందన్నారు. 2019లో విద్యా మంత్రిత్వ శాఖ ప్రారంభించిన నీట్ కార్యక్రమం, విద్యార్థులు ముఖ్యంగా ఆర్థికంగా, సామాజికంగా అణిచివేతకు గురయ్యే నేపథ్యం కలిగిన వారికి సాంకేతిక విద్యా పరిష్కారాలు చూపి వారి ఉపాధి అవకాశాలు పెంపొందించడంపై ప్రధానంగా దృష్టి సారించిందన్నారు.

# జాతరో జాతర పైడితల్లి జాతర





**అంగరంగ వైభవంగా పైడితల్లి అమ్మవారి యాత్రా మహోత్సవాలు**

**కాళీ కా మాతగా అమ్మవారి దర్శనం**

**సుదీర ప్రాంతాల నుండి పోటెత్తిన భక్తజనం**

**ప్రత్యేక పూజలు, చండీ హోమాలు**

**అమ్మవారిని దర్శించుకున్న మాజీ స్పీకర్ తమ్మినేని,మాజీ ఎంపీపీ కూన ప్రమీల**

**పొందూరు, ప్రజా జ్యోతి న్యూస్:** పొందూరు పైడితల్లి అమ్మవారి 40 వ యాత్రా మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. జాతర సందర్భంగా మంగళవారం చివరి రోజు కావడంతో ఆలయ ప్రాంగణం భక్త జన సంద్రాన్ని తలపించింది. ఇసుకేస్తే రాలనంత భక్తులు హాజరయ్యారు. ఉదయం నుండి ఆలయ ప్రాంగణం భక్తుల తాకిడితో కిటకిటలాడింది. సుదీర ప్రాంతాల నుండి ప్రజలు అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూలో బారులు తీరారు. పురోహితులు కూనపులి రామకృష్ణ శర్మ పైడితల్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు,మంగళహారతులు, చండీ హోమం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు జాతరకు హాజరు కావడంతో ఎస్. ఐ సత్యన్నారాయణ పటిష్ఠమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి,ఎల్లవేళలా పర్యవేక్షిస్తూ ఎటువంటి అవాంచనీయ



సంఘటనలు జరగకుండా జాగ్రత్త వహించారు. సరుబుజ్జిలి ఎస్. ఐ ప్రవల్లిక అమ్మవారిని దర్శించుకుని ,పోలీస్ బందోబస్తు పర్యవేక్షించారు.జాతర సందర్భంగా మాజీ స్పీకర్ , వైఎస్సార్సీపీ జిల్లా పార్లమెంటు పరిశీలకులు తమ్మినేని సీతారాం ,ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి ,పొందూరు మాజీ ఎంపీపీ కూన ప్రమీల యాత్రా మహోత్సవాల్లో పాల్గొన్నారు. వీరికి పైడితల్లి అమ్మవారి ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. వీరితో పాటు స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి సువ్వారి గాంధీ , ప్రముఖ వ్యాపార వేత్త జామి వెంకట రమణ యాత్రా మహోత్సవాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణం వద్ద ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను, మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ అన్నదాన కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ దున్నా రాధాకృష్ణ ,సేవా సమితి సభ్యులు సేవలందించారు.పంచాయతీ ఈ. ఓ మోహన్ బాబు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. యంగ్ స్టార్ యూత్ క్లబ్,రాంబాబు యువజన సంఘం,ట్రైలర్స్ యూనియన్ వంటి పలు స్వచ్ఛంధ సంస్థలు త్రాగునీరు , మజ్జిగ వంటి సౌకర్యాలను భక్తులకు అందజేశారు. వీరితో పాటు లక్షింపేట చింతకాయల వాసు యూత్ మజ్జిగ పంపిణీ చేశారు. సర్కస్ లు, జాయింట్ వీలు, చుట్టూ తిరిగే రైలు బండ్లు వద్ద పిల్లలు, యువకులు , పెద్దలు కేరింతలు కొట్టారు. సోమ వారం నిర్వహించిన ఢీ షో, మంగళవారం నిర్వహించిన బాణసంచా ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. యాత్రా మహోత్సవాల్లో స్థానిక సర్పంచ్ రే గిడి లక్ష్మీ , అనకాపల్లి విజయ లక్ష్మీ , నాలగవ ఎంపీటీసీ బాడాన శేషగిరి హారిక , ఎంపీపీ కిల్లి ఉషారాణి ,పి. ఎ.సి.ఎస్ మాజీ అధ్యక్షులు కొంచాడ రమణ మూర్తి , వైకాపా పట్టణ పార్టీ అధ్యక్షులు గాడు నాగరాజు , ఉప ఎంపీపీ వండాన వెంకట్రావు , ఇరు పార్టీల నేతలు పాల్గొన్నారు.

# హెూమములో కొబ్బరికాయ పగిలి టిప్ టాప్ టెంటుపై చిన్న ముక్క పడి టిప్ టాప్ దద్గమైనది

**ప్రజాజ్యోతి న్యూస్/జీలుగుమిల్లి** "అంత పెద్ద ఎత్తున హెూమం జరిగిన ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు భక్తులకు. అంత ఆ దేవుని మహత్యమే ఓరుగంటి- నాగరాజు. ఓం నారాయణ ఆదినారాయణ శ్రీ స్వామి వారి కార్యక్రమాలు ములగలంపల్లిలో ఉదయం పూజా కార్యక్రమాలు అనంతరం అగ్నిగుండం పూజ పాదుకుల అభిషేకం బిక్షాటన అన్నదానం బాగా జరిగాయి ములగలంపల్లి 17వ ఆదినారాయణ భజన గురువులు ఓరుగంటి నాగరాజు అన్నారు. చివరిలో చిన్న అపశృతి జరిగింది. హెూమములో కొబ్బరికాయ పగిలి టిప్ టాప్ టెంటు పై చిన్న ముక్క పడింది. ఎండలు నష్టం విపరీతంగా ఉండడం టెంటు టార్బల్ సిల్క్ క్లాత్ లు అవడం వలన అంటుకొని రెండు టెంట్ లు డెకరేషన్ దద్గమైనాయి నష్టం జరిగింది. టిప్ టాప్ వారు ఎక్కువ గా నష్టం జరిగిందని చెప్తున్నారు అయితే భగవంతుని నిర్ణయం ఎలా ఉందో మనకు తెలియదు ఎందుకు జరిగిందో అంతా స్వామి వారికే ఎరుక వారి దయవలన జరిగింది. మనుషులకు మాత్రం ఎవరికి ఎటువంటి చిన్న హాని కూడా జరగలేదు ఇది జరగడం వలన నాకు కొందరి స్వభావాలు మాత్రం బయటపడినవి అంత జరుగుతూ భక్తులు ఆర్పడానికి చాలా ప్రయత్నాలు చేశారు గాని రెండు నిమిషాలలో అంతా జరిగిపోయింది. అంతా బాగా జరిగినప్పుడు స్వామివారు, జరగకపోతే బయటివారు అనే విధంగా ఉండకుండా అందరూ సంయుక్తంగా ముందుకు వచ్చారు. ఫోన్ లో ఎలా జరిగిందని తెలిసి చాలా బాధను వ్యక్త పరుస్తూ నాకు ఓదార్పుగా చాలామంది ధైర్యం చెపుతూ ఉన్న కొందరు మిత్రులు ఫోన్ చేసి వివరాలను తెలుసుకుంటూ ధైర్యం పరోక్షంగా ప్రత్యక్షంగా ధైర్యం ఇచ్చిన మిత్రులందరికీ హృదయపూర్వక నమస్కారములు అలాగే చిన్న కథ ఏదైనా



మన మంచికే ఒకసారి ఒక రాజుగారు కత్తి సాము చేసేటప్పుడు తన బొటనవేలు తెగి పడింది చాలా బాధపడ్డాడు రాజుగారు తన మంత్రి ఓదార్పుగా అంతా మనమంచికే ధైర్యంగా ఉండండి అని చెప్పారు. ఆ మాట రాజుగారికి నచ్చలేదు మంత్రిని చెరసాలలో పెట్టించారు ఇప్పుడు బాగుందా అని అడిగాడు రాజుగారు అంతా మనమంచికే పరవాలేదు అన్నాడు. మహామంత్రి ఒక ప్రయాణం చేయవలసి ఉండి మహామంత్రిని తీసుకోకుండా ఒక్కడే వెళ్ళవలసి వచ్చింది మార్గ మధ్యలో రాజు గారిని కొందరు అజ్ఞాతవాసులు బంధించి తీసుకువెళ్లారు అడవిలో అక్కడ అమ్మవారికి పూజలు జరుగుతున్నవి ఒక మనిషిని బలి ఇవ్వాలి అని వెతుకుతూ ఉంటే ఈ రాజుగారు దొరికాడు వారికి అప్పుడు వారు బలి ఇచ్చేటప్పుడు అతను అంగవైకల్యంతో ఉండకూడని వ్యక్తి కావాలి ఒక వ్యక్తి వచ్చి అంతా పరిశీలనగా చూస్తే అతనికి ఒక వేలు లేదు వేలు లేని వ్యక్తి పనికిరాడు అని వదిలేశారు. ఆ రాజు గారికి అప్పుడు మహామంత్రి మాట గుర్తు వచ్చి వెనక్కి వెళ్లి క్షమాపణ చెప్పి మహామంత్రిని విడిపించాడు అప్పుడు మరి చెరసాలలో వేయటం కూడా మన మంచికే అన్నావు నీకు ఏమి మంచి జరిగింది అని అడిగాడు రాజుగారు మీరు వెళ్లే పనికి నన్ను కూడా తీసుకువెళ్తారు



అక్కడ మీకు వీలు లేదు కాబట్టి మిమ్మల్ని వదిలేసారు నాకు అన్నీ ఉన్నాయి. పొరపాటున నేను వచ్చి ఉంటే నన్ను బలి బలి ఇచ్చేవారు మీరు చెరసాలలో వేయటం వలన నేను బ్రతికి పోయాను అని చెప్పాడు. ఏదో జరగవలసింది ఈ విధంగా జరిగి మంచే జరిగింది భగవంతుని యొక్క లీల ఎవరికి తెలియదు కాబట్టి అంతా మన మంచికే భగవంతుని లేదా గుర్తించి ఆయన స్మరణ చేసుకోవడమే మన కర్తవ్యం ఇంత కార్యక్రమం జరిగితే భగవంతుడు రక్షించలేదని బాధపడవద్దు మనుషుల కు ఎటువంటి హాని జరగలేదు అంత సమాజ మంచి కోసం జరిగిందని అనుకోవాలని ఆయన అన్నారు.

## చదువుకోవాలనే కోరికను తీర్చడం కోసం మాస్టారు అయిన మాజీ మంత్రి కే.ఎస్.జవహర్





**తూర్పుగోదావరి జిల్లా, తాళ్లపూడి మండలం, మార్చి25, ప్రజా జ్యోతి న్యూస్** తాళ్లపూడి మండలం అన్నదేవర పేట గ్రామానికి చెందిన ఆకుల లావణ్య లక్ష్మీ కి చదువు అంటే చాలా ఇష్టం కానీ ఆమె లో చదువుకోవాలి అనే కోరిక ఉన్న పుట్టుకతోనే పూర్తి అంగవైకల్యం కావడం తో మంచానికే పరిమితమైఉండేది స్కూల్ కి వెళ్లి చదువుకోలేక ఇంటికి వచ్చి చదువు చెప్పేవాళ్ళు ఎవ్వరూ లేక బాధ పడుతున్న సమయంలో చదువు విలువ తెలిసి ఉపాధ్యాయ వృత్తిలో ఎంతోమందిని విద్యావంతులుగా తీర్చిదిద్ది ప్రయోజకులుగా చేసి మాస్టారు నుంచి నుంచి రాష్ట్ర మంత్రి వరకు ఎదిగిన మాజీ మంత్రి జవహర్ నువ్వు ఇలా మిగిలిపోకూడదు నేటి సమాజంతో పోటీ పడాలి నువ్వు ఎంతోమందికి ఇన్స్పిరేషన్ గా నిలబడాలి అని నాలో ఆత్మ స్థైర్యాన్ని నింపారని ఒకటవ క్లాస్ కూడా పూర్తిగా చదవలేకపోయిన నన్ను జవహర్ ప్రోత్సహించి నాకు చదువు నేర్పి ఆయన, ఆయన కుటుంబమంతా కలిసి రాత్రుళ్ళు ఒక్కొక్కరు ఒక్కో సబ్జెక్ట్ చెప్తూ పదవ తరగతి పరీక్షలు రాయటానికి నన్ను సిద్ధం చేసి ఆశీస్సులు అందించి నన్ను పరీక్షలు రాయటానికి పంపించటం జరిగిందని అందుకు వారికి వారి కుటుంబ సభ్యులకు నా జీవితాంతం ఋణపడి ఉంటాను అని నేనే కాకుండా ఎంతో మంది పేద విద్యార్థులకు చదువు విషయంలో సహాయ సహకారాలు అందిస్తున్నారని ఆనందాన్ని వ్యక్తం చేస్తూ తన సంతోషాన్ని మీడియాతో పంచుకున్నది

## నిరుపయోగకరంగా మారిన బస్టాండ్ తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటున్న ప్రయాణికులు





**తూర్పుగోదావరి జిల్లా, తాళ్లపూడి మండలం, మార్చి25, ప్రజా జ్యోతి న్యూస్** తాళ్లపూడి బస్టాండ్ కూడలిలో ప్రయాణికులకు మరుగుదొడ్లు లేకపోవడంతో ప్రయాణికులతో పాటు రోడ్ల పై చిరు వ్యాపారం చేసుకునే మహిళ వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తాళ్లపూడి మండల కేంద్రం కావడంతో నిత్యం వందలాది వాహనాలు రద్దీగా తిరుగుతూ ఉంటాయి. మండలం చుట్టు ప్రక్కల గ్రామాల నుండి మహిళలు వివిధ పనులపై వస్తూ ఉంటారు. బస్టాండ్ సమీపంలో మరుగుదొడ్లు లేక అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా బస్ కోసం ఎదురుచూసే ప్రయాణికులకు నిలువ నీడ లేకపోవడంతో చిన్న పిల్లలతో బస్సుల కోసం ఎండలో పడిగాపులు పడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ప్రతి రోజు రాత్రి వేళల్లో హైదరాబాద్ కు వెళ్లే ప్రయాణికులు ముఖ్యంగా మహిళలు, వృద్ధులు మల మూత్ర విసర్జన చేయాలంటే మరుగుదొడ్లు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇకపోతే ఎన్నో లక్షల ఖర్చు పెట్టి తాళ్లపూడి గ్రామపంచాయతీ ఎదురుగా బస్టాండ్ నిర్మించిన నేటికీ ఉపయోగంలోకి రాలేదు సరిగదా రాత్రి సమయంలో మందు బాబులకు అడ్డగా మారింది అనడానికి సందేహం లేదు. సంబంధిత అధికారులు, నాయకులు వీటిపై దృష్టి సారించి ప్రయాణికుల అవస్థలు తీరేలా పరిష్కారం చూపాలని ప్రయాణికులు కోరుతున్నారు

## వైకాపా నాయకులు అసత్య ప్రచారాలను ఖండించాలని -చాట్రాతి ప్రసాద్ కోరారు.

'జీలుగుమిల్లి మండల బిజెపి అధ్యక్షులు గుడ్ల రాంబాబు.

'బిజెపి జిల్లా కార్యదర్శి చాట్రాతి ప్రసాద్.





**ప్రజాజ్యోతి న్యూస్, జీలుగుమిల్లి** జీలుగుమిల్లి మండల కేంద్రంలో ఇటీవల తాటియకుల గూడెంలో జరిగిన గంధం బోసు హత్యలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, మాజీ ఎంపీటీసీ, తెలుగుదేశం పార్టీ నాయకులు చిర్రి వెంకటేశ్వరరావు ప్రమేయం ఉందంటూ వైకాపా నాయకులు, వైకాపా సోషల్ మీడియా చేసిన అసత్య ప్రచారాలను ప్రతి ఒక్కరు ఖండించాలని భారతీయ జనతా పార్టీ జిల్లా కార్యదర్శి చాట్రాతి ప్రసాద్ పేర్కొన్నారు. ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ వాస్తవాలు తెలియకుండా వైకాపా నాయకులు, ఆ పార్టీ సోషల్ మీడియా ఎమ్మెల్యే బాలరాజు పై, చిర్రి వెంకటేశ్వరరావు పై లేనిపోని నిందలు వేయడం సిగ్గుచేటు అన్నారు. ఇలాంటి అసత్య ప్రచారాలు చేసే వారిపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రసాద్ డిమాండ్ చేశారు. కక్షపూరిత రాజకీయాలతో కూటమి నాయకులపై బురద జల్లితే తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఇకనైనా వైకాపా నాయకులు విమర్శలు చేసే ముందు ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు. బిజెపి మండల అధ్యక్షులు గుడ్ల రాంబాబు, బిజెపి మండల గౌరవ అధ్యక్షులు కే ఎల్ వి ప్రసాద్, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి, సుబ్బారెడ్డి, ఎన్ లక్ష్మణ్, ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఖండించిన వారిలో ఉన్నారు.

## ఆడపిల్ల సేవా సొసైటీ ద్వారా మజ్జిగ పంపిణీ





**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** పొందూరు మండల కేంద్రంలో అంగరంగ వైభవంగా జరుగుతున్న పైడితల్లి అమ్మవారి యాత్రా మహోత్సవాలలో శ్రీకాకుళం ఆడపిల్ల సేవా సొసైటీ తమ సేవలను అందించారు. సేవా సొసైటీ ఫౌండర్ ,మహిళా పోలీస్ మడ్డి లావణ్య ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని స్థానిక ఎస్. ఐ సత్యన్నారాయణ,సర్పంచ్ రేగిడి లక్ష్మీ ప్రారంభించారు. వేసవి తాకిడిని దృష్టిలో పెట్టుకొని భక్తులు అధిక సంఖ్యలో యాత్రకు తరలి రావడంతో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు లావణ్య తెలిపారు.

# ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ







**గుంతకల్లు మార్చి 25 (ప్రజా జ్యోతి):** పట్టణంలోని స్థానిక అంబేద్కర్ నగర్ లో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి మరియు అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నాడు ఎమ్మార్పీఎస్ జండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎం ఈ ఎఫ్ పట్టణాధ్యక్షులు మణిభూషణ్, ఎం ఈ ఎఫ్ జిల్లా జాయింట్ సెక్రెటరీ జి. రామాంజనేయులు, ఎంజిఎఫ్ నాయకులు వై.రామదాసు టిడిపి ఎస్సీ సెల్ నాయకులు జింతుల.జగన్నాథ్, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు చెరువు నాగరాజు,మాజీ కౌన్సిలర్ ఎన్. ప్రమీలమ్మ మరియు ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘ నాయకులు పాల్గొని మాట్లాడుతూ ఇటీవల ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించినందుకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ అభినవ అంబేద్కర్ మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాట ఫలితంగా ఎస్సీ లోని ఉప కులాలకు విద్య ,ఉద్యోగ సామాజిక రంగాల్లో సామాజిక న్యాయం జరగాలనే లక్ష్యంతో చేసిన పోరాటం నేను ఫలించినందు కు, ఎమ్మార్పీఎస్ ఉద్యమం కోసం ఆయన తన జీవితాన్ని, కుటుంబాన్ని, త్యాగం చేసి, ఎస్సీ వర్గీకరణతోనే మాదిగ ఉపకులాలకు న్యాయం జరుగుతుందని అనేక ఉద్యమ పోరాటాలు చేశారు. ఈ పోరాటంలో అమరులైన మాదిగ అమరవీరులను స్మరించుకొని వారి త్యాగాల ను కొనియాడారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ నగర్లో ఎమ్మార్పీఎస్ జెండా ఏర్పాటు చేయడంలో రిపోర్టర్ తలారి ఆనంద రాజు యొక్క కృషి అభినందనీయమని కొనియాడారు.ఎస్సీ వర్గీకరణకు వెన్నుదన్నుగా నిలిచిన భారత ప్రధాని నరేంద్ర మోడీ కి,ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ కి,ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేసి ఎస్సీ వర్గీకరణ అసెంబ్లీలో తీర్మానం చేసినందుకు మాదిగ జాతి తరపున ప్రత్యేక ధన్యవాదా లు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో దళితుల ఐక్యవేదిక నాయకులు వెల్లిపోగల ఆనంద్, నాలుగో వార్డ్ టిడిపి నాయకులు రవికుమార్, మస్తానమ్మ, చింతకుంట శ్రీనివాసులు, తలారి మస్తాన్, భారత రాజ్యాంగ అవగాహన వేదిక మహిళా విభాగ అధ్యక్షురాలు జింకల సరస్వతి బిజెపి నాయకులు కృష్ణమూర్తి, బాలాంజనేయులు, ఎం ఈ ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి టీచర్ రామాంజనేయులు, లైన్మెన్ రామాంజనేయులు, అంబేద్కర్ నగర్ పాఠశాల ఉపాధ్యాయులు రాజు, మరియు ఉద్యోగులు,దళిత మహాసభ ప్రెసిడెంట్ ఎన్ వీరేష్ కుమార్ వైస్ ప్రెసిడెంట్ చింతకుంట శ్రీనివాసులు, ఎం.సుధాకర్లు సెక్రెటరీ జి ఆర్ చిన్న ఎల్లప్ప ముక్కుడి మద్దిలేటి, వై. హనుమంతు తలారి. అనందరాజు,బి. చిన్న నాగరాజు మరియు ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి కార్యకర్తలు యువతీ యువకులు పాల్గొన్నారు.

# పట్టణ శివారు ప్రాంతంలో మౌలిక వసతులు కల్పించాలని వినతి




**గుంతకల్లు మార్చి 25 (ప్రజా జ్యోతి):** మంగళవారం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పట్టణలో మరియు శివారు ప్రాంతంలో ఉన్న మౌలిక వసతులు, సిమెంటు రోడ్లు, మురికి కాలువలు, పారిశుద్ధ్యం, మంచినీటి సమస్యలను పరిష్కరించా లని, మున్సిపల్ కమిషనర్ మొండి వైఖరిని నిరసిస్తూ మున్సిపల్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించి అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్.భవాని మేడం కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతీ ప్రసాద్ మాట్లాడుతూ... సిఐటియు కాలనీ నందు సిమెంటు రోడ్లు, మురికి కాలువలు, మంచినీటి పైప్లైన్లు, ఇంటి పన్నులు వేయాలని, ద్వారక నగర్, సాయిబాబా గుడి, భీమ లింగస్వామి గుడి, రామిరెడ్డి కాలనీ ప్రాంతాలలో సిమెంటు రోడ్లు, మురికి కాలువలు ఏర్పాటు చేయాలని. అల్లిపిర కాలనీలో మురికి కాలువలు ఏర్పాటు చేయాలని, ప్రశాంతి నగర్, శ్రీనివాస్ నగర్ ప్రాంతాలలో సిమెంట్ రోడ్లు కాలువలు ఏర్పాటు చేయాలని. షికారి బెంచ్ ప్రాంతంలో ప్రత్యేక పారిశుద్ధం ఏర్పాటు చేయాలని, 31 వ వార్డు మస్తాన్ పేట భాగ్యనగర్ ప్రాంతాలలో సిమెంటు రోడ్లు, మురికి కాలువలు, కల్వర్టులు, మంచినీటి సమస్య పరిష్కారం చేయాలని, 31, 33, 34 నగర్ వార్డులకు సంబంధించి ప్రజలు రైల్వే ప్రాంతంలోకి వెళ్లకుండా రైల్వే అధికారులు దారికి అడ్డంగా నిర్మించిన గోడలను తొలగించాలని, సిద్ధార్థ నగర్, సాయినాథ్ గౌడ్ కాలనీ, నాయి బ్రాహ్మణ కాలనీ, మైనార్టీ కాలనీ, బెస్త కాలనీ, అంజలి నగర్, భీమ్ రెడ్డి కాలనీ, ఎర్ర చెరువు కాలనీ, ఇందిరమ్మ కాలనీ, సంతోష్ నగర్, జగనన్న కాలనీ పలు ప్రాంతాలలో సిమెంటు రోడ్లు, మురికి కాలువలు, మంచినీటి పైప్లైన్లు, విద్యుత్ స్తంభాలు, వీధిలైట్లు, ఏర్పాటు చేయాలని. తిలక్ నగర్ సాయి కృష్ణ నర్సింగ్ హోమ్ ప్రాంతంలో మురికి కాలువలు పెద్దగా చేయాలి, కథల వీధిలో చెత్తాచెదారం పేరుకు పోయింది వెంటనే ఈ చెత్తను తొలగించాలి, తిలక్ నగర్ 60 అడుగుల రోడ్డు జయవర్ధన్ ఆసుపత్రి ముందు ఉన్న పేదల బంకులను తొలగించరాదు, పట్టణం విస్తారంగా పెరిగింది దానికి అనుగుణంగా పారిశుద్ధ కార్మికుల సంఖ్యను పెంచి పట్టణ ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని. పారిశుద్ధ్యం మెరుగుపరచాలని. పట్టణంలో మంచినీరు కలుషితమై దుర్వాసనతో కూడిన నీరు వస్తుంది ఈ సమస్యను పరిష్కరించాలి. అలాగే మున్సిపల్ కమిషనర్ గారు మున్సిపల్ ఆఫీస్ సిబ్బంది పట్ల, సచివాలయం మహిళ ఉద్యోగుల పట్ల, పారిశుద్ధ మహిళ కార్మికుల పట్ల దురుసుగా మాట్లాడటం వారిని ఇబ్బంది పెట్టడం జరుగుతున్నది కమిషనర్ పై ఆర్.జె.డి గారి ఆధ్వర్యంలో విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు జగ్గిలి రమేష్, సాకే నాగరాజు, కసాపురం రమేష్, సురేంద్రబాబు రంగమ్మ, వై టి సి రమేష్, పట్టణ కమిటీ సభ్యులు రాము నాయక్, ఓబులేసు, అబ్దుల్లా, షాష, షేక్ బాషా, జి ఎన్ మోహన్, ఖాదర్, కిష్టప్ప, డేనియల్, జాషువా, ఈరన్న, మేస్త్రి ఓబులేసు, రవి, మల్లీ, రాజేష్, దౌలా, మక్బుల్, మహిళ సంగం నాయకురాలు సుగుణ, జయమ్మ, సరస్వతి, అమ్రత, ప్రభావతి పలు ప్రాంతాల కాలనీ ప్రజలు పాల్గొనడం జరిగింది.

# సర్వ ఏకాదశి సందర్భంగా శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన హిందూ సంఘాలు





**గుంతకల్లు మార్చి 25 (ప్రజా జ్యోతి):** పట్టణంలోని కసాపురం రోడ్డులోని భవాని గుడి వెనక భాగాన కాలనీలో నాగ మునీశ్వరుడి ఆలయంలో మంగళవారం సర్వ ఏకాదశి సందర్భంగా పాల్గొన మాసం చైత్రమాసం ప్రారంభం సందర్భంగా ఆలయంలోని నాగ మునిఈశ్వరుడికి ,విఘ్నేశ్వరుడికి, సుబ్రహ్మణ్యస్వామికి, నందీశ్వరుడికి బజరంగ్ దల్ ,విశ్వ హిందూ పరిషత్ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా ఆలయం వద్ద ఉన్న రావి చెట్టు వద్ద పూజలు చేసి ప్రాంగణం కళకళలాడింది.ఈ పూజా కార్యక్రమంలో పెద్ద ఎత్తున హిందూ భక్తులు కాలనీవాసులు అనంతరం శివనామస్మరణతో ఆలయం వద్ద మార్మోగింది.ఈ సందర్భంగా బజరంగ్ దల్ రాష్ట్ర కో కన్సినర్ కసాపురం రవి మాట్లాడుతూ..కసాపురం రోడ్ లోని నాగ మునీశ్వరుడి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ఈ ఆలయం ప్రతిరోజు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు వడ్డే రమేష్,పట్టణ కార్యదర్శి రాజు, బిజెపి నాయకులు కేశవ, విశ్వ హిందూ పరిషత్ మండల కార్యదర్శి బిందు,దుర్గా వాహిని సంయోజక్ ప్రమీల ,
దుర్గా వాహిని సహా సంయోజక్ అశ్విని,విశ్వహిందూ పరిషత్ సభ్యులు కడిమెల్ల మునిరాజు,వెంకట రాఘవేంద్ర ,సుందర్,ఆలయ నిర్వాహకులు బోయ వెంకటరాముడు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులు సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తా

వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు




**ప్రత్తిపాడు ప్రజా జ్యోతి రిపోర్టర్ వీరబాబు** ప్రత్తిపాడు మండలం గిరిజన గ్రామం పాండవుల పాలెం కి చెందిన గిరిజన వాసులకు వైసిపి కోఆర్డినేటర్ గిరిబాబు ను కలిశారు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ గిరిజన వాసులకు అన్ని విధముగా అండగా ఉంటానని గిరిజన వాసులకు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ముద్రగడ గిరిబాబు అన్నారు

## ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సుందరయ్య కాలనీలో పర్యటించిన సిపిఎం బృందం




**బద్వేల్ మార్చి 25 (ప్రజా జ్యోతి న్యూస్)** స్థానిక పట్టణంలో మంగళవారం నాడు భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ (సిపిఎం) బద్వేల్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజా చైతన్య యాత్ర సుందరయ్య కాలనీ నందు ప్రారంభించి పర్యటించడం జరిగింది. ఈ యాత్రలో సుందరయ్య కాలనీలో ఉన్నటువంటి ప్రజలు యాత్ర నాయకత్వం దృష్టికి అనేక సమస్యలను తీసుకురావడం జరిగిందని సుందరయ్య కాలనీ ఎగువ ప్రాంతం నుండి ప్రవహిస్తున్న మురుగునీటిని శాశ్వత ప్రాతిపదికన మురుగు కాలువల నిర్మాణం చేపట్టి ఊరి వెలుపలకు తరలించడంలో సంబంధిత అధికారులు విఫలమయ్యారని తెలియజేశారు. ఈ సందర్భంగా సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు ముడియం చిన్ని మాట్లాడుతూ సుందరయ్య కాలనీ ఏర్పడి దాదాపు 25 సంవత్సరాలు పైబడి అవుతున్న ఇప్పటికీ మౌలిక సదుపాయాలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని డ్రైనేజ్ కాలువలు లేక డ్రైనేజ్ మొత్తం రోడ్ల వెంబడి ప్రవహించడంతో ప్రజలు ఆ డ్రైనేజ్ వాటర్ లో నడవడం వలన అనేక రకాల చర్మ వ్యాధుల బారిన పడుతున్నారని, రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరగడం వలన ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, చాలా ఇళ్లకు నివాసం ఉంటున్న వారికి ఇండ్ల పట్టాలు లేవని, డోర్ నెంబర్లు లేవని, ఎన్ఓసితో మీటర్లు బిగించుకోవాలంటే అనేక ఇబ్బందులు పడుతున్నారని, చాలా ప్రాంతాలలో బ్రహ్మ సాగర్ పైప్ లైన్ లేదని అదేవిధంగా అనేక సమస్యలు ప్రజా చైతన్య యాత్ర బృందం దృష్టికి తీసుకురావడం జరిగిందన్నారు. ఈ విషయాన్ని గతంలో ఉన్నతాధికారులకు తెలియజేసినప్పటికీ వారు పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. ఇప్పటికైనా అధికారులు సుందరయ్య కాలనీలో పర్యటించి కాలనీలో ని సమస్యలు లేకుండా చూడాలని డ్రైనేజ్ కాలువలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. లేని పక్షంలో పేద ప్రజలతో కలసి పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు కె.నాగబాబు, పి.మోక్షమ్మ, జి. అనంతమ్మ, పి.రాయప్ప, శాఖా కార్యదర్శులు బాలమ్మ, మస్తాన్ బీ, మూరా ప్రసాద్, సభ్యులు కె. రామలక్ష్మమ్మ. గంప సుబ్బరాయుడు, వెంకటరత్నమ్మ, రోజమ్మ, సుబ్బమ్మ, రత్తమ్మ తదితర సిపిఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్సిపి నాయకులు ఎన్డీఏ కూటమి నాయకులపై అసత్య ప్రచారాలు చేస్తే ఉపేక్షించేది లేదు



**ప్రజాజ్యోతి న్యూస్ /జీలుగుమిల్లి** "నియోజకవర్గాన్ని సంక్షేమ అభివృద్ధి మార్గాలలో తీసుకు వెళుతున్న ఎమ్మెల్యే చిర్రి బాలరాజు. అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదని కూటమి నాయకులు స్థానిక మండల రెవెన్యూ అధికారి కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు.గత 5 రోజుల క్రితం జీలుగుమిల్లి మండల కేంద్రంలో తాటియకుల గూడెం గ్రామంలో జరిగిన గంధం బోస్ అనే వ్యక్తి హత్య కి కూటమి నేతల పై వైసిపి శ్రేణులు చేసిన ఆరోపణలు ఖండించిన కూటమి నాయకులు.శాసన చట్టసభలలో పోలవరం నియోజకవర్గం సమస్యలపై గొంతెత్తుతూ తనదైన శైలిలో నియోజకవర్గాన్ని సంక్షేమం అభివృద్ధి మార్గాలలో తీసుకువెళ్తూ జన ఆదరణ పొందుతూ ఉన్నటువంటి డైనమిక్ లీడర్ పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మీద వైఎస్ఆర్సిపి నాయకులు వారి సాక్షి మీడియా చేస్తున్నటువంటి అసత్య ప్రచారాలను ఖండిస్తూ నేడు కూటమినేతలు సమావేశం అయ్యి ఖండించారు. కూటమి నేతలపై చేసిన ఆరోపణలు చేసిన వారి పై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు . ఈ కార్యక్రమంలో ఏడు మండలాల జనసేన పార్టీ ప్రెసిడెంట్లు, బిజెపి నాయకులు, టిడిపి మండల ప్రెసిడెంట్, ఎన్డీఏ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా పోలీసులకు ఉగాది పురస్కారాలు

# ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం

**అనకాపల్లి, మార్చి 25 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** ఉగాది పండుగను పురస్కరించుకుని, అనకాపల్లి జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వర్తిస్తున్న ప్రతిభావంతమైన పోలీసు అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం పోలీసు సేవా పతకాలను ప్రకటించింది. ఈ సందర్భంగా, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా పతకాలు అందుకున్న పోలీసు అధికారులను అభినందిస్తూ, వారి సేవలను ప్రశంసించారు.జిల్లా పోలీసు శాఖలోని వివిధ విభాగాల్లో విశేష సేవలందించిన 8 మంది పోలీసు అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవా పతకం మరియు సేవా పతకాలు ప్రకటించింది. జిల్లా పోలీసు విభాగం పంపిన ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం ఆయా అధికారులకు పురస్కారాలను అందజేసింది. ఉత్తమ సేవా పతకం అందుకున్న పోలీసు అధికారి బి.శ్రీనివాసరావు ఏఎస్ఐ, అనకాపల్లి స్పెషల్ బ్రాంచ్, సేవా పతకాలు అందుకున్న పోలీసు అధికారులు.. రిజర్వ్ ఇన్స్పెక్టర్ ఎల్.మన్మథరావు, ఏ ఆర్ ఎస్ ఐ కె.భోజరాజు, అనకాపల్లి సిసిఎస్ ఏఎస్ఐ కె.జె.ఐ.జి.ప్రదీప్ కుమార్, అనకాపల్లి టౌన్ పోలీస్ స్టేషన్ హెచ్ సి పి.సత్యనారాయణ, ఏ ఆర్ హెడ్ కానిస్టేబుల్, వై.ఆనందరావు, ఏఆర్ కానిస్టేబుల్ ఈ.తవిటి నాయుడు, నర్సీపట్నం రూరల్ కానిస్టేబుల్ ఆర్.రమణ లు ఈ పురస్కారాలకు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ గౌరవప్రదమైన పురస్కారాలు అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ ప్రతిష్ఠను రాష్ట్ర స్థాయిలో మరింత ఉన్నతంగా నిలిపాయి అన్నారు. పురస్కారాలు అందుకున్న ప్రతి ఒక్కరూ ఇదే విధమైన జోష్‌తో పని చేసి,



ప్రజలకు మెరుగైన సేవలను అందించాలి అని పేర్కొన్నారు.పోలీసు శాఖలో నిరంతరం నిబద్ధతతో పని చేస్తున్న ప్రతి పోలీసు అధికారికి ఇది ప్రేరణగా మారుతుందని, భవిష్యత్తులో మరింత మంది ఉత్తమ సేవలందించి పురస్కారాలు అందుకోవాలని ఎస్పీ ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

## ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు

# పరిశీలించిన ఎమ్మెల్యేలు.





**తాడేపల్లిగూడెం మార్చి 25 ప్రజాజ్యోతి న్యూస్ :** తాడేపల్లిగూడెం 1వ వార్డులో ఇండోర్ స్టేడియం నిర్మాణం పనులు పరిశీలించిన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం శాసనసభ్యులు బొలిశెట్టి శ్రీనివాస్, గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు.ఈ సందర్భంగా %ూూ% ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ?1కోటీ 35 లక్షల వ్యయంతో దాతల సహకారంతో ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు మొదలుపెట్టడం జరిగిందని...మనం నిజాయితీతో పనులు చేసేటప్పుడు దాతలు సహకరిస్తారని.. అందుకు ఇదే గొప్ప నిదర్శనమని, దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకరిస్తున్నందుకు చాలా సంతోషంగా ఉందని బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. టెన్నిస్ కోర్టు ,షటిల్ కోర్టు , స్విమ్మింగ్ పూల్ ఇవన్నీ మున్సిపాలిటీకి సంబంధించిన స్థలాల్లోనే ఇవి ఏర్పాటు చేసుకోవడం, వీటిని నిర్మించుకుని ప్రజలకు అంకితం చేయాలనే ఉద్దేశంతో పనులు పూర్తి చేసి ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ డెవలప్మెంట్లో భాగంగా ప్రజలు, దాతల సహకారంతో వీటన్నిటిని రెండు, మూడు నెలల్లో అందుబాటులోకి తీసుకువస్తాము. ఇందులో జాతీయ స్థాయి వరకు గేమ్స్ అడే విధంగా వీటిని తీర్చిదిద్దుతున్నాము.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ..

చుట్టుపక్క పరిసర ప్రాంతాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న పట్టణం తాడేపల్లిగూడెం. ఇండోర్ స్టేడియం నిర్మించాలన్నది తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ కళ దుష్ట శక్తులు, తీవ్రవాదులు రావడం వల్ల అభివృద్ధి ఆగిపోయింది. చుట్టుపక్క పరిసర ప్రాంతాల్లో యువతీ, యువకుల్లో క్రీడా స్ఫూర్తిని పెంచడానికి ఇండోర్ స్టేడియం నిర్మాణం శరవేగంగా జరుగుతుంది.

# లింగపాలెంలో కోకో రైతులు ధర్నా.

**లింగపాలెం, మార్చి 25 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** కోకో రైతుల వద్ద ఉన్న కోకో గింజలు వెంటనే కొనుగోలు చేసి కోకో రైతులను ఆదుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం లింగపాలెం మండల తహసీల్దార్ కార్యాలయం ముందు కోకో రైతులు ధర్నా నిర్వహించారు. కోకో రైతులను ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎస్. గోపాలకృష్ణ, రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ మాట్లాడారు. కోకో గింజలను కంపెనీలు అతి తక్కువ ధరకు కొనుగోలు చేయడం వలన కోకో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలపు పంట (అన్ సీజన్ ) కోకో గింజలను కంపెనీలు కొనుగోలు చేయడం లేదని రైతులు వద్ద నిల్వ ఉండిపోవడంతో ఏమి చేయాలో అర్థం కాక కోకో రైతులు దిక్కుతోచని స్థితిలో అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు ఎటువంటి నాణ్యత ప్రమాణాలు పాటించకుండా కోకో గింజలు కొనుగోలు చేసిన కంపెనీలు ప్రస్తుతం నాణ్యతా ప్రమాణాలు పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయడం అన్యాయమని విమర్శించారు. అంతర్జాతీయ మార్కెట్లో కోకో గింజలకు కిలోకు 700 రూపాయి లకు పైగా ధర ఉన్నా ఆ ధరకు కొనుగోలు చేయడం లేదన్నారు. నాణ్యతతో కూడిన సీజన్ గింజలను కూడా తగినంతగా కొనుగోలు చేయడం లేదని చెప్పారు. ఇప్పటివరకు లేని గ్రేడింగ్ విధానాన్ని కంపెనీలు తీసుకురావడం దుర్మార్గమన్నారు. రోజురోజుకీ కంపెనీలు కోకో గింజలకు ధర తగ్గించి వేయడంతో కోకో తోటలు కౌలుకు తీసుకున్న రైతులు తీవ్ర నష్టాలకు గురై అప్పులు పాలు అవ్వాల్సిన పరిస్థితి ఏర్పడిందని




ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితులలో అంతర్జాతీయ మార్కెట్ ధర ఇచ్చి అన్ సీజన్,సీజన్ కోకో గింజలను తక్షణమే కొనుగోలు చేయాలని కోరారు. కంపెనీలు తగిన ధర ఇవ్వకపోతే వ్యత్యాసపు ధరను రాష్ట్ర ప్రభుత్వం కోకో రైతులకు చెల్లించే విధంగా చర్యలు తీసుకుని కోకో రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వేసంగి సత్యనారాయణ, మోరంపూడి సుబ్రహ్మణ్యం,భాస్కరరావు, సాయిల రాంబాబు పలువురు కోకో రైతులు పాల్గొన్నారు.

## ఆస్తి పన్ను బకాయి దారులకు ఊరట

**బద్వేల్ మార్చి 25 (ప్రజా జ్యోతి న్యూస్)** స్థానిక పురపాలక సంఘంలో ఇంటి పన్ను ఖాళీ స్థలాల పన్నులు సకాలంలో అనగా మొదటి అర్థ సంవత్సరానికి జూన్ నెలాఖరు లోపు రెండవ అర్థ సంవత్సరానికి డిసెంబర్ నెలాఖరు లోపు పన్ను చెల్లించని ఎడల రెండు శాతం వడ్డీతో కలిపి చెల్లించవలసి ఉంటుందని కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పన్ను చెల్లింపు దారుల నుండి వచ్చిన విజ్ఞప్తుల మేరకు మరియు పురపాలక సంఘాలలో పేరుకుపోయిన పన్ను బకాయిల వసూలు మెరుగుపరుచుటకు ఆస్తి పన్ను ఖాళీ




స్థలాల పన్ను బకాయలను మార్చి నెలాఖరు లోపు ఒకేసారి ఏక మొత్తంలో చెల్లించిన వారికి వడ్డీ 50% రాయితీని కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఈ సదుపాయం ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే పన్ను బకాయిలు లేకుండా వడ్డీతో సహా చెల్లించిన వారికి కూడా వర్తిస్తుందన్నారు. సదరు వడ్డీలో 50% రాబోవు ఆర్థిక సంవత్సరం పన్నులకు జమవుతుందన్నారు. కావున పట్టణ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## చెత్త నుండి సంపద సృష్టిస్తాం

## పంచాయతీ కార్యదర్శి హరి ప్రసాద్.

ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి కుంటలు నిలవ లేకుండా చూసుకోవాలి.

ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుతాం. ప్రజలు సహకారం అందించాలి.

**యలమంచిలి మార్చి 25 ప్రజాజ్యోతి న్యూస్ :** చెత్త నుండి సంపద సృష్టిస్తామని కొంతేరు,చించినాడ గ్రామాల పంచాయతీ కార్యదర్శి గా విధులు నిర్వహిస్తున్నటువంటి హరి ప్రసాద్ తెలియజేశారు, మంగళవారం ఆయన ప్రత్యేకంగా ప్రజా జ్యోతి విలేఖరికి, పలు విషయాలను వివరించారు. ఈ సందర్భంగా పంచాయతీ సీనియర్ కార్యదర్శి హరిప్రసాద్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం, చించినాడ, కొంతేరు గ్రామాలలో ప్రజలకు తడి చెత్త పొడి చెత్త పంచాయతీ సిబ్బంది గ్రీన్ వెహికల్స్ ద్వారా ఇంటికి వచ్చినప్పుడు వేరుగా వేసేలా అవగాహన



ఇప్పటికే కల్పించడం, తద్వారా చెత్త నుండి సంపద సృష్టిస్తామని ప్రజలకు తెలియజేశామన్నారు,అలాగే కొంతేరు చించినాడ గ్రామాలను పూర్తిస్థాయి ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చడానికి అనేక రకాలుగా కృషి చేస్తూ దానిలో భాగంగా కూరగాయల వ్యాపారస్తులకు, కూల్ డ్రింక్స్ షాప్ యజమానులకు, మరియు కిరాణా షాపుల నిర్వాహలకు, అలాగే రెండు గ్రామాల ప్రజలకు ప్లాస్టిక్ సంచులను వాడొద్దని అలా వాడినట్లయితే పంచాయతీ పరంగా జరిమానాలు విధిస్తామని హెచ్చరికలు జారీ చేయడం జరిగిందని తెలియజేశారు, పంచాయతీ సిబ్బందికి గ్రామ ప్రజలు కూడా సహకరించి ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి ప్రజలు తమ వంతు సహాయాన్ని అందించాలని తద్వారా భావితరాల భవిష్యత్తుకు తోడ్పడాలని అన్నారు. అలాగే వచ్చే వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని రెండు గ్రామాలలో ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చెరువులను శుభ్రం చేయించి తద్వారా మంచినీటిని ప్రజలకు అందించడానికి సిద్ధంగా ఉన్నామని తెలియజేశారు, అంతేకాకుండా రెండు గ్రామాలలో ప్రత్యేక దృష్టి పెట్టి పారిశుద్ధ్యం నిర్వహణ, శానిటేషన్ ఎప్పటికప్పుడు చేస్తూ, ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి కుంటలు నిలవ లేకుండా చూచుకోవాలని అందువలన దోమలు పెరగకుండా ఉండి, డెంగ్యూ మలేరియా టైఫాయిడ్ వంటి విష జ్వరాల బారిన పడకుండా ఆరోగ్యకరమైన జీవనాన్ని సాగించడానికి వీలు కుదురుతుంది అని ప్రజలకు తెలియజేశామన్నారు.

## నేడు ప్రజా సమస్యలను నేరుగా

## తెలుసుకునేందుకు ఎమ్మెల్యే ప్రజా దర్బార్




**గుంతకల్లు మార్చి 25 (ప్రజా జ్యోతి):** ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి బుధవారం ఉదయం 10 గంటల నుండి ప్రజా దర్బార్ నిర్వహించడం జరుగుతుం దని, అందులో భాగంగానే నేడు పట్టణంలోని పరిటాల రవి కళ్యాణ మండపం నందు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు టిడిపి పట్టణ అధ్యక్షులు బండారు ఆనంద్ తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రజలకు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి బుధవారం ప్రజల సమస్యలను తెలుసుకునేం దుకే ప్రజాదర్బార్ నిర్వహించ డం జరుగుతుందని కావున ప్రజలు ఏదైనా సమస్యలు ఉంటే నేడు పట్టణంలోని పరిటాల రవి కళ్యాణమండలంలో నిర్వహించే ప్రజా దర్బార్లో నేరుగా వచ్చి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కు తమ సమస్యను తెలియజేయాలని తెలిపారు. అలాగే మధ్యాహ్నం ఒంటిగంట నుండి టిడిపి నాయకులు కార్యకర్తలతో ఎమ్మెల్యే ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని కావున ప్రతి టిడిపి కుటుంబ సభ్యులు తమకు ఏదైనా సమస్య ఉంటే నేరుగా ఎమ్మెల్యే దగ్గరే చర్చించవచ్చు నని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గుజరి మహమ్మద్ ఖాజా, ఫజులు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

## ఒమ్మంగి గ్రామంలో మురళిరాజు పర్యటన

వైస్సార్సీపీ నాయకుడు దార నూకరాజుని పరామర్శించిన మురళిరాజు

ప్రతి నిరుపేదకు అండగా నిలుస్తున్న మురళిరాజు

**ప్రత్తిపాడు మండలం ప్రజా జ్యోతి రిపోర్టర్ వీరబాబు :** ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామంలో వైస్సార్సీపీ నాయకుడు దార నూకరాజు చేతికి ఆపరేషన్ చేసి ప్లేట్లు తీయించుకోవడం జరిగింది వారిని పలకరించి ఆరోగ్యం వివరాలు అడిగి



తెలుసుకుని ఆర్థిక సాయం 10,000 రూపాయలు చెక్కు అందచేసి కష్టంలో ఉన్న ప్రతి పేదవారికి అండగా ఉంటానని భరోసా కల్పించిన ఎం.ఎం.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ %ఁ% ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు ముదునూరి మురళీకృష్ణం రాజు

ఈ కార్యక్రమంలో ముమ్మిడి వీరబాబు,మిత్తన వీరబాబు, గంట గంగబాబు , ఉలిశెట్టి బుజ్జి రామిశెట్టి దొరబాబు , గంట సత్యనారాయణ , గంట లచ్చుబాబు ,నార్లంక వెంకన్నబాబు,రామకుర్తి తమ్మారావు ,తేలేటి శేఖర్ గారు, సుంకర రాంబాబు , నాగేశ్వరరావు గారు, శివాజీ , కోలా తాతబాబు , దెందుకూరి హరిరాజు ,పోకనాటి వెంకటేశ్వరరావు జువ్వల దొరబాబు ,యాళ్ల ఏసు ,కోలా సూరిబాబు , దోమలంక బాబ్జి , మద్రి సుబ్బారావు , అంబటి గణేష్ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ఎన్నికలు సుజావుగా నిష్పక్షపాతంగా నిర్వహించాలి

**జిల్లా జాయింట్ కలెక్టర్ చిన్న రాయుడు..**

**మార్చి 27న జిల్లాలో 12 ఉప సర్పంచ్లు**

**ఒక ఎంపిపి, రెండు కో ఆప్షన్ సభ్యుల ఎన్నికలు**

**ఎన్నికల నిర్వహణా పై అధికారులతో జెసి సమావేశం..**




**రాజమహేంద్రవరం, మార్చి 25 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** తూర్పు గోదావరి జిల్లాలో 12 గ్రామాలలో ఉప సర్పంచ్ ల, బిక్కవోలు మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు , పెరవలి, రంగంపేట ల రెండు కో ఆప్షన్ సభ్యుల పరోక్ష ఎన్నికల ప్రక్రియను సజావుగా నిష్పక్షపాతంగా నిర్వహించాలని, ఆమేరకు అధికారులు బాధ్యత తో వ్యవహరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. చిన్నరాముడు స్పష్టం చేశారు.మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నికలకు సంబంధించి సమన్వయ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ చిన్న రాముడు మాట్లాడుతూ మార్చి 27వ తేదీన ఉదయం 11 గంటలకు జిల్లాలో 12 గ్రామాల కి చెందిన ఉప సర్పంచ్ ఎన్నికలు, బిక్కవోలు ఎంపిపి అధ్యక్షులు, పెరవలి మండలం కో ఆప్షన్ సభ్యుల, రంగంపేట మండలం కో ఆప్షన్ సభ్యుల ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గోకవరం మండలం మల్లేశ్వరం, కొవ్వూరు మండలం పెనకనమెట్ట, రాజానగరం మండలం పాత తుంగపాడు, గోపాలపురం మండలం కొవ్వూరుపాడు , వెంకటాయపాలెం, తాళ్లపూడి మండలం తాళ్లపూడి, అనపర్తి మండలం లక్ష్మీనరసాపురం, రంగంపేట మండలం మర్రిపూడి, కడియం మండలం మురమండ, సీతానగరం మండలం మునికూడలి, ఉండ్రాజవరం మండలం ఉండ్రాజవరం గ్రామా ల్లో ఉప సర్పంచ్ లకు ఎన్నికలు నిర్వహించబడతాయని తెలిపారు.ఎన్నికల నిర్వహించే సమయంలో ఎన్నికల అధికారులు ఏదైనా కారణంతో ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించలేని పక్షంలో తదుపరి రోజూ శెలవు సెలవు దినం అయినప్పటికీ, కానప్పటికీ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించి ఉప సర్పం చ్ ఎన్నిక నిర్వహించాలని తెలిపారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల నిలిపివేయు కారణాలను లిఖితపూర్వకంగా నమోదు చేసి ఉప సర్పంచ్ ఎన్నికను ఇతర తేదీన నిర్వహించేందు కు ఆదేశించవచ్చు, అనుమతించవచ్చు అని తెలిపారు. ఎన్నికల నిర్వహించే సమయంలో పోలీసు బందోబస్తు పకడ్బందీగా వ్యవహరించాలని తెలిపారు. మార్చి 27 ఉదయం 11 గంటలకి ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాలలో ఉపసర్పంచ్ ఎన్నికల నియమావళి 2006 ప్రకారం ఎన్నికల నిర్వహించాల్సిందిగా జాయింట్ కలెక్టర్ తెలిపారు. ఏదైనా సభ్యుడు ఉప సర్పంచ్ ఎన్నిక కోసం ఒక్క సభ్యుని మాత్రమే ప్రతిపాదించాలని తెలిపారు. మరొక సభ్యుడు మద్దతు ఇవ్వాలన్నారు. ప్రతిపాదించ బడిన, మద్దతు పొందిన అందరి అభ్యర్థుల పేర్లను సమావేశా అధ్యక్షుడు చదివి వినిపించాలన్నారు. పోటీ చేస్తున్న అభ్యర్థులకు నామినేషన్ ఉపసంహరణకు 30 నిమిషాల సమయం ఇవ్వబడుతుంది అన్నారు. ఒకే ఒక అభ్యర్థి చెల్లుబాటు అయ్యే విధంగా నామినేట్ అయితే వారిని ఎన్నికైనట్లుగా ప్రకటించాలన్నారు. సమావేశ అధ్యక్షుడు ఉప సర్పంచ్ అభ్యర్థి పొందిన ఓట్ల సంఖ్యను లెక్కించి, ప్రతి అభ్యర్థి వచ్చిన ఓట్లను ప్రకటించాలన్నారు. ఎక్కువ ఓట్లు పడిన అభ్యర్థులు ఎన్నికైనట్లుగా ప్రకటించాలన్నారు.మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, కో ఆప్షన్ సభ్యుల ఎన్నికల కోసం 27వ తేదీ ఉదయం 10.00 గంటలకు ముందు నామినేషన్ల స్వీకరణ పూర్తి చెయ్యాలి. అనంతరం నామినేషన్ల పరిశీలన ఉదయం 10.00 నుంచి మధ్యాహ్నం 12.00 గంటల లోగా పూర్తి చెయ్యాలి. చెల్లుబాటు అయ్యే నామినేట్ అభ్యర్థుల జాబితా ప్రచురణ మధ్యాహ్నం 12.00 గంటలకు ప్రకటించాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థిత్వం ఉపసంహరణ సమయం మధ్యాహ్నం 1.00 గంట వరకూ ఉంటుందన్నారు. గత సమావేశాలలో ప్రమాణం చేయని సభ్యులు ఎవరైనా ఉంటే, సంబంధిత నిబంధనలకు అనుగుణంగా ప్రమాణం చేయిస్తారన్నారు. పరోక్ష విధానంలో మధ్యాహ్నం 1.00 గంట నుంచి ఎన్నికలను నిర్వహించడం జరుగుతుంది. ఎన్నికలు పూర్తయిన అనంతరం ఫలితాల ప్రచురణ చెయ్యాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిఆర్ఓ టి సీతారామమూర్తి, అదనపు ఎస్పీ ఏ వి సుబ్బరాజు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు కాకినాడ జెడ్పీ డిప్యూటి సీఈవో ఎస్. రామ్ గోపాల్, ఏలూరు జెడ్పీ ఇంఛార్జి సీఈవో కే. భీమేశ్వర్ , ఎడి మార్కెటింగ్ ఎమ్ సునీల్ వినయ్ లతో పాటు జిల్లా గ్రామ పంచాయతీ అధికారి వి శాంతామణి, డివిజనల్ పంచాయతీ అధికారులు ఎం నాగలత, వై. అమ్మాజీ, ఎస్. ఈ, ఆర్డబ్ల్యూఎస్ బీవీ గిరి, డిఎస్పీ లు భవ్య కిశోర్, వై. శ్రీకాంత్, బి. విద్యా, ఎంపిడివోలు , ఈవో పీఆర్డి లు, తదితరులు పాల్గొన్నారు

## డ్రోన్ సహాయంతో తప్పిపోయిన 7 ఏళ్ల చిన్నారి ఆచూకీ కనుగొన్న భీమవరం వన్ టౌన్ పోలీసులు.



**భీమవరం మార్చి 25 ప్రజాజ్యోతి న్యూస్ :** పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం చిన్న గొల్లపాలెం చెందిన బొర్రా వెంకట నారాయణమ్మ తన మనవడు, మనవరాలు ఆధార్ కార్డు అప్డేట్ కోసం భీమవరం హెడ్ పోస్ట్ ఆఫీస్‌కు వెళ్లారు. వాటర్ బాటిల్ కోసం బయటకు వెళ్లి తిరిగి వచ్చేసరికి తన 7 ఏళ్ల మనవరాలు దివ్య కనిపించకపోవడంతో వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో వెంకట నారాయణమ్మ ఫిర్యాదు చేశారు.వన్ టౌన్ సీఐ నాగరాజు,ఎస్సై కిరణ్ కుమార్ తక్షణమే స్పందించి, తమ సిబ్బందితో కలిసి సమీప ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో, డ్రోన్ ద్వారా విస్తృతంగా తనిఖీలు నిర్వహించగా, శ్యాం సిల్క్స్ సమీపంలో చిన్నారిని గుర్తించి, ఆమెను సురక్షితంగా వృద్ధురాలికి అప్పగించారు. తన మనవరాలిని క్షేమంగా తిరిగి అప్పజెప్పిన భీమవరం వన్ టౌన్ పోలీసు అధికారులకు మరియు సిబ్బందికి వెంకట నారాయణమ్మ కృతజ్ఞతలు తెలియజేశారు.కాగా అధునాతన సాంకేతిక పరికరాలతో వేగంగా పనిచేస్తున్న జిల్లా పోలీసు శాఖ పనితీరు పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తంచేశారు.

## ప్రత్యేక అలంకరణలో శ్రీ మద్ది అంజన్న దర్శనం..

**మంగళవారం కావడంతోదేవస్థానానికి పోటెత్తిన భక్తులు..**

**స్వామివారి ఒకరోజు ఆదాయం లక్ష 46 వేలు..**



**జంగారెడ్డిగూడెం, మార్చి 25 (ప్రజా జ్యోతి ప్రతినిధి) :** జంగారెడ్డిగూడెం మండలం గురవాయిగూడెం గ్రామంలో తెల్ల మద్ది చెట్టు తొర్రలో స్వయంభువులై వెలిసిన శ్రీ మద్ది ఆంజనేయస్వామి వారి ఆలయంలో మంగళవారం సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకునే మొక్కులు చెల్లించుకున్నారు. స్వామి వారి ప్రీతికరమైన రోజు కావడంతో దేవస్థానం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి కాకుండా సుదూర ప్రాంతాల నుంచి సైతం భక్తులు తరలివచ్చారు. తెల్లవారుఝామున ఆలయ అర్చకులు స్వామివారికి ప్రభాతసేవ, నిత్యార్చన పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. స్వామివారికి ప్రీతికమైన మంగళవారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు బారులుదీరి స్వామివారిని దర్శించుకొన్నారు. భక్తుల హనుమద్ నామస్మరణతో ఆలయం మార్మోగింది. భక్తులు శ్రీస్వామి వారి ఆలయం చుట్టూ 108 ప్రదక్షణలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఈ మద్ది స్వామిని తమ కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా భక్తులు కొలుస్తారు. మద్యాహ్నం వరకు దేవస్థానానికి వివిధ సేవల రూపేణ 1,46,087 రూపాయి లు లభించింది. సుమారు 1500 మంది భక్తులకు స్వామివారి నిత్యాన్నదాన సత్రం లో అన్నప్రసాద వితరణ చేశారు. దేవస్థానం కార్యనిర్వాహనాధికారిణి ఆర్.వి. చందన పూజా కార్యక్రమాలు, భక్తుల ఏర్పాట్లు పర్యవేక్షించారు. దేవస్థాన పర్యవేక్షకులు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు తగిన ఏర్పాట్లు చేశారు.

# ఆర్డీవో కార్యాలయం ఎదుట కోకో రైతుల ధర్నా






**కంపెనీలు కోకో గింజలు కొనుగోలు చేయకపోవడం అన్యాయం..**

**సిండికేట్ గా మారి కోకో రైతులను నిలువునా మోసగిస్తున్న కంపెనీలు..**

**రైతుల వద్ద ఉన్న కోకో గింజలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలి..**

**ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్ డిమాండ్..**

**కొవ్వూరు, మార్చి 25 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** కోకో గింజల కొనుగోళ్ళను కంపెనీలు నిలిపివేయడంతో వలన కోకో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కొవ్వూరు ఆర్డీవో కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. కోకో కాయలు, కోకో గింజలతో నిరసన వ్యక్తం చేశారు. రైతులు వద్ద ఉన్న కోకో గింజలను ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆదుకోవాలంటూ కోకో రైతులు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడారు గత నెల రోజులుగా కోకో రైతులు కోకో గింజలు కొనుగోలు,ధర సమస్యలపై రోడ్లెక్కి ఆందోళన చేస్తున్నా పట్టించుకోకపోవడం అన్యాయమని విమర్శించారు .ఈ సమస్యలపై అధికారులు, ప్రభుత్వం కంపెనీలతో మాట్లాడినా కోకో గింజలు కొనుగోలు కంపెనీలు తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు.అన్ సీజన్ కోకో గింజలు కొనుగోలు చేయకపోవడం తగదన్నారు. కోకో తోటలు కౌలుకు తీసుకున్న కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో గింజలకు ధర ఇవ్వడం లేదన్నారు. నష్టపోయి అప్పులు పాలవుతున్న కోకో రైతులకు ఆత్మహత్యలే శరణ్యం అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తగిన పరిష్కారం చూపకుండా మరింత ఆలస్యం చేస్తే కోకో రైతులు మరింతగా నష్టపోతారని చెప్పారు. కంపెనీలు రైతులను భయపెట్టి రోజురోజుకీ ధర తగ్గించి వేస్తున్నాయన్నారు. కిలో కోకో గింజలకు గత నెల రోజుల క్రితం 650 ఉంటే ఆధరను 550,ఆపై 500 తగ్గించి వేస్తూ రైతులను ఇబ్బందులు గురి చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.అన్ సీజన్ గింజలను 200 నుండి 240 రూపాయలకు కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. కోకో గింజలను పచ్చళ్ళు పట్టుకోండి అంటూ కొన్ని కంపెనీల ప్రతినిధులు హేళన చేస్తూ రైతులను అవమానించడం దుర్మార్గమన్నారు. రైతులు ఎంతో కష్టపడి కోకో గింజలను ఉత్పత్తి చేస్తున్నారని చెప్పారు.కిలో కోకో గింజలకు 900 ధర కల్పించకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ఈ పరిస్థితులలో ప్రభుత్వమే రంగంలోకి దిగి కోకో రైతుల వద్ద ఉన్న కోకో గింజలను వెంటనే కొనుగోలు చేయాలని, ధరల స్థిరీకరణ నిధి పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. విదేశీ కోకో గింజలు దిగుమతులు నిలుపుదల చేయాలన్నారు. కోకో గింజలకు కనీస మద్దతు ధర ప్రకటించాలన్నారు.ఉద్యాన శాఖ నుండి రావాల్సిన సబ్సిడీ బకాయిలు అందించాలన్నారు.

ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం నాయకులు ఉప్పల కాశీ, నాయుడు లక్ష్మణరావు మాట్లాడుతూ కోకో రైతులను ప్రభుత్వం విధాల ఆదుకోవాలని కోరారు.

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సీనియర్ నాయకులు ఉండవల్లి కృష్ణారావు, జిల్లా కన్వీనర్ గారపాటి వెంకట సుబ్బారావు, జిల్లా నాయకులు కంకటాల బుద్ధుడు, సుభాష్ చంద్రబోస్, సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం. సుందర బాబు మాట్లాడుతూ కోకో రైతుల ధర్నాకు సంఘీభావం ప్రకటించారు.

**ఆర్డీవోకు కోకో రైతులు వినతిపత్రం..**

ధర్నా అనంతరం కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత కు కోకో రైతులు తమ డిమాండ్స్ తో కూడిన వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కోకో రైతుల సంఘం నాయకులు ఆలపాటి శ్రీధర్, సంగీత నాగరాజు, ఆకుల మోహనరావు, బిక్కిన కృష్ణ, జి.శ్రీమన్నారాయణ, ఎం వి వి సత్యనారాయణ, తదితరులు మాట్లాడారు. కొవ్వూరు, చాగల్లు, దేవరపల్లి,నిడదవోలు, గోపాలపురం, నల్లజర్ల మండలాల నుండి వివిధ మండలాల వచ్చిన కోకో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళలకు అండగా శక్తి యాప్




**బాపట్ల జిల్లా మార్చ్ 25 ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లాలో ఏర్పాటు చేసిన శక్తి బృందాలు శక్తి యాప్ ఆవశ్యకత, ప్రాధాన్యత గురించి పాఠశాల, కళాశాల విద్యార్థులకు, మహిళలకు మంగళవారం విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాయి. చీరాల, రేపల్లె, బాపట్ల సబ్ డివిజన్ ల పరిధిలోని పాఠశాల, కళాశాలలు, ప్రధాన కూడళ్లు, రైల్వే స్టేషన్, బస్టాండ్ ఇతర ముఖ్యమైన ప్రదేశాలను శక్తి బృందాలు సందర్శించి రాష్ట్ర ప్రభుత్వం మహిళలు భద్రత రక్షణ కొరకు అందుబాటులోకి తీసుకువచ్చిన శక్తి యాప్ యొక్క ఆవశ్యకత, శక్తి యాప్ ద్వారా అందించే సేవలు తదితర విషయాల గురించి విస్తృతస్థాయిలో అవగాహన కల్పించారు. శక్తి యాప్ మగువలకు అండగా రక్షణగా ఉంటూ ఆపద సమయంలో ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ప్రతి మహిళ, విద్యార్థులు వారి యొక్క మొబైల్ ఫోన్ లలో శక్తీ యాప్ ను డౌన్లోడ్ చేసుకుని వ్యక్తిగత వివరాలు ఫోన్ నెంబర్లతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలిసిందిగా సూచించారు. ఆపద సమయంలో ఎస్ ఓ ఎస్ బటన్ ప్రెస్ చేస్తే రక్షణ కల్పించేందుకు పది నిమిషాల్లో మీ చెంతకు సంబంధిత పోలీస్ అధికారులు చేరుకొని మీకు రక్షణ కల్పిస్తూ సమస్యను పరిష్కరించే చర్యలు చేపడతారని తెలిపారు. మహిళలకు అవసరమైన విస్తృత సమాచారం యాప్ లో పొందుపరచబడి వుందని తెలిపారు.

## సీఎం సహాయనిధి పేదలకు అభయహస్తం



**బాపట్ల జిల్లా మార్చ్ 25 ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** బాపట్ల నియోజకవర్గం పిట్టలవానిపాలెం మండలం వ్యాప్తంగా అర్హులైన 5 మంది లబ్ధిదారులకు వైద్య ఖర్చుల సహాయార్థం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంక్షేమ నిది సీఎం రిలీఫ్ ఫండ్ నుండి 5 లక్షల 68,497 రూపాయలు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం పిట్టలవానిపాలెం మండల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో లబ్ధిదారులకు బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు అందజేశారు పిట్టలవానిపాలెం మండలం చందోలు గ్రామానికి చెందిన మహమ్మద్ ముజాహిద్ బేగం కి రూ.3,00,000 పిట్టలవానిపాలెం మండలం భవనం వారి పాలెం గ్రామానికి చెందిన ఇంటూరి నాగలక్ష్మి కి రూ.1,81,877 పిట్టలవానిపాలెం మండలం కొత్తపాలెం గ్రామానికి చెందిన అక్కల సీతామహాలక్ష్మి గారికి రూ.51,310 పిట్టలవానిపాలెం మండలం గోకరాజు నల్లిపోయిన వారి పాలెం గ్రామానికి చెందిన కేసన వెంకటేశ్వర్లు కి రూ.21,500 పిట్టలవాని పాలెం మండలం అల్లూరు గ్రామానికి చెందిన ముసలారెడ్డికి రూ.15000 ఈ సందర్భంగా బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు మాట్లాడుతూ గత 5 ఏళ్లలో గత ప్రభుత్వం ఆరోగ్య శ్రీ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసింది.సకాలంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్వోసీలు అందించకుండా.పేదల ప్రాణాలతో చెలగాటం ఆడింది. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఓవైపు ప్రభుత్వ వైద్య వ్యవస్థను బలోపేతం చేస్తూనే, వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేద కుటుంబాలకు వైద్యఖర్చులు భారం కాకుండా సకాలంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్వోసీలు అందజేస్తూ వారి ఆరోగ్యానికి బాసటగా నిలుస్తోంది. ఇది పేదల ప్రభుత్వం.వారి ఆరోగ్యాలకు భరోసానిచ్చే మనసున్న ప్రభుత్వం అని బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు తెలియజేశారు ఈ కార్యక్రమంలో సీఎం సహాయ నిధి లబ్ధిదారులు కోటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు

## ముఖ్యమంత్రి సమీక్షా సమావేశంలో బాపట్ల జిల్లా ఎస్పీ మరియు జిల్లా కలెక్టర్



**బాపట్ల జిల్లా మార్చి 25 ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్** అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో శాంతి భద్రతల పై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్, జిల్లా కలెక్టరు జె. వెంకట మురళి ఐఏఎస్ లు పాల్గొన్నారు.

# పరీక్షా విధానంపై పూర్తిగా అవగాహన తెచ్చుకో ప్రిపరేషన్ ప్రారంభించాలి

**సివిల్ సర్వీసెస్ పై అవగాహన సదస్సులో**
**జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి**



**సిద్దిపేట** పట్టుదల స్పష్టమైన లక్ష్యం నిర్దిష్టమైన ప్రణాళికతో కృషి చేస్తే సివిల్ సర్వీసెస్ పరీక్షలు సులభంగా పాస్ కావచ్చు జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి పేర్కొన్నారు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిద్దిపేట లోని తెలంగాణ స్కిల్ మరియు నాలెడ్జ్ సెంటర్ మరియు కెరీర్ అండ్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ పై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి ముఖ్య అతిధిగా పాల్గొని సివిల్ సర్వీస్ ప్రిలిమినరి పరీక్ష, మెయిన్స్ పరీక్షలలో ఉండే పేపర్లు మార్కుల విధానము, ఇంటర్వ్యూ కు ఎలా సిద్ధం అవ్వాలి, రిఫరెన్స్ పుస్తకాలుగా ఏమీ ఉపయోగపడతాయి, నోట్స్ తయారు చేసుకునే విధానం గురించి సుమారు రెండు గంటలపాటు సమగ్రంగా వివరించారు. పట్టుదల, స్పష్టమైన లక్ష్యం, నిర్దిష్టమైన ప్రణాళికతో కృషి చేస్తే సివిల్ సర్వీసెస్ పరీక్షలు సులభంగా పాస్ కావచ్చు అని అన్నారు. డిగ్రీ తర్వాత విద్యార్థులకు ఎలాంటి కెరీర్ ఎంచుకోవాలో కొంత గంధగోళంగా ఉంటదని ఇప్పుడే స్పష్టమైన ఆలోచనతో కెరీర్ ప్లాన్ చేసుకోవాలన్నారు. యూపిఎస్సి సివిల్ సర్వీస్ పరీక్షలకు కు సిద్ధం అవలేకునేవారు. ప్రిలిమ్స్, మెయిన్స్ మరియు ఇంటర్వ్యూ 3 స్టేజ్ లకు ప్రిపేర్ కావాలన్నారు. పరిక్షా విధానం పై పూర్తిగా అవగాహన తెచ్చుకో ప్రిపరేషన్ ప్రారంభించాలన్నారు. వీలైతే కోచింగ్ తీసుకోవడం లేకపోతె సొంతగా ప్రిపేర్ కావాలన్నారు. బట్టీ పద్దతిలో కాకుండా విషయ పరిజ్ఞానం పెంచుకొని దానిని పరీక్షలలో ఎలా రాయాలో ప్రాక్టీస్ చేయాలన్నారు. సబ్జెక్ట్ పరిజ్ఞానం, భాష పైన పట్టు తెచ్చుకుంటే తెలుగులో నైన మెయిన్స్ మరియు ఇంటర్వ్యూ లో రానించవచ్చని అన్నారు. ప్రతీ రోజు వార్త పత్రికలు చదువాలని, సోషల్ మీడియా కు దూరంగా ఉండాలని, తప్పులు లేకుండా అక్షరాలను స్పష్టంగా రాయడం ప్రాక్టీస్ చెయ్యాలని, ఇప్పటికే విజయం సాధించిన వారి సక్సెస్ స్టోరీస్ చదువాలని, ప్రామాణిక పుస్తకాలను చదువాలని అన్నారు. స్వయంగా తాను సివిల్స్ పరీక్షకు ఎలా ప్రిపేరై మొదటిసారే ఎలా విజయం సాధించింది విద్యార్థులను ఆకట్టుకునేలా వివరించి వారిలో స్ఫూర్తిని నింపారు. అలాగే డిగ్రీ కాలేజ్ విద్యార్థుల కొరకు సివిల్ సర్వీస్ ప్రిపేర్ అవడానికి అవుసరమైన బుక్స్ ను అందిస్తానని తెలిపారు. అనంతరం విద్యార్థులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. డిగ్రీ విద్యార్థుల కోసం అమూల్యమైన సమయాన్ని కేటాయించి సివిల్ సర్వీసెస్ పై అవగాహన కల్పించినందుకు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి సునీత మరియు అధ్యాపకులు జిల్లా కలెక్టర్ ను శాలువాతో సన్మానించారు.

ఈ కార్యక్రమంలో కెరీర్ అండ్ గైడెన్స్ సెల్ మరియు టీ.ఎస్.కే.సి కోఆర్డినేటర్ డాక్టర్ జె. ఉమామహేశ్వరి , కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ పి.అయోధ్య రెడ్డి, డాక్టర్ గోపాల సుదర్శనం, డాక్టర్ సి.హెచ్ మధుసూదన్, పరిపాలన అధికారి సులేమాన్, పిట్ల దాసు, డా.లీలావతి, మహేష్ తో పాటు అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# గులాబీ కాదని చెయ్యి అందుకుంటే... కడియానికి కలిసి రాని కాలం



**వరంగల్ :** రామేశ్వరం వెళ్ళినా.. శనీశ్వరం తప్పడం లేదనన్నటు తయారైందంట ఆ సీనియర్ ఎమ్మెల్యే పరిస్థితి. గులాబి పార్టీలో వర్గ పోరు తట్టుకోలేక హస్తం పార్టీలోకి మారితే.. ఇప్పుడు ఇక్కడా అదే వర్గపోరుతో తలపట్టుకోవాల్సి వస్తుందంట. ఉపముఖ్యమంతి సహా పలు పదవులు అనుభవించిన ఆ నాయకుడు ఇంటిపోరు తట్టకోలేక సతమతమవుతున్నారంట. ఇప్పుడు తనపై అధిష్టానానికి ఫిర్యాదు చేయడానికి ప్రత్యర్థులు సిద్ధమవుతుండటంతో టెన్షన్ పడిపోతున్నారంట. ఉమ్మడి వరంగల్ జిల్లా స్టేషన్ ఘన్పూర్ నియోజకవర్గ రాజకీయాలు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారుతున్నాయి. తెలంగాణ రాష్ట్రానికి ఉపముఖ్యమంత్రులుగా పనిచేసిన ఇద్దరు నేతలు అక్కడివారే. తాటికొండ రాజయ్య, కడియం శ్రీహరి ఇద్దరూ నిన్నటి వరకు గులాబీ పార్టీలో ఉన్నవారే. రాజయ్యకు ఉపముఖ్యమంత్రి పదవి తీసేసి కడియం శ్రీహరికి కట్టబెట్టినప్పటి నుంచి ఇద్దరి మధ్య ఉన్న పోరు తారాస్థాయికి చేరుకుంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో రాజయ్యను కాదని కడియం శ్రీహరికి కేసీఆర్ టికెట్ ఇవ్వడంతో రాజయ్య వర్గం తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తింది.

రాష్ట్రంలో మారిన రాజకీయ పరిస్థితులు, గులాబీ పార్టీ అధిష్టానం తీరుతో విసుగెత్తిన కడియం శ్రీహరి గెలిచాక హస్తం పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ నుండి తన కూతురు కడియం కావ్యకి వరంగల్ ఎంపీ టికెట్ తెచ్చుకొని ఆమె విజయంలో కీలక పాత్ర పోషించారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా కడియం శ్రీహరికి అసలు పంచాయతీ మళ్ళీ మొదలైందంట. స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో గతంలో ఎన్నడూ లేని విధంగా 800 కోట్ల రూపాయల నిధులతో పలు కీలక అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు.సీఎం పర్యటన సందర్భంగా నియోజకవర్గ వ్యాప్తంగా కేడర్‌తో సమన్వయ సమావేశాలు ఏర్పాటు చేసిన కడియం.. రెండు దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీలో ఉంటూ ప్రస్తుతం నియోజకవర్గ ఇన్చార్జిగా ఉన్న సింగపురం ఇందిరను పక్కన పెట్టారనే టాక్ వినిపిస్తోంది. పార్టీలో చేరిన తర్వాత అందరినీ కలుపుకోవాల్సిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, తన వర్గానికి మాత్రమే ప్రాధాన్యత ఇచ్చారని.. ఇన్నాళ్లు కాంగ్రెస్ పార్టీ జెండా మోసిన కార్యకర్తలను నాయకులను పట్టించుకోలేదని చర్చ జరుగుతుంది.అసెంబ్లీ ఎన్నికల్లో కడియం శ్రీహరికి గట్టి పోటీ ఇచ్చి ఓటమిపాలైన సింగపురం ఇందిరను కావాలనే కార్నర్ చేస్తున్నాడని ఇందిరా అనుచరులు చెబుతున్నారట. అందుకోసమే సీఎం సభ ఏర్పాట్ల విషయంలోనూ, సీఎంను నియోజకవర్గానికి ఆహ్వానించే విషయంలోనూ ఇందిరకు సమాచారం ఇవ్వలేదట. సాధారణ కార్యకర్తలారా ఇందిరను ట్రీట్ చేశారని అందుకే సీఎం సభకు సైతం ఇందిర దుమ్మా కొట్టారని ఆమె సన్నిహితులు గుసగుసలాడుకుంటున్నారుఆ క్రమంలో స్టేషన్ ఘన్పూర్ కాంగ్రెస్ లో వర్గ విభేదాలు పూర్తిగా తొలగిపోలేదనే టాక్ నడుస్తోంది. చాలా రోజులుగా ఇందిర వర్గం కాంగ్రెస్ లోకి వచ్చిన కడియం శ్రీహరి వర్గంతో కలవలేక పోతుందట. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఇందిర తన కేడర్ ని కాపాడుకుంటూ వచ్చే ప్రయత్నం చేశారు. మారిన రాజకీయాల నేపథ్యంలో బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి పార్లమెంట్ ఎన్నికల నాటికి కాంగ్రెస్‌లో చేరిపోయారు. ఇక అప్పటినుంచి వీరి మధ్య వర్గ విభేదాలు మరింత పెరిగిపోయాయంటున్నారు. కడియం శ్రీహరి చేరిక సందర్భంగా ఇందిరకి కాంగ్రెస్ పెద్దల నుంచి పలు హామీలు లభించినట్లు చెప్తున్నారు. ఇందిర వర్గీయులకి నామినేటెడ్ పదవులతో పాటు ఇందిరమ్మ ఇళ్ల కమిటీలలో ప్రాధాన్యత ఇస్తామని చెప్పారంట. అయితే ఆ హామీలేవి ఇంతకాలం అమలు కాకపోతుండటంతో ఇందిర వర్గీయులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు స్టేషన్ ఘన్పూర్ లో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలపై ఇందిరకు కనీసం సమాచారం కూడా లేకపోవడంతో ఆమె కూడా అసంతృప్తితో కనిపిస్తున్నారు.కడియం కాంగ్రెస్‌లో చేరే సమయంలో పార్టీలో ఇందిరకి సముచిత స్థానం కల్పించడానికి కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇస్తామని కాంగ్రెస్ నాయకత్వం హామీ ఇచ్చి.. పార్లమెంట్ ఎన్నికల్లో పని చేయించుకుందంట. ఇప్పటివరకు ఆమెకి ఎలాంటి పదవి రాకపోగా స్టేషన్ ఘన్పూర్ లో తన వర్గం పూర్తిగా నిర్లక్ష్యానికి గురవుతుందననే ఆవేదనలో ఆమె ఉన్నారట. సీఎం సభ సందర్భంగా కూడా కడియం శ్రీహరి ఆమెను నిర్లక్ష్యం చేయడం వల్లే ఆవిడ ఆ సభకి దూరంగా ఉన్నారని ఇందిర వర్గం బహిరంగంగానే చెబుతుంది. మొక్కుబడి సమాచారం మాత్రమే ఇచ్చి ఇందిరని కనీసం సభకు రాకుండా కడియం శ్రీహరి ఎత్తులు వేశారని ఇందిర వర్గం ఆగ్రహంతో ఉన్నారట.సభకి ఒకరోజు ముందు ఇందిర తన ముఖ్య అనుచరులతో మంతనాలు జరిపి కడియం శ్రీహరి పిలవకపోయినా స్టేషన్ ఘన్పూర్‌లో సీఎం పాల్గొనే సభకి హాజరైతే ఎలా ఉంటుందని సమాలోచనలు జరిపారంట. అయితే కడియం శ్రీహరి వ్యవహార శైలి అధిష్టానానికి తెలిసేందుకైనా ఈ సభకు వెళ్లకూడదని దుమ్మా కొట్టారని ఇందిర వర్గంలో గుసగుసలు వినిపిస్తున్నాయి.కడియం శ్రీహరి తీరుతో తీవ్ర అసంతృప్తిగా ఉన్న సింగపురం ఇందిర, ఏఐసీసీ పెద్దల వద్ద తన గోడు వెల్లబోసుకునేందుకు సిద్ధమవుతున్నారట. గత ఎన్నికల్లోను ఏఐసీసీ పెద్దల అండతోనే సింగపురం ఇందిరా టికెట్ తెచ్చుకున్నారని.. ఆ స్థాయిలో ప్రభావం చూపగల సత్తా ఇందిరకు ఉందని కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆ క్రమంలో ఇన్ని రోజులు కడియం శ్రీహరి తీరును లైట్ గా తీసుకున్న ఇందిరా అమితుమీ తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారట. 20 ఏళ్లుగా కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడితే, తనను పక్కన పెడుతున్నారన్న ఆవేదనతో.. ఏఐసిసి పెద్దల వద్దే తన విషయం తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నారని ఇందిర అనుచరులు చెప్పుకుంటున్నారు. దాంతో ఇందిర ఏం చేయబోతుందోనని, కడియం వర్గీయులు ఆందోళన చెందుతున్నారు. కడియం శ్రీహరి సైతం ఏం జరుగుతుందో అని అయోమయంలో పడ్డారట.

# ఇంటర్వెల్ ముందే ప్రేమ కథ... కామెడీ కూడా!

**హైదరాబాద్ :** నితిన్, శ్రీ లీల జంటగా నటించిన తాజా సినిమా 'రాబిన్ హుడ్'. ఈ శుక్రవారం (మార్చి 28న) థియేటర్లలోకి వస్తుంది. ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్ గెస్ట్ రోల్ చేసిన సినిమా ఇదే. నట కిరీటి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, వెన్నెల కిషోర్ ప్రధాన పాత్రల పోషించారు. ఈ మూవీ సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుందీ సినిమా. దాంతో పాటు ఫస్ట్ రివ్యూ కూడా బయటకు వచ్చేసింది. మరి సినిమా టాక్ ఎలా ఉందో తెలుసుకోండి.సాధారణంగా హీరో హీరోయిన్లతో పాటు ప్రధాన పాత్రలను సినిమా ప్రారంభంలో పరిచయం చేస్తారు. 'రాబిన్ హుడ్' సినిమాలో కూడా నితిన్, శ్రీ లీలతో పాటు రాజేంద్ర ప్రసాద్ వెన్నెల కిషోర్ తదితర ప్రధాన తారాగణం అంతటినీ ఇంటర్వెల్ ముందే దర్శకుడు వెంకీ కుడుముల పరిచయం చేశారని తెలిసింది. హీరో హీరోయిన్ల ప్రేమ కథ చాలా బాగా వచ్చిందట. దానికి తోడు రాజేంద్ర ప్రసాద్, వెన్నెల కిషోర్ చేసిన కామెడీ ఆడియన్స్ అందరినీ నవ్విస్తుందని చెబుతున్నారు.మెయిన్ ఆర్టిస్టులు అందరినీ ముందుగానే పరిచయం చేసినప్పటికీ... డేవిడ్ వార్నర్ మామను మాత్రం క్లైమాక్స్ వరకు దాచేశారు. ఆయన రోల్ మాత్రం ఎండింగ్ లో అందరినీ సర్ప్రైజ్ చేస్తుందని తెలిసింది. విశ్రాంతికి ముందు వరకు ప్రేక్షకులకు వినోదం అందించిన వెంకీ కుడుముల... ఇంటర్వెల్ తర్వాత అసలు కథను రివీల్ చేశారట. ఈ సినిమాలో ఎమోషనల్ యాంగిల్ ఎప్పటి వరకు బయటకు తీయలేదని, అది ఆడియన్స్ అందరినీ ఒక సర్ప్రైజ్ అండ్ షాక్ కి గురి చేస్తుందని చెబుతున్నారు.ప్రేక్షకుల హృదయాలను హత్తుకునే ఒక భావోద్వేగ భరిత సన్నివేశం విశ్రాంతి తర్వాత వస్తుందని సినిమా చూసిన జనాలు తెలిపారు. ఈ మూవీ ట్రైలర్ చూస్తే ఇదొక కామెడీ సినిమా అనిపిస్తుంది. కామెడీని మించిన ఎమోషన్ సినిమాలో ఉందని టాక్. ట్రైలర్ జాగ్రత్తగా గమనిస్తే... అందులో 'రాబిన్ హుడ్' పాత్ర చేశారు హీరో నితిన్. ఆయన దొంగతనాలు చేయడం, ధనవంతులను దోచుకోవడం కనిపించింది. కానీ ఎందుకు దోచుకుంటున్నారు? ఆ దోచిన డబ్బును తిరిగి ఎవరికి పంచుతున్నారు? ఏమిటి? అనేది మాత్రం వెంకీ కుడుమల చూపించలేదు. ఆ పాయింట్ మెయిన్ అనేది టాక్. నితిన్ మీద ఇంటర్వెల్ తర్వాత తీసిన ఒక స్టైలిష్ ఫైట్ కూడా ఆడియన్స్ అందరికీ నచ్చడం గ్యారెంటీ అంటున్నారు.రాబిన్ హుడ్' సినిమాకు జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. ఆయన ఇచ్చిన పాటలు సిల్వర్ స్క్రీన్ మీద బాగా వచ్చాయట. రీ రికార్డింగ్ విషయంలో కూడా బాగా చేశారని టాక్. ఇక మైత్రి మూవీ మేకర్స్ ఖర్చు విషయంలో అస్సలు వెనకాడకుండా భారీ ఎత్తున సినిమాను తీసిందట. కేతిక శర్మ చేసిన స్పెషల్ సాంగ్ 'అదిదా సర్ప్రైజ్' సినిమాకు కావాల్సిన బజ్ తీసుకొచ్చింది. మార్చి 28న సినిమా ఫైనల్ రిజల్ట్ తెలుస్తుంది.

## ఎంఫార్మసీ కోర్సుల పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులు

**హైదరాబాద్ :** ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఫార్మసీ కోర్సుల పరీక్షా ఫలితాల రివాల్యుయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఫార్మసీ (పీసీఐ) మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షల ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను సంబంధిత కళాశాలల నుంచి మూడు వారాల తర్వాత పొందవచ్చని చెప్పారు.ఈ రివాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.800 చొప్పున చెల్లించి ఈ నెల 29వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ. 200 అపరాధ రుసుముతో వచ్చే నెల 2వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పరీక్ష జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈనెల 29వ తేదీ వరకు తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్లో చూసుకోవచ్చని సూచించారు.

## 14 ఏళ్లుగా పెండింగ్‌లోనే ఘట్కేసర్ ప్లై ఓవర్ ఎట్టకేలకు నిధులు మంజూరు

**హైదరాబాద్ :** గత 14 సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఘట్కేసర్ ప్లై ఓవర్ పనులు ఇకపై శరవేగంగా ముందుకు సాగనున్నాయి. అయితే, మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి మంగళవారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా 14 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఘట్‌కేసర్ ప్లైఓవర్ పనులను ప్రారంభించాలని డిప్యూటీ సీఎంకు మాజీ మంత్రి మల్లారెడ్డి వినతిపత్రం సమర్పించారు. అయితే, మల్లారెడ్డి వినతిపై వెంటనే స్పందించిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పనులు ప్రారంభించేందుకు రూ.50 లక్షల నిధులు మంజూరు చేశారు దీంతో మేడ్చల్ నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుంది

**హైదరాబాద్ :** డీలిమిటేషన్ పై స్పందించిన తెలంగాణ సీనియర్ కాంగ్రెస్ నేత వీహెచ్ డీలిమిటేషన్ ను వ్యతిరేకిస్తున్న దక్షిణాది రాష్ట్రాలు. అన్ని రాజకీయ పక్షాలు డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా సంఘీభావం ప్రకటించాలన్న వీహెచ్ ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో నియోజకవర్గాల పునర్విభజన డీలిమిటేషన్ అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న డీలిమిటేషన్‌ను దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలో ఇటీవల చెన్నైలో వివిధ రాజకీయ పక్షాలతో అఖిలపక్ష సమావేశం కూడా జరిగింది. డీలిమిటేషన్‌ను మరో 25 ఏళ్లు స్తంభింపజేయాలని దక్షిణాది రాష్ట్రాల నేతలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ చేస్తే ఉత్తరాది రాష్ట్రాల్లో నియోజకవర్గాల సంఖ్య గణనీయంగా పెరిగి, దక్షిణాది రాష్ట్రాల్లో తగ్గే ప్రమాదం ఉందని నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా ప్రాతిపదికన కాకుండా ఎవరికీ నష్టం జరగని రీతిలో శాస్త్రీయ విధానం కనుగొనే వరకు డీలిమిటేషన్ ప్రక్రియను వాయిదా వేసేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ అంశంపై తాజాగా తెలంగాణకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నేత, మాజీ పీసీసీ అధ్యక్షుడు వి. హనుమంతరావు స్పందించారు. దేశంలో జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరిగితే దక్షిణాది రాష్ట్రాలు నష్టపోతాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం నిర్వహించబోయే డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా అన్ని రాజకీయ పక్షాలు సంఘీభావం ప్రకటించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి ఫలితం హుస్నాబాద్ కి శాతవాహన యూనివర్సిటీ

**ఇంజనీరింగ్ కాలేజి మంజూరు చేస్తూ జీవో నెంబర్ 18 ద్వారా తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు**

**హైదరాబాద్ :** పెద్దపల్లి సభలో మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి మేరకు శాతవాహన యూనివర్సిటీ కి హుస్నాబాద్ లో ఇంజనీరింగ్ కాలేజి, యూనివర్సిటీ కి లా కాలేజి మంజూరు. శాతవాహన యూనివర్సిటీ కి ఇంజనీరింగ్ కాలేజి,లా కాలేజి మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ధన్యవాదాలు తెలిపిన మంత్రి పొన్నం ప్రభాకర్. హుస్నాబాద్ కు శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజి మంజూరు కావడం పట్ల హుస్నాబాద్ ప్రజల హర్షం. హుస్నాబాద్ కి శాతవాహన యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజి తీసుకొచ్చిన మంత్రి పొన్నం ప్రభాకర్ ధన్యవాదాలు తెలిపిన హుస్నాబాద్ ప్రజలు. శాతవాహన విశ్వవిద్యాలయం 2025-2026 విద్యా సంవత్సరం నుండి హుస్నాబాద్‌లో యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ స్థాపనకు అడ్మినిస్ట్రేటివ్ అనుమతి ఉత్తర్వులు జారీ చేయబడ్డాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, 3 ఃఎవఇష్ట్ర- ఎ మరియు 4 ఃఎవఇష్ట్ర -ఇఅఇ ప్రతి ప్రోగ్రామ్‌లో 60 మంది విద్యార్థులను తీసుకుంటారు. హుస్నాబాద్‌లో యూనివర్శిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ శాతవాహన యూనివర్శిటీ నిర్మాణానికి రూ.44.12 కోట్ల రూపాయలు మంజూరు.

## యాసంగి ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక సిద్ధం చేయాలి




**కరీంనగర్ :** కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు సమకూర్చాలి.రైతులకు అవగాహన కల్పించాలి.యాసంగి ధాన్యం కొనుగోళ్లకు ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కొనుగోలు కమిటీ సభ్యులను కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. యాసంగి ధాన్యం కొనుగోళ్లపై కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం జిల్లా కొనుగోళ్ల కమిటీ సభ్యులు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ ధాన్యం పూర్తిగా పరిపక్వతకు వచ్చిన తర్వాతనే హార్వెస్ట్ చేసేలా రైతులకు, హార్వెస్టింగ్ మిషన్ ఆపరేటర్లకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ధాన్యం కోతలకు సంబంధించి రెవెన్యూ గ్రామాల వారీగా నిర్దిష్ట ప్రణాళిక ఏర్పాటు చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తూకపు యంత్రాలు, తేమను కొలిచే యంత్రాలు, గన్ని సంచులు, తార్పాలీన్ కవర్లు వంటివి సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇప్పుడు ఉన్న ప్యాడి క్లీనర్ లతో పాటు మరో 15 ప్యాడి క్లీనర్ లను కొనుగోలు చేయాలని సూచించారు. అన్ని కొనుగోలు కేంద్రాల్లో 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. ధాన్యం కొనుగోలు తర్వాత వెన్ వెంటనే వివరాలు ఆన్లైన్లో నమోదు చేయాలని తెలిపారు. రైతుకు సకాలంలో సొమ్ము అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో సన్న, దొడ్డు రకాల ధాన్యాలు వేరువేరు ప్రదేశాల్లో ఉండేలా చూడాలని సూచించారు. ఎండాకాలం దృశ్య రైతులకు నీడ, తాగునీటి సౌకర్యం ఉండేలా చూడాలని తెలిపారు. సిబ్బంది కొనుగోలు రిజిస్టర్ ను అందుబాటులో ఉంచుకోవాలని, పకడ్బందీగా వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు. తేమ యంత్రాన్ని నీడలోనే ఉండేలా చూడాలని సూచించారు.

# నీళ్లు ఎక్కువ తాగినా నష్టమేనండోయ్!



ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. ఈ కారణంగా వాపు, వికారం, వాంతులు ఇలాంటి సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఎక్కువ నీళ్లు తాగితే బ్లడ్ వాల్యూమ్ పెరుగుతుంది. గుండెపై అధిక ఒత్తిడి పడుతుంది. ఛాతిలో నొప్పిగా అనిపిస్తుంది. అతిగా నీళ్లు తాగడం వల్ల కాళ్లలో వాపులు వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి సరిపడా నీరు మాత్రమే తీసుకోండి. మరీ ఎక్కువగా తాగితే సమస్యలు వస్తాయి. నీరు ఆరోగ్యానికి చాలా అతి ముఖ్యమైన అవసరం. రోజూ కనీసం 3-5 లీటర్ల నీరు తాగాలని వైద్యులు చెబుతుంటారు. ఇది వారి సామర్థ్యాన్ని బట్టి ఉంటుంది. అయితే కొంతమంది నీళ్లు మరీ ఎక్కువగా తాగుతుంటారు. ఇది సరైనది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇలా చేయటం వల్ల తీవ్రమైన సైడ్ ఎఫెక్ట్స్ కూడా ఉన్నాయని చెబుతున్నారు. నీళ్లు ఎక్కువగా తాగటం వల్ల కలిగే అనారోగ్య సమస్యలేంటో తెలుసుకుందాం. ఎక్కువగా నీళ్లు తాగడం వల్ల కిడ్నీలకు ఇబ్బందికరంగా మారుతుంది. కిడ్నీలు నీళ్లని ఫిల్టర్ చేయలేవు. కిడ్నీలపై అధిక భారం పడుతుంది. ఎక్కువ నీళ్లు తాగడం వల్ల బాడీ ఎలక్ట్రోలైట్స్ (లవణాలు) కోల్పోవాల్సి ఉంటుంది. దీంతో ఎలక్ట్రోలైట్ ఇన్ బాలన్స్ జరిగి కండరాల నొప్పులు, కండరాల బలహీనత ఇలాంటి సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఎక్కువ నీళ్లు తాగడం వల్ల పదేపదే మూత్ర విసర్జన చేయడం, దాని కారణంగా నిద్ర పట్టకపోవడం ఇలాంటి ఇబ్బందులు ఎదురవుతాయి. ఎక్కువ నీళ్లు తాగడం వల్ల సోడియం లెవెల్స్ పడిపోతాయి. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. ఈ కారణంగా వాపు, వికారం, వాంతులు ఇలాంటి సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఎక్కువ నీళ్లు తాగితే బ్లడ్ వాల్యూమ్ పెరుగుతుంది. గుండెపై అధిక ఒత్తిడి పడుతుంది. ఛాతిలో నొప్పిగా అనిపిస్తుంది. అతిగా నీళ్లు తాగడం వల్ల కాళ్లలో వాపులు వచ్చే అవకాశం ఉంటుంది. కాబట్టి సరిపడా నీరు మాత్రమే తీసుకోండి. మరీ ఎక్కువగా తాగితే సమస్యలు వస్తాయి. ఎక్కువ నీళ్లు తాగడం వల్ల జీర్ణ సమస్యలు కూడా వస్తాయి. అజీర్తి, కడుపు ఉబ్బరంతో పాటుగా ముఖ్యమైన పోషకాలని కోల్పోవడం లాంటి ఇబ్బందులు వస్తాయి. రోజుకి 3-5 లీటర్లు నీళ్లు తాగాలి. అంటే 8 నుంచి 12 గ్లాసులు మాత్రమే. లేత పసుపు రంగులో యూరిన్ వస్తే హైడ్రేట్‌గా ఉన్నట్లు అదే ముదురు పసుపు రంగులో మూత్రం వస్తే డీహైడ్రేషన్ బారిన పడినట్లు అర్థం. అలాంటి సమయంలో నీళ్లు ఎక్కువగా తాగాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

## రాత్రిపూట చపాతీ తింటున్నారా?



చపాతీ రాత్రి భోజనానికి మంచి ఎంపిక. ఇందులో అధిక ఫైబర్ ఉండటం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించి, ఆకలిని నియంత్రించడంలో సహాయపడుతుంది. బరువు తగ్గే లక్ష్యంతో ఉన్నవారికి చపాతీ మేలు చేస్తుంది. అయితే తగిన పరిమితిలో తీసుకోవడం అవసరం. మరీ ఎక్కువగా తింటే అనవసర సమస్యలు వస్తాయి. మనలో చాలా మంది రాత్రి భోజనానికి చపాతీకి ప్రాధాన్యత ఇస్తారు. చపాతీలో ఫైబర్ పుష్కలంగా ఉండటం వల్ల రాత్రి చపాతీ తినడం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది కడుపు నిండిన భావనను కలిగిస్తుంది. తద్వారా రాత్రిపూట చిరుతిండిని తగ్గించవచ్చు. మరింతగా రాత్రి సమయంలో కడుపుని తేలికగా ఉంచటంలో చపాతీ ముఖ్యపాత్ర పోషిస్తుంది. చపాతీలో ఉండే గోధుమల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఈ ఫైబర్ మీ ఆకలిని తగ్గిస్తుంది. కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. ఫైబర్ అధికంగా ఉన్న ఆహారం తినడం వలన ఎక్కువసేపు తినాలనిపించదు. రాత్రిపూట మీరు తక్కువ శారీరక చురుకుదనంతో ఉన్నప్పుడు ఇది చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. చపాతీకి ఇతర ధాన్యాలతో పోలిస్తే తక్కువ గ్లైసెమిక్ సూచిక ఉంటుంది. ఉదాహరణకు తెల్ల బియ్యం రక్తంలో చక్కెరను త్వరగా పెంచుతుంది. కానీ చపాతీ రక్తంలో చక్కెరను నెమ్మదిగా విడుదల చేస్తుంది. ఇది రక్తంలో చక్కెర పెరగడం, తగ్గడం వంటి సమస్యలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది ముఖ్యంగా మధుమేహ వ్యాధిగ్రస్తులకు ఉపకారం చేస్తుంది. చపాతీలో ఉన్న ఫైబర్ జీర్ణక్రియను మెరుగుపరచడంలో కూడా సహాయపడుతుంది. ఫైబర్ అధికంగా ఉండటం వల్ల పేగుల కదలిక సజావుగా ఉంటుంది. మలబద్ధకం వంటి సమస్యలు నివారించబడతాయి. రాత్రిపూట అసౌకర్యం, ఉబ్బరాన్ని తగ్గించడానికి చపాతీ సహాయకంగా ఉంటుంది. బియ్యం లాంటి ఇతర ఆహారాలతో పోలిస్తే చపాతీ తేలికగా ఉంటుంది. ఇది రాత్రిపూట జీర్ణం కావడానికి సులభంగా ఉంటుంది. బియ్యం కంటే తేలికగా జీర్ణం అయ్యే గుణం ఉండటం వల్ల రాత్రిపూట కడుపులో భారంగా లేకుండా ఉంటుంది. చపాతీ తినడం మీ బరువు నిర్వహణలో కూడా సహాయపడుతుంది. చపాతీ తగిన మోతాదులో తింటే అది మీకు కడుపు నిండిన అనుభూతిని కలిగిస్తుంది. ఎక్కువగా తినకుండా నిరోధిస్తుంది. ఈ విధంగా మీరు మీ బరువును సరిగా నియంత్రించుకోవచ్చు. చపాతీని ఆరోగ్యకరమైన ఆహారంగా పరిగణించవచ్చు. కానీ ఎక్కువగా తినడం కేలరీలు అధికంగా ఉండే పరిస్థితిని కలిగిస్తుంది. కాబట్టి మీకు కావలసినంత మాత్రమే తినడం ద్వారా మీ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు.

## తమలపాకుతో లవంగాలు కలిపి తింటే ఎన్ని లాభాలో?



లవంగాలు, తమలపాకులు తినడం వల్ల కఫం తగ్గుతుంది. అలాగే, ఇది జలుబు, దగ్గు నుండి ఉపశమనం ఇస్తుంది. శ్వాసకోశ వ్యాధులలో ఉపశమనం అందిస్తుంది. తమలపాకులు, లవంగాలు రెండూ మధుమేహ రోగులకు ప్రయోజనకరంగా ఉంటాయి. ఇది రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుంది. మధుమేహానికి ఉపయోగపడుతుంది. తమలపాకు, లవంగాలను కలిపి తినడం వల్ల శరీరానికి విటమిన్ సి, విటమిన్ కె, కాల్షియం, భాస్వరం, మెగ్నీషియం, ఫైబర్, థయామిన్, యూజినాల్ ఇంకా అనేక యాంటీఆక్సిడెంట్లు లభిస్తాయి. తమలపాకులు, లవంగాలు రెండూ పోషకాలతో సమృద్ధిగా ఉంటాయి. వీటిని కలిపి తినడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయని ఆయుర్వేద ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. తమలపాకులో జీర్ణవ్యవస్థను మెరుగుపరిచే యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. లవంగంలో యూజినాల్, ఫైబర్ ఉంటాయి. ఇది ఆమ్లత్వం, అజీర్ణం, గ్యాస్ సమస్యను తగ్గిస్తుంది. లవంగాలు, తమలపాకులలో యాంటీ బాక్టీరియల్ లక్షణాలు ఉంటాయి. అవి నోటి నుండి బ్యాక్టీరియాను తొలగించడం ద్వారా శ్వాసను తాజాగా ఉంచుతాయి. నోటి దుర్వాసనను తొలగిస్తాయి. లవంగాలు, తమలపాకులు రెండూ యాంటీఆక్సిడెంట్, యాంటీ బాక్టీరియల్ లక్షణాలతో సమృద్ధిగా ఉంటాయి. ఈ అంశాలు రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. ఇది వ్యాధులను నివారిస్తుంది. లవంగాలు, తమలపాకులు తినడం వల్ల కఫం తగ్గుతుంది. అలాగే, ఇది జలుబు, దగ్గు నుండి ఉపశమనం ఇస్తుంది. శ్వాసకోశ వ్యాధులలో ఉపశమనం అందిస్తుంది. తమలపాకులు, లవంగాలు రెండూ మధుమేహ రోగులకు ప్రయోజనకరంగా ఉంటాయి. ఇది రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుంది. మధుమేహానికి ఉపయోగపడుతుంది.

# పల్లీలు చేసే హెల్త్ మ్యాజిక్?

వేరుశెనగలు పోషక విలువలతో నిండిపోయిన అద్భుతమైన ఆహారం. వీటిలో ప్రోటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు, ఖనిజాలు ఉండడంతో మన శరీరానికి అనేక రకాల లాభాలను అందిస్తాయి. మధుమేహం, గుండె ఆరోగ్యం, మెదడు శక్తిని మెరుగుపరిచే గుణాలు వీటిలో ఉంటాయి. అందుకే రోజువారీ ఆహారంలో వేరుశెనగలను చేర్చడం చాలా మంచిది. మనం సాధారణంగా బాదం, పిస్తా, జీడిపప్పుల గురించి ఎక్కువగా వింటాం. వాటిని చాలా ఆరోగ్యకరంగా భావిస్తాం. అయితే వేరుశెనగల్లో ఉన్న పోషక విలువలు, ఆరోగ్య ప్రయోజనాలు చాలా మందికి తెలియవు. వేరుశెనగలు రోజువారీ ఆహారంలో చేర్చడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చు. వేరుశెనగలో మాంగనీస్ అనే ఖనిజం ఉంటుంది. ఈ మాంగనీస్ స్టార్చ్ కొవ్వులను మార్చడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఇది మధుమేహం ఉన్నవారికి ఎంతో సహాయపడుతుంది. క్రమంగా చక్కెర స్థాయిలను నియంత్రించడంలో వేరుశెనగలు ఉపయోగపడతాయి. అందువల్ల వేరుశెనగలను ఆహారంలో చేర్చడం వల్ల మధుమేహ నియంత్రణకు సహకారం అందుతుంది. వేరుశెనగల్లో రెస్వెరాట్రాల్ అనే యాంటీఆక్సిడెంట్ ఉంటుంది. ఇది గుండెకు చాలా మంచిదని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. ఈ యాంటీఆక్సిడెంట్ గుండె కవాటాలను బలపరుస్తుంది. అలాగే గుండెపోటు వంటి ప్రమాదాలను తగ్గిస్తుంది. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనుకుంటే వేరుశెనగలను తరచూ తినడం ద్వారా మంచి ఫలితాలు పొందవచ్చు. వేరుశెనగలో పాలీఫెనాల్ అనే యాంటీఆక్సిడెంట్ ఉంటుంది. ఇది యవ్వనాన్ని కాపాడటంలో సహాయపడుతుంది. వృద్ధాప్యంతో వచ్చే అనేక ఆరోగ్య సమస్యలను వేరుశెనగలు నివారిస్తాయి. ఎప్పుడూ ఆరోగ్యంగా, యవ్వనంగా కనిపించాలనుకుంటే వేరుశెనగలు మీకు మంచి మిత్రులుగా ఉంటాయి. వేరుశెనగల్లో అమైనో ఆమ్లం ట్రిప్టోఫాన్ ఉంటుంది. ఇది మెదడులో సెరోటోనిన్ అనే హార్మోన్ విడుదలకు సహాయపడుతుంది. సెరోటోనిన్ మెదడు కార్యకలాపాలను మెరుగుపరచడంలో జ్ఞాపకశక్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. విద్యార్థులు, మేధస్సు కోసం శ్రమిస్తున్నవారు వేరుశెనగలను తినడం వల్ల జ్ఞాపకశక్తి మెరుగుపడుతుంది. వేరుశెనగల్లో రాగి, జింక్ వంటి ఖనిజాలు ఉంటాయి. ఇవి శరీరంలోని అదనపు కొవ్వును కరిగించడంలో సహాయపడతాయి. ఇవి శరీరానికి ఆరోగ్యకరమైన కొవ్వులను అందించి ఫిట్‌గా ఉంచుతాయి. శారీరక ఫిట్‌నెస్‌ను మెరుగుపరచుకోవాలంటే వేరుశెనగలు మంచి ఆహారంగా పరిగణించవచ్చు. వేరుశెనగలో ఉండే పోషకాలు మహిళల గర్భాశయ ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. గర్భాశయంలో కణితులు, తిత్తుల సమస్యలను నివారించడంలో వేరుశెనగలు సహకరిస్తాయి. గర్భిణీ స్త్రీలకు అవసరమైన ఫోలిక్ ఆమ్లం కూడా వేరుశెనగలో ఉంది. ఇది గర్భిణీ స్త్రీలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.



## బిజినెస్

### బీమాపై 5 శాతం జిఎస్‌టి!




ఆరోగ్య, జీవిత బీమా పాలసీలపై భారంగా ఉన్న 18 శాతం జిఎస్‌టిని తగ్గించే అవకాశం ఉందని తెలుస్తోంది. బీమాపై అధిక పన్ను రేటు ఈ రంగానికి ప్రతికూలంగా ఉండటంతో పాటుగా పాలసీదారులపై తీవ్ర భారం పడుతోంది. దీన్ని తగ్గించాలని ఎప్పటి నుంచో డిమాండ్ ఉంది. దీనిపై ఎట్టకేలకు అడుగు ముందుకు పడుతోన్నట్లు సమాచారం. త్వరలో జరగబోయే జిఎస్‌టి కౌన్సిల్ సమావేశంలో బీమాపై జిఎస్‌టిని 5 శాతానికి తగ్గించనున్నట్లు సంబంధిత వర్గాల సమాచారం. జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియంలను జిఎస్‌టి నుంచి పూర్తిగా మినహాయించడానికి తాము అనుకూలంగా లేమని.. అయితే పన్ను రేట్లు తగ్గించాలని భావిస్తున్నామని జిఎస్‌టి కౌన్సిల్ మంత్రుల బృందంలోని ఓ సభ్యుడు పేర్కొన్నారు. మెజారిటీ సభ్యులు దీనికి అనుకూలంగా ఉన్నారన్నారు. మరోవైపు బీమా సంస్థలు సైతం జిఎస్‌టి పూర్తి రద్దును వ్యతిరేకిస్తున్నాయని.. ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను పొందడానికి అవకాశం లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేస్తోన్నాయి. ఏప్రిల్ నెలాఖరులో గానీ, మే నెలలో గానీ జరగనున్న తదుపరి జిఎస్‌టి కౌన్సిల్ భేటీలో బీమాపై పన్ను రేట్ల తగ్గింపునపై స్పష్టత రానుందని సమాచారం.

### ఎంఎస్‌ఎంఇల టర్నోవర్ పరిమితి రెట్టింపు



సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు (ఎంఎస్‌ఎంఇ)ల పెట్టుబడులు, టర్నోవర్‌ల పరిమితుల్లో మార్పులు చేస్తూ కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. దీంతో నూతన విధానం ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానుంది. ఈ కొత్త విధానంతో సూక్ష్మ సంస్థల పెట్టుబడుల పరిమితిని రూ.1 కోటి నుంచి రూ.2.5 కోట్లకు పెరిగింది. వీటి టర్నోవర్‌ను కూడా రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్లకు చేర్చింది. చిన్న సంస్థల పెట్టుబడులను రూ.10 కోట్ల నుంచి రూ.25 కోట్లకు పెంచింది. వీటి టర్నోవర్‌ను రూ.50 కోట్ల నుంచి రెట్టింపు చేసి రూ.100 కోట్లకు చేర్చింది. రూ.25 కోట్ల నుంచి రూ.125 కోట్ల వరకు పెట్టుబడులను కలిగిన వాటిని మధ్యతరహా పరిశ్రమలుగా గుర్తింపు. వీటి టర్నోవర్‌ను రెట్టింపు చేసి రూ.500 కోట్లకు పెంచింది. ఇటీవలి కేంద్ర బడ్జెట్ ప్రసంగంలో ఆర్థిక శాఖ నిర్మలా సీతారామన్ ఎంఎస్‌ఎంఇల పెట్టుబడులు, టర్నోవర్‌ల పరిమితుల్లో మార్పులు తెస్తున్నామని చెప్పారు. పెట్టుబడుల పరిమితిని 2.5 రెట్లు, టర్నోవర్ రెట్టింపు చేయనున్నట్లు ప్రతిపాదిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే కేంద్రం ఎంఎస్‌ఎంఇలకు సంబంధించి నూతన విధానానికి ఆమోదం తెలిపింది.

## మీకు ఒకటి కంటే ఎక్కువ బ్యాంకు అకౌంట్లు ఉన్నాయా?




ఈ రోజుల్లో ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ లావాదేవీలనే ఎక్కువగా జరుపుతున్నారు. అయితే చాలా మందికి ఒకటి కంటే ఎక్కువ బ్యాంకు అకౌంట్లు ఉండటం సర్వసాధారణం అయిపోయింది. కొందరికి ఒకటికంటే ఎక్కువ బ్యాంకు అకౌంట్లు ఉంటాయి. కానీ కొన్ని సందర్భాల్లో మిమ్మల్ని చిక్కుల్లో చిక్కునేలా చేస్తాయి. ఒకటి కంటే ఎక్కువ బ్యాంకు ఖాతాలు కలిగి ఉంటే అధిక జరిమానాలు విధించనున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించింది . రిజర్వ్ బ్యాంక్ బ్యాంకు ఖాతాలకు సంబంధించి కొత్త నియమాలను జారీ చేసినందున బ్యాంకు ఖాతాలకు సంబంధించి ఈ కొత్త మార్పు జరిగింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కాలానుగుణంగా డబ్బు లావాదేవీలు, బ్యాంకు ఖాతాలకు సంబంధించి కొత్త నియమాలను అమలు చేస్తోంది. అందుకే ఇప్పుడు కొత్త బ్యాంకింగ్ నియమాలను ప్రవేశపెట్టింది. బ్యాంకు ఖాతాల ద్వారా నకిలీ డబ్బు లావాదేవీలు, మోసాలు జరుగుతున్న నేపథ్యంలో ఆర్‌బిఐ ఈ కొత్త నిబంధనలను తీసుకువచ్చింది. ఒక వ్యక్తికి ఒకటి కంటే ఎక్కువ బ్యాంకు ఖాతాలు ఉండి, ఆ ఖాతాలో ఏవైనా మోసపూరిత లావాదేవీలు జరిగినట్లు తేలితే, అధిక జరిమానా విధించనున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. బహుళ నకిలీ లావాదేవీలు జరిగితే, రూ. 10,000 వరకు జరిమానా విధించబడుతుందని, ఒకటి కంటే ఎక్కువ బ్యాంకు ఖాతాలను నిర్వహిస్తూ అక్రమ లావాదేవీలు జరిగినట్లయితే చర్యలు తప్పవని ఆర్బీఐ హెచ్చరించింది. జరిమానా విధించబడిన వ్యక్తి జరిమానా చెల్లించడంలో విఫలమైతే బ్యాంకులు చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు కూడా ఆర్‌బిఐ అనుమతి ఇచ్చింది. కొత్త నిబంధనల ప్రకారం.. ఒక వ్యక్తికి ఎక్కువ బ్యాంకుల్లో రెండు లేదా ఎక్కువ ఖాతాల్లో ఏదైనా అనుమానంగా లావాదేవీలు జరిగితే జరిమానా చెల్లించాల్సి ఉంటుందని గుర్తించుకోండి. ఇలాంటి సమస్యలు రాకుండా ఉండాలని ఖాతాను సరిగ్గా నిర్వహించడం తప్పనిసరి.

## ఆన్‌లైన్ షాపింగ్ చేసేవారికి గుడ్‌న్యూస్




ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్ ఇండియా నుండి కొనుగోలు చేసేవారికి ఉపశమనం లభించనుంది. ఎందుకంటే అమెజాన్ 1 కోటి 20 లక్షలకు పైగా ఉత్పత్తులపై రిఫెరల్ ఫీజులను తొలగించబోతోంది. దీని తరువాత ఈ ఉత్పత్తుల ధరను అమెజాన్‌లో తగ్గించవచ్చు. అయితే రూ. 300 కంటే తక్కువ ధర ఉన్న ఉత్పత్తుల నుండి మాత్రమే రిఫెరల్ రుసుము తీసివేయనున్నట్లు తెలుస్తోంది. అమెజాన్ ఈ కొత్త మార్పును ఏప్రిల్ 7 నుండి అమలు చేయబోతోంది. అమెజాన్ ఇప్పటివరకు చేసిన అతిపెద్ద రుసుము తగ్గింపు ఇదేనని, ఇది అమెజాన్ ప్లాట్‌ఫామ్‌లో వస్తువులను విక్రయించే చిన్న వ్యాపారులకు సహాయపడుతుందని కంపెనీ చెబుతోంది. ఈ రుసుము మినహాయింపు బట్టలు, బూట్లు, ఆభరణాలు, కిరాణా, గృహాలంకరణ, బొమ్మలు, వంటగది ఉత్పత్తులతో సహా 135 కంటే ఎక్కువ ఉత్పత్తి వర్గాలపై వర్తిస్తుంది. ప్రస్తుతానికి అమెజాన్ విక్రేతలు ఈ వస్తువుల ప్రతి అమ్మకంపై కంపెనీకి కమీషన్ చెల్లించాల్సి ఉంటుంది. ఇది 2% నుండి 16% వరకు ఉంటుంది. దీనితో పాటు ఈజీ షిప్, సెల్లర్ ఫ్లెక్స్ వంటి మార్గాలను ఉపయోగించే విక్రేతలకు అమెజాన్ ఇండియా జాతీయ షిప్పింగ్ రేట్లను కూడా తగ్గించింది. ఇప్పుడు ఈ రేటు రూ.77 నుండి రూ.65కి తగ్గుతుంది. 1 కిలో కంటే తక్కువ బరువున్న వస్తువులపై నిర్వహణ రుసుము కూడా రూ.17 తగ్గుతుంది. ఒక విక్రేత ఒకేసారి బహుళ ఉత్పత్తులను రవాణా చేస్తే, రెండవ యూనిట్ అమ్మకపు రుసుము 90% వరకు ఆదా అవుతుంది. అమెజాన్ ఇండియాపై నియంత్రణా పరిశీలన తీవ్రతరం అవుతున్న సమయంలో ఈ రుసుము తగ్గింపు వచ్చింది. ఆగస్టు 2024లో, అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ తమ ప్లాట్‌ఫామ్‌లలో ఎంపిక చేసిన విక్రేతలకు అనుకూలంగా వ్యవహరించడం ద్వారా పోటీ చట్టాలను ఉల్లంఘించాయని కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా కనుగొంది. 2020లో ప్రారంభమైన దర్యాప్తులో రెండు కంపెనీలు తమ మార్కెట్ స్థలాలను కొంతమంది పెద్ద అమ్మకందారులకు ప్రయోజనం చేకూర్చే విధంగా, అదే సమయంలో చిన్న అమ్మకందారులకు హాని కలిగించే విధంగా రూపొందించాయని కూడా తేలింది. ప్రస్తుతం అమెజాన్ ఇండియాలో దేశవ్యాప్తంగా వస్తువులను విక్రయించే 16 లక్షలకు పైగా విక్రేతలు ఉన్నారు.

## స్పోర్ట్స్

## పంత్ చేసిన ఆ ఒక్క తప్పు వల్లే.. లక్నో మూల్యం చెల్లించింది!




పొట్టి ఫార్మాట్ క్రికెట్‌లో మ్యాచ్‌ల ఫలితం ఎప్పుడూ అనూహ్యంగా ఉంటుంది. ఢిల్లీ కేపిటల్స్- లక్నో సూపర్ జెయింట్స్ మధ్య సోమవారం విశాఖపట్నం వేదికగా జరిగిన మ్యాచ్ ఈ విషయాన్ని మరో మారు స్పష్టమైంది.

**సత్తా చాటిన శార్దూల్**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025లో భాగంగా.. ఈ మ్యాచ్ ప్రారంభం నుంచి అదే ధోరణిలో జరిగింది. భారత్ జట్టులో స్థానం కోల్పోయి, వేలంలో అమ్ముడుపోక దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆల్ రౌండర్ శార్దూల్ ఠాకూర్... మీడియం పేసర్ మొహ్సిన్ ఖాన్ గాయం కారణంగా తప్పుకోవడంతో జట్టులోకి వచ్చి.. సత్తా చాటడం ఒక ఎత్తు. ఇక ఇంగ్లండ్ కౌంటీ లో ఎసెక్స్ జట్టు తరపున ఆడాలని నిర్ణయించుకుని ఫ్లయిట్ ఎక్కడానికి సిద్ధంగా ఉన్న అతడు.. అనూహ్యంగా దక్కిన అవకాశాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకున్నాడు. మొదటి ఓవర్‌లో ఢిల్లీ ఓపెనర్ జేక్ ఫ్రేజర్-మెక్‌గుర్క్ మరియు అభిషేక్ పోరెల్ ల వికెట్లు పడగొట్టాడు. మరో వైపు ఎడమచేతి వాటం స్పిన్నర్ ఎం సిద్ధార్థ్ కు సమీర్ రిజ్వి ని అవుట్ చేయడంతో ఢిల్లీ రెండో ఓవర్ లోనే 7 పరుగులకు మూడు వికెట్లు కోల్పోయింది. 209 పరుగుల విజయ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఢిల్లీ ఒక దశలో 66 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయి దిక్కుతోచని స్థితికి చేరింది. ఈ దశలో ఉత్తర్ ప్రదేశ్ ఆల్ రౌండర్ విప్రజ్ నిగమ్ 15 బంతుల్లో 39 పరుగులు చేసి ఢిల్లీకి కొంత ఉపశమనాన్నిచ్చాడు. ఇంపాక్ట్ ప్లేయర్ గా బ్యాటింగ్ కి వచ్చిన ఢిల్లీ బ్యాట్స్మన్ అశుతోష్ శర్మ తాను ఎదుర్కొన్న తొలి 20 బంతుల్లో కేవలం 20 పరుగులు మాత్రమే చేశాడు. ఇక ఢిల్లీకి లక్ష్య సాధన దాదాపు కష్టమన్న దశలో అశుతోష్ శర్మ పూనకం వచ్చిన రీతిలో బ్యాటింగ్ చేసి తదుపరి 11 బంతుల్లో 46 పరుగులు సాధించాడు. అందులో ఐదు ఫోర్లు, ఐదు సిక్సర్లు ఉన్నాయి. దీనితో ఓటమి చేరువులో ఉన్న ఢిల్లీ కి ఇంకా మూడు బంతులు మిగిలి ఉండగానే ఒక వికెట్ తేడాతో అద్భుత విజయాన్ని అందించాడు.

**లక్నోను ఆదుకున్న మార్ష్, పూరన్**

గత సీజన్ లో తరచుగా పవర్ ప్లేలో వెనుకబడి ఉన్నట్లు కనిపించిన లక్నో ఈ సీజన్ లో దానిని సరిదిద్దే ప్రయత్నం చేసింది. జట్టులోని ఇద్దరు విదేశీ ఆటగాళ్ల కు ఆ బాధ్యతను అప్పగించింది. ఆస్ట్రేలియా ఆల్ రౌండర్ మిచెల్ మార్ష్, వెస్టిండీస్ వికెట్ కీపర్ బ్యాటర్ నికోలస్ పూరన్ రెండవ వికెట్‌కు కేవలం 42 బంతుల్లో 87 పరుగులు జోడించారు. పూరన్ 30 బంతుల్లో ఆరు ఫోర్లు, ఏడు సిక్సర్లు లతో 75 పరుగులు చేయగా, మార్ష్ 36 బంతుల్లో ఆరు ఫోర్లు, ఆరు సిక్సర్ల తో 72 పరుగులు సాధించాడు. ఫలితంగా లక్నో జట్టు 250 పరుగులు పైగా సాధిస్తుందని భావిస్తున్న తరుణంలో ఆస్ట్రేలియా పేసర్ మిచెల్ స్టార్క్ మరియు భారత్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ వరుసగా వికెట్లు తీసి లక్నోని దెబ్బతీశారు. లక్నో 14 నుంచి 19 ఓవర్లలో కేవలం 33 పరుగులు మాత్రమే జోడించి ఆరు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో లక్నో 200 పరుగులు దాటడమే కష్టమని భావిస్తున్న తరుణంలో డేవిడ్ మిల్లర్ ఇన్నింగ్స్ చివరి రెండు బంతుల్లో మీడియం పేసర్ మోహిత్ శర్మ రెండు సిక్సర్లు కొట్టడంతో స్కోరు 209కి చేరింది. నిజానికి ఢిల్లీ స్కోరు 204/9 వద్ద ఉన్న సమయంలో మోహిత్ శర్మను స్టంపౌట్ చేసే అవకాశాన్ని పంత్ మిస్ చేశాడు. ఆఖరి ఓవర్ మొదటి బంతికి షాబాజ్ అహ్మద్ బౌలింగ్‌లో బాల్ మోహిత్ ప్యాడ్లను తాకినట్లుగా అనిపించింది.

**పంత్ చేసిన ఆ ఒక్క తప్పు వల్లే**

అయితే, అంతలోనే అతడు పరుగు కోసం క్రీజును వీడగా కీపర్ పంత్ స్టంపింగ్ చేయకుండా.. రివ్యూకు వెళ్లాడు. ఎల్బీడబ్ల్యూకు అప్పీలు చేశాడు. అయితే, రీప్లేలో బంతి స్టంప్స్‌ను మిస్ అవుతోందని థర్డ్ అంపైర్ నుంచి నిర్ణయం వెలువడగా.. సేఫ్ అయ్యాడు మోహిత్. నిజానికి అతడిని స్టంపౌట్ చేస్తే.. పదో వికెట్ కోల్పోయి అప్పుడే ఢిల్లీ కథ ముగిసేది. అదే ఓవర్లో మూడో బంతికి అశుతోష్ సిక్సర్ బాది మ్యాచ్‌ను ముగించాడు. అలా నాటకీయ పరిణామాలతో ఢిల్లీ ఈ మ్యాచ్ లో విజయం సాధించడం విశేషం.

### నేలమట్టం కానున్న 130 ఏళ్ల స్టేడియం.. ఒలింపిక్స్ పోటీలే ఆఖరు!



ఆస్ట్రేలియాలోని ప్రధా స్టేడియాల్లో ఒకటైన గబ్బా అంటే చాలు క్రికెట్ జట్లు వణికిపోతాయి. ఆ మైదానం ఆసీస్‌కు కంచుకోట లాంటిది. అక్కడ కంగారులను ఓడించిన జట్లు కొన్నే. నాలుగేళ్ల క్రితం టీమిండియా సంచలన విజయంతో చరిత్రను తిరగరాసింది. అలాంటి గబ్బా మైదానం త్వరలోనే నేలమట్టం కానుంది. స్వదేశంలో జరుగనున్న 2032 ఒలింపిక్స్ అనంతరం గబ్బాను కూల్చివేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈ విషయాన్ని మంగళవారం క్వీన్స్‌లాండ్ ప్రభుత్వం వెల్లడించింది. ప్రతిష్ఠాత్మకమైన గబ్బాను పూర్తిగా కూలగొట్టడానికి కారణం ఏంటో తెలుసా..? క్వీన్స్‌లాండ్ ప్రభుత్వం గబ్బా స్టేడియాన్ని 1895లో నిర్మించింది. అప్పట్నుంచీ ఈ మైదానం దేశవాళీ, అంతర్జాతీయ మ్యాచ్‌లకు ఆతిథ్యం ఇస్తూ వస్తోంది. దాదాపు 130 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ స్టేడియం నిర్వహణను అధికారులు గాలికి వదిలేశారు. దాంతో, స్టేడియం కొంత భాగం శిథిలావస్థలో ఉంది. ఆటగాళ్ల భద్రత, స్టేడియం పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని కూల్చివేయడమే పరిష్కారమని అధికారులు అనుకుంటున్నారు. 2032లో ఒలింపిక్స్ పోటీల తర్వాత.. గబ్బా కనుమరుగు కానుంది. ఆ తర్వాత నుంచి జరగాల్సిన క్రికెట్ మ్యాచ్‌లు విక్టోరియా పార్క్ ప్రాంతంలోని మైదానంలో జరుగనున్నాయి. విశ్వ క్రీడల కోసం 63 వేల సీట్ల సామర్థ్యంతో అక్కడ కొత్త మైదానం నిర్మిస్తున్నారు.

**బంగారు పతకం గెలుపొంది**

'విక్టోరియాలో కొత్త మైదానం నిర్మిస్తున్నాం. 63 వేల మంది సామర్థ్యంతో రూపొందుతున్న ఈ స్టేడియంలో సకల సౌకర్యాలు కల్పిస్తాం. 2032 తర్వాత గబ్బాలో జరగాల్సిన మ్యాచ్‌లను విక్టోరియా పార్క్‌లోని స్టేడియంలో నిర్వహిస్తాం. విశ్వక్రీడల్లో ఆస్ట్రేలియా క్రికెట్ జట్టు బంగారు పతకం గెలుపొంది.. గబ్బాకు వీడ్కోలు పలకాలని ఆశిస్తున్నాం. కొత్త స్టేడియం నిర్మాణానికి ముందుకొచ్చిన క్వీన్స్‌లాండ్ ప్రభుత్వానికి క్రీడాభిమానులందరి తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం' అని క్రికెట్ ఆస్ట్రేలియా ఓ ప్రకటనలో వెల్లడించింది.

# ‘ఓ భామ అయ్యో రామ’ టీజర్ విడుదల

సుహాస్, మాళవిక మనోజ్ జంటగా రామ్ గోదల తెరకెక్కిస్తున్న చిత్రం ‘ఓ భామ అయ్యో రామ’. హరీశ్ నల్ల నిర్మాత. తాజాగా ఈ సినిమా టీజర్ లాంచ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రబృందం సినిమా విశేషాలు ముచ్చటించింది. సుహాస్ మాట్లాడుతూ, ‘దీని స్టోరీ చాలా బాగుంటుంది. సెకండ్ హాఫ్‌లో ట్విస్ట్ అందరినీ ఆకట్టుకుంటుంది. భావోద్వేగాలు ఉన్నాయి. ఈ స్టోరీని అందరూ ఎంజాయ్ చేస్తారు’ అన్నారు. దర్శకుడు రామ్ మాట్లాడుతూ ‘ఇందులో హీరో పేరు రామ్.. హీరోయిన్ పేరు సత్య. నా రియల్ లైఫ్‌లో జరిగిన కొన్ని సంఘటనలు ఇందులో కొన్ని ఉన్నాయి. కథ రాసుకునేటప్పుడే సుహాస్ హీరో అయితే బాగుండని అనుకున్నాను. ఈ పాత్రకు ఆయన సరిపోతారు. కథ బాగుంటే తెలుగు ఆడియన్స్ ఎప్పుడూ ఆదరిస్తారు. ఈ సినిమాను కూడా ఆదరిస్తారు’ అన్నారు. నిర్మాత హరీశ్ మాట్లాడుతూ ‘ఒక సినిమా తెరకెక్కిస్తున్నప్పుడే అది హిట్ అవుతుందా లేదా అని అర్థమవుతుంది. ఇది అలాంటి సినిమానే. అందుకే దీని కోసం ఎక్కడా రాజీ పడకుండా ఖర్చుపెట్టాం’ అన్నారు. హీరోయిన్ మాళవిక మనోజ్ మాట్లాడుతూ ‘నా పాత్ర పేరు సత్యభామ. ఇలాంటి సినిమాలో ఇప్పటి వరకూ నటించలేదు. టాలీవుడ్ ఇండస్ట్రీ చాలా పెద్దది. గొప్ప సినిమాలు ఇక్కడి నుంచే వస్తున్నాయి’ అని చెప్పారు.








# పాపం.. నాని కష్టం మాములుగా లేదు.. మధ్యాహ్నం సమయంలో వర్కవుట్స్

నేచురల్ స్టార్ నాని ఎలాంటి బ్యాక్ గ్రౌండ్ లేకుండా ఇండస్ట్రీకి వచ్చాడు. తన టాలెంట్‌తోనే స్టార్ హీరోగా ఎదిగాడు. ఇప్పుడు నిర్మాతగాను సత్తా చాటుతున్నాడు. అయితే నానికి సంబంధించిన ఓ ఆసక్తికర విషయం ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. తన ఫిజిక్‌ని కాపాడుకునేందుకు నాని ఎంత కష్టపడతాడు అనే విషయం ఇప్పుడు నెట్టింట తెగ హల్చల్ చేస్తుంది. తాజాగా హీరో నాని డైట్ గురించి ఫిట్‌నెస్ క్రియేటర్ అండ్ కోచ్ అయిన విశ్వ భరత్ కొన్ని ఆసక్తికర విషయాలు తెలియజేశారు. ఓ పాడ్ కాస్ట్ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ నాని ప్రతి రోజు కూడా 12.30 గంటలకి నిద్రలేచి ఒంటి గంటకి వర్కౌట్లు మొదలుపెడతారు. అనంతరం 300-400%ఎత్రీ% ఫ్రూట్ జ్యూస్ తీసుకుంటారు. ఆ జ్యూస్‌లో కొద్దిగా ఉప్పు కలుపుకుంటారు. ఆ తర్వాత పలు సప్లిమెంటరీలు తీసుకుంటారు. నాలుగు గంటల సమయంలో సాధారణ తెలుగు భోజనం చేస్తారు. ఇందులో 60 గ్రాముల రా రైస్, టమాటా లేదా తోటకూరతో కలిపి వండిన 50 గ్రాముల పప్పు, చిక్కుడుకాయ, బీరకాయ, బెండకాయ ఇలా కూరగాయలతో వండిన ఓ కూర, 150 గ్రాముల చికెన్, ఇంకా ఎగ్స్ వంటివి ఉంటాయని తెలిపారు. ఇలా భోజనం తీసుకోవడం వలన 800-900 గ్రాముల క్యాలరీస్, 60-70 గ్రాముల ప్రొటీన్ వస్తుంది. ఇక రాత్రి 9 గంటల సమయంలో ఓ ఫ్రూట్ బౌల్ లేదా 200 గ్రాముల చికెన్, ఫిష్ తీసుకుంటారు. రోజంతా హైడ్రేట్‌గా ఉండేందుకు సుమారు 4లీటర్ల నీళ్లు తాగుతారు అని చెప్పుకొచ్చారు విశ్వ భరత్. అయితే విశ్వ చెప్పిన మాటలని బట్టి చూస్తుంటే నాని ఎక్కువగా రాత్రి షూటింగ్స్‌లో పాల్గొంటారని, ఉదయం అంతా పడుకొని మధ్యాహ్నం నిద్ర లేచి వర్కవుట్స్ చేస్తారని అర్థమవుతుంది. నాని తీసుకునే డైట్ బాగుంది కానీ వేళాపాళా లేకుండా నిద్రలేవడం, తినడం మాత్రం అంత పర్‌ఫెక్ట్ అనిపించడం లేదని కొందరు కామెంట్స్ చేస్తున్నారు. ఇక ఇదిలా ఉంటే నాని సమర్పణలో రూపొందిన కోర్ట్ చిత్రం ఎంత పెద్ద హిట్ అయిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఇక నాని ప్రధాన పాత్రలో ది ప్యారడైజ్ చిత్రం రూపొందుతుండగా, ఇది నాని కెరీర్‌లో బిగ్గెస్ట్ హిట్‌గా మారుతుందని కొందరు భావిస్తున్నారు. మరోవైపు హిట్ 3 కూడా చేస్తున్నాడు నాని.




# ‘బ్యూటీ’ భామ నీలఖికి యంగ్ సెన్సేషన్ అవార్డు

బ్యూటీ’ అనే చిత్రంతో నీలఖి త్వరలో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. ఈ సినిమాను గీతా సుబ్రమణ్యం, ‘హలో వరల్డ్’ ఫేమ్ వర్ధన్ దర్శకత్వంలో రూపొందిస్తున్నారు. ఈ చిత్రంలో అంకిత్ కొయ్య హీరోగా, నీలఖి హీరోయిన్‌గా నటించారు. నీలఖి తెలుగు సినిమా పరిశ్రమలోకి అడుగుపెట్టకముందే ఒడిశాలో తన ప్రతిభను చాటుకున్నారు. ఒడిశాలోని ప్రముఖ ఛానెల్ తరంగ్ టీవీ నిర్వహించిన ‘తరంగ్ సినీ ఉత్సవ్’ కార్యక్రమంలో ‘యంగ్ సెన్సేషన్ ఆఫ్ ది ఇయర్ - డెబ్యూ ఫీమేల్’ విభాగంలో నీలఖి అవార్డును గెలుచుకున్నారు. తెలుగు ప్రేక్షకులను కూడా తన నటనతో ఆకట్టుకుంటారని ‘బ్యూటీ’ టీమ్ గట్టి విశ్వాసంతో ఉంది. ఇప్పటికే విడుదలైన ‘బ్యూటీ’ సినిమా పోస్టర్లు, టీజర్‌లో నీలఖి అందరి దృష్టిని ఆకర్షించారు. ఆమె నటనలో భావోద్వేగాలను అద్భుతంగా పండించారని టీమ్ గతంలోనే వెల్లడించింది. ‘బ్యూటీ’ చిత్రంతో నీలఖి తెలుగు సినిమా పరిశ్రమలోకి ఘనంగా అడుగుపెట్టేందుకు సిద్ధమయ్యారు. ఈ సినిమా త్వరలో థియేటర్లలో విడుదల కానుంది. వానరా సెల్యులాయిడ్ బ్యానర్‌పై మారుతి టీమ్‌తో కలిసి జీ స్టూడియోస్ సమర్పిస్తోన్న ఈ చిత్రానికి అడిదాల విజయపాల్ రెడ్డి, ఉమేష్ కేఆర్ బన్సాల్ నిర్మాతలుగా వ్యవహరిస్తున్నారు.

# ప్రభాస్ హీరోయిన్‌కు ‘తెలుగు’ క్లాసులు



సినిమాల్లో అనుకున్నంతగా సక్సెస్ కాకపోయినా సోషల్ మీడియాలో సూపర్ పాపులారిటీ ఉన్న అందాల భామల్లో మాళవిక మోహనన్ ఒకరు. ఉత్తరాదికి దిశా పటాని ఎలాగో దక్షిణాదికి మాళవిక అలా అని చెప్పొచ్చు. హాట్ హాట్ ఫొటో షూట్లతో కుర్రకారుకు కిర్రెక్కిస్తూ మిలియన్ల కొద్దీ ఫాలోవర్లను సంపాదించుకుంది మాళవిక. కానీ ఆమె కోరుకున్న బ్లాక్ బస్టర్ సక్సెస్ మాత్రం ఇంకా దక్కలేదు. ఇప్పటిదాకా ఆమె నటించిన చిత్రాలు నిరాశనే మిగిల్చాయి. ఈ స్థితిలో తన ఆశలన్నీ ప్రభాస్ మూవీ ‘రాజా సాబ్’ మీదే ఉన్నాయి.ఈ సినిమా తన కెరీర్‌కు గేమ్ చేంజర్ అవుతుందని ఆమె ఆశిస్తోంది. ఇందులో మాళవిక సొంతంగా డబ్బింగ్ కూడా చెప్పబోతున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఆమె తెలుగు క్లాసులు కూడా తీసుకుంటోందట. ఓ ఇంటర్వ్యూలో మాళవిక మాట్లాడుతూ.. ఏ ఇండస్ట్రీలో నటించినా ఆ భాష నేర్చుకుంటే మెరుగ్గా నటించడానికి అవకాశముంటుందని చెప్పింది. అందులోనూ తెలుగు ఇండస్ట్రీ ఎంతో ఎదిగిపోయిందని.. బాలీవుడ్‌తో సమానమైన ఇండస్ట్రీ అదని.. అలాంటపుడు ఆ భాష నేర్చుకుని నటిస్తే మంచిది కదా అని ఆమె వ్యాఖ్యానించింది. అందుకే తెలుగు క్లాసులు తీసుకుని ఆ భాష మీద పట్టు సంపాదిస్తున్నట్లు చెప్పింది. ఇక ప్రభాస్ గురించి మాట్లాడుతూ.. అతను చాలా రిజర్వ్డ్ పర్సన్ అని.. తన చుట్టూ ఉన్న తక్కువ మందితో మాత్రమే మాట్లాడతాడని మాళవిక వ్యాఖ్యానించింది. ప్రభాస్ వ్యక్తిగా చాలా మంచి వాడని.. తనతో పని చేయడం మంచి అనుభవమని తెలిపింది.




# డేవిడ్ వార్నర్‌కి తెలుగు క్లాసులు చెప్పిన నితిన్, శ్రీలీల..

ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్‌కు తెలుగు క్లాసులు తీసుకున్నారు నటులు నితిన్, శ్రీలీల. వీరిద్దరు జంటగా నటిస్తున్న తాజా చిత్రం ‘రాబిన్‌హుడ్’ ఈ సినిమాకు వెంకీ కుడుముల దర్శకత్వం వహిస్తుండగా.. మైత్రీ మువీ మేకర్స్ నిర్మిస్తుంది. వెన్నెల కిషోర్, రాజేంద్ర ప్రసాద్, డేవిడ్ వార్నర్, తదితరులు ఈ సినిమాలో కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం మార్చి 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఈ మూవీ ప్రీ రిలీజ్ వేడుకను ఇటీవల హైదారాబాద్‌లో నిర్వహించిన విషయం తెలిసిందే. ఈ వేడుకకు క్రికెటర్ డేవిడ్ వార్నర్ ముఖ్య అతిథిగా వచ్చి సినిమా విజయవంతం కావాలని కోరుకోవడంతో పాటు తెలుగులో మాట్లాడి అందరిని అలరించారు. అయితే డేవిడ్ తెలుగులో మాట్లాడటానికి నితిన్, శ్రీలీల ఏ విధంగా సాయం చేశారో చూపిస్తూ.. ఒక ఫన్నీ వీడియోను విడుదల చేసింది చిత్రబృందం. తెలుగు నేర్చుకుంటున్న డేవిడ్ వీడియోను మీరు చూసేయండి.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com